ప్రతిపక్షం

www.prathipaksham.in

శనివారం 15.11.2025 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 235 పేజీలు:12 వెల రూ. 5/-

@prathipaksham | prathipaksham tv telugu

తొలి రోజు టీమిండియాదే పైచేయి 12



‘జూబ్లీ’ కొండలపై కాంగ్రెస్ జెండా

ఉప ఎన్నికలో ‘హస్తం’ ఘన విజయం

24,729 ఓట్ల భారీ మెజారిటీతో నవీన్ గెలుపు

- బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఓటమి
- డిపాజిట్ కూడా దక్కించుకోలేని బీజేపీ
- తొలి రౌండ్ నుంచే కాంగ్రెస్ ఆధిక్యం
- పోస్టల్ బ్యాలెట్ లోనూ కాంగ్రెస్ కే మొగ్గు
- రౌడీయిజం, రిగ్గింగ్ తో గెలిచారన్న సునీత
- ఇది ప్రజల ఆశీర్వాదమన్న నవీన్ యాదవ్
- గెలుపునకు కృషి చేసినవారందరికీ ధన్యవాదాలు
- గాంధీభవన్ లో మిన్నంటిన కాంగ్రెస్ సంబరాలు
- ఇక్కడ తామెప్పుడూ గెలవలేదన్న బీజేపీ నేతలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 14 : ఉత్కంఠ రేపిన జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. 24,729 ఓట్ల మెజార్టీతో నవీన్ యాదవ్ విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థికి 98,988 ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు 74,259 ఓట్లు పోలయ్యాయి. బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డికి 17,061 ఓట్లు వచ్చాయి. ఈ ఉప ఎన్నికలను అధికార కాంగ్రెస్ తో పాటు ప్రధాన ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ పార్టీ తమ స్థానాన్ని నిలుపుకునేందుకు అష్టకష్టాలు పడింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు నువ్వా నేనా అన్న రీతిలో ప్రచారం, పోల్ మేనేజిమెంట్ నిర్వహించాయి. తీరా ఓటర్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి పట్టం కట్టారు. దీంతో బీఆర్ఎస్ నేతలు ఢీలా పడిపోయారు. ప్రతి రౌండులోనూ కాంగ్రెస్ అభ్యర్థి స్పష్టమైన ఆధిక్యాన్ని కనబర్చారు. ఏ రౌండులో కూడా బీఆర్ఎస్‌కు ఆధిక్యం దక్కలేదు.

రెండు ఉప ఎన్నికలలోనూ

అధికారంలోకి వచ్చాక జరిగిన ..:: మిగతా 2లో

కౌంటింగ్ అంతా ఏకపక్షంగా సాగింది. ముందుగా ఉదయం గంటలకు పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ నిర్వహించారు. 101 ఓట్లు పోల్ కాగా,అందులో 96 ఓట్లు మాత్రమే చెల్లుబాటయ్యాయి. ఇందులో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కు 43, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు 25, బీజేపీ అభ్యర్థి దీపక్‌రెడ్డికి 20 ఓట్లు లభించాయి. 58 మంది అభ్యర్థులు పోటీ పడిన జూబ్లీహిల్స్ ఉప పోరులో పోలైన ఓట్లలో నోటా నాలుగో స్థానంలో నిలిచింది. తొలి రౌండ్ ఓట్ల లెక్కింపులో నవీన్ యాదవ్ 8,911 ఓట్లు సాధిస్తే, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు 8,864 ఓట్లు వచ్చాయి.

బిహార్‌లో ఎన్డీయే హవా

బీజేపీ కూటమి ప్రభంజనం

203 స్థానాలలో విజయభేరీ

మొత్తం స్థానాలు 243	
ఎన్డీయే కూటమి	**203**
భారతీయ జనతా పార్టీ	90
జనతాదళ్ -యునైటెడ్	85
లోక్ జనశక్తి పార్టీ-రామ్ విలాస్	19
హిందూస్థానీ ఆవామ్ మోర్చా -సెక్యులర్	5
రాష్ట్రీయ లోక్ మోర్చా	4
మహా ఘట్‌బంధన్	**34**
రాష్ట్రీయ జనతాదళ్	24
ఇండియన్ నేషనల్ కాంగ్రెస్	6
సీపీఐ (-ఎంఎల్)	2
సీపీఎం	1
ఇండియన్ ఇంక్లూజివ్ పార్టీ (ఐఐపీ	1
ఇతరులు	**6**
బహుజన్ సమాజ్ పార్టీ	1
ఏఐఎంఐఎం	5

- అలయెన్స్ కు తిరుగులేని మెజారిటీ
- కుప్పకూలిన మహా ఘట్ బంధన్
- 34 స్థానాల వద్దే ఆగిపోయిన విపక్ష కూటమి
- సింగిల్ డిజిట్ కే కాంగ్రెస్ పరిమితం
- ఉనికిని కాపాడుకున్న లెఫ్ట్ పార్టీలు
- 5 సీట్లతో ఏఐఎంఐఎం సత్తా
- పత్తా లేకుండా పోయిన పీకే జన సురాజ్ పార్టీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

పాట్నా, నవంబర్ 14 : బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించింది. 243 స్థానాలకుగాను 203 స్థానాలలో గెలుపొందింది. మహాఘట్ బంధన్ కూటమి దారుణంగా పరాజయం పాలైంది. 34 స్థానాల వద్దనే ఆగిపోయింది. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ ఎన్నో ఆశలతో స్థాపించిన జన సురాజ్ పార్టీ కనీసం ఖాతా కూడా

..:: మిగతా 2లో

దేశంలో ఉనికిని కోల్పోతున్న కాంగ్రెస్

దేశంలో కాంగ్రెస్ పార్టీ క్రమంగా కనుమరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాజధాని ఢిల్లీస్థాయిలోనూ, క్షేత్ర స్థాయిలోనూ ఆ పార్టీ క్రమంగా పట్టు కోల్పోతుంది. ప్రతి రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలపైన ఆధారపడి ఉండటంతో ఈ దుస్థితి పట్టింది.

11

బిహార్ సీఎంగా నితీశ్ తప్పకో-నున్నారా!

బీజేపీ, జేడీయూతో కూడిన ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించిన నేపథ్యంలో జేడీయూ పార్టీ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్, వెంటనే డిలీట్ చేయడం ఇప్పుడు బిహార్ రాజకీయాలలో తీవ్రమైన చర్చనీయాంశంగా మారింది.

11

ప్రజల తీర్పును గౌరవిస్తున్నాం

- మా పోరాటం కొనసాగుతుంది
- బీఆర్ఎస్సే రాష్ట్రానికి ప్రత్యామ్నాయం
- కష్టపడిన కార్యకర్తలందరికీ ధన్యవాదాలు
- ఈసీ పనితీరుపై ప్రజలలో చర్చ జరగాలి
- జూబ్లీహిల్స్ ఫలితాల తరువాత కేటీఆర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 14: ‘ప్రజల తీర్పును గౌరవిస్తున్నాం. ఈ ఫలితంపై ఆత్మపరిశీలన చేసుకుంటాం. కానీ, మా పోరాటం ఆగదు. ప్రజలతో ఉంటూ, ప్రజల కోసమే పని చేస్తాం’ అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక ఫలితాల అనంతరం తెలంగాణభవన్‌లో పార్టీ సీనియర్ నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఉప ఎన్నికలో పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి, బూత్ స్థాయి శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. రాజకీయ అనుభవం తక్కువ ఉన్నా కూడా పార్టీ అభ్యర్థి విజయం కోసం శ్రమించిన

..:: మిగతా 2లో

‘జూబ్లీ’ గెలుపుతో ‘పెరిగిన బాధ్యత’

- కాంగ్రెస్ కు పెరుగుతున్న ఓట్ల శాతం
- రెండేండ్ల పాలనను గమనించి ప్రజల తీర్పు
- జూబ్లీహిల్స్ అభివృద్ధి ఇకపై మా బాధ్యత
- బీఆర్ఎస్ విష ప్రచారానికి ఇది చెంపదెబ్బ
- కేసీఆర్ ప్రస్తుతం క్రియాశీలంగా లేరు
- కేటీఆర్, హరీశ్ అహంకారం, అసూయ తగ్గించాలి
- రాష్ట్రాభివృద్ధికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సహకరించాలి
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 14: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం తమ బాధ్యతను మరింత పెంచిందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో విజయం సాధించిన సందర్భంగా జూబ్లీహిల్స్‌పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో సీఎం శుక్రవారం మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం హైదరాబాద్ నగర ప్రజలలో కాంగ్రెస్‌పై నమ్మకం క్రమంగా పెరుగుతోందన్నారు. జూబ్లీహిల్స్‌లో విజయం అందించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. నవీన్ విజయం కోసం కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలలో నగరంలో హస్తం పార్టీకి సరైన ఫలితాలు రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండేండ్ల పాలనను ప్రజలు

..:: మిగతా 2లో

‘జైషే’ ఉగ్ర కుట్రను భగ్నం చేసిన తెలుగు ఐపీఎస్

జమ్మూకశ్మీర్ లో ఎస్ఎస్‌పీ గా పనిచేస్తున్న తెలుగు ఐపీఎస్ అధికారి డా. జీవీ సందీప్ చక్రవర్తి నాయకత్వంలో జైషే -మహమ్మద్ ఉగ్రవాద మాడ్యూల్‌ను ధ్వంసం చేసిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

11

సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలపై

ఏసీబీ దాడులు

రాష్ట్రంలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో శుక్రవారం నాడు ఏసీబీ అధికారులు మెరుపు దాడులు చేశారు. మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దాడులు నిర్వహించారు. మంచిర్యాల, మేడ్చల్‌తో పాటు ఖమ్మం జిల్లా వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారు. ఈ దాడులలో భాగంగా పలువురు రైటర్లు, సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు.

..:: 5లో

మంచిర్యాల జిల్లాలో...

ప్రజా ప్రభుత్వ రెండో వార్షికోత్సవానికి రెడీ

- డిసెంబర్ 8, 9న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్
- అన్ని విభాగాలు ఇందుకు సిద్ధం కావాలి
- పాలసీ ఆధారంగానే భవిష్యత్ నిర్ణయాలు
- సమీక్షలో ఉన్నతాధికారులకు సీఎం రేవంత్ సూచన

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 14: తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 డిసెంబర్ 8, 9 తేదీలలో నిర్వహించబోతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. రెండు రోజులపాటు నిర్వహించే ఈ సమ్మిట్ గురించి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, డీజీపీ శివధర్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 'ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా తెలంగాణ రేజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్ 2025 నిర్వహించుకుంటున్నాం. డిసెంబర్ 8న ప్రజా ప్రభుత్వ రెండో వార్షికోత్సవం వైభవంగా నిర్వహించాలి. డిసెంబర్ 9 న తెలంగాణ రేజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్ పాలసీ డాక్యుమెంట్ ను ఆవిష్కరించుకోబోతున్నాం. తెలంగాణ భవిష్యత్ కు రోడ్ మ్యాప్ రూపొందించుకోబోతున్నాం. పాలసీ ఆధారంగానే భవిష్యత్ నిర్ణయాలను తీసుకునేందుకు వీలుంటుంది. పాలసీ డాక్యుమెంట్ తో పెట్టుబడిదారులకు ఒక స్పష్టత వస్తుంది. శాఖల వారీగా పాలసీలకు సంబంధించి సమ్మిట్ లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఈ నెలాఖరులోగా శాఖల వారీగా పాలసీ డాక్యుమెంట్ సిద్ధం చేయాలి. ఈ గ్లోబల్ సమ్మిట్ కు వివిధ దేశాల ప్రతినిధులను ఆహ్వానించండి. వివిధ దేశాల ప్రతినిధులు వస్తున్న నేపథ్యంలో సెక్యూరిటీ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి' అని సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులకు సూచించారు.

బిహార్ ఫలితాలు

ఆశ్చర్యం కలిగించాయి

- మోడీ, షా, ఈసీ ‘ఓట్ చోరీని’ ప్రతిబింబించాయి
- అయినా, మా పోరాటం కొనసాగుతూనే ఉంటుంది
- కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎక్కడా నిరాశ పడవద్దు
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, నవంబర్ 14: బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తనను ఆశ్చర్యానికి గురిచేశాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికలు తొలి నుంచి కూడా న్యాయంగా జరగలేదని ఆరోపించారు. మహా ఘట్ బంధన్‌పై

..:: మిగతా 2లో



భారత్ లో ఉగ్రదాడులకు పాక్ ఊతం

భారత్ అంటే చాలు కండ్లలో నిప్పులు పోసుకుంటుంది పాకిస్తాన్. మన దేశ ప్రగతిని, సాధిస్తున్న ఎదుగుదలను ఏమాత్రం ఓర్వదు. మనతో నిత్యం కవ్వింపులకు పాల్పడుతూనే ఉంటుంది.

11

ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టారు

- ఇక బీఆర్ఎస్, బీజేపీకి చోటు లేదు
- ఈ గెలుపు జీహెచ్ఎంసీ గెలుపునకు నాంది
- టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 14: జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టారని టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు ఈ గెలుపును అంకితం చేస్తున్నామని చెప్పారు. జూబ్లీహిల్స్ తీర్పుతో ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి సెలవు చెప్పారని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికలలోను గుండు సున్నాతో బీఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదని ప్రజలు స్పష్టం చేశారని గుర్తు చేశారు. జూబ్లీహిల్స్ తీర్పుతో రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు చోటు లేదని మరోసారి రుజువు చేశారన్నారు. రానున్న రోజులలోను ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాపాలన కొనసాగుతుందన్నారు. బీసీ బిడ్డ నవీన్ యాదవ్‌ను గెలిపించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ప్రతి కాంగ్రెస్ కార్యకర్తదని వివరించారు. వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు సాధించడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ కనీసం పదేళ్లు అధికారంలో కొనసాగడం తథ్యమని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పనితీరుపట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేసి, భారీ మెజార్టీతో విజయం కట్టబెట్టారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, చైర్మన్లు, పార్టీ బేరర్స్ శ్రమ ఫలితమే ఈ గెలుపు అని పీసీసీ చీఫ్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ విజయం జీహెచ్ఎంసీ ఎన్నికలకు నాంది అన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ లో కార్పొరేటర్ గానూ గెలువలేదు

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 14: జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ గెలుపుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. జూబ్లీహిల్స్‌లో తాము ఎప్పుడూ ఒక కార్పొరేటర్ కూడా గెలవలేదని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు నుంచి ఎప్పుడు గెలవలేదన్నారు. తాము ఉన్నంతలో ప్రయత్నం చేశామని చెప్పారు. ఎంఐఎం మద్దతు, డబ్బుతోనే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ గెలిచిందన్నారు. ప్రత్యేక పరిస్థితులలో జూబ్లీహిల్స్ ఎన్నికలు జరిగాయని, తమ పార్టీ అక్కడ బలహీనంగా ఉందని తెలిపారు. ఓటమిని విశ్లేషించుకుంటామని చెప్పారు. ఓల్డ్ సిటీలో కూడా ఏ పార్టీ గెలవదన్నారు. ప్రజా తీర్పును తాము శిరసా వహిస్తామన్నారు. ఎంఐఎం సహకరించడం వల్లే కాంగ్రెస్ పార్టీ గెలిచిందని వివరించారు. రేవంత్ రెడ్డి ఏం చేశారని అనుకూలంగా ఆయనకు ఓటేయాలని ప్రశ్నించారు. రెండు పార్టీలు కూడా కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాయని ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించలేదని, దీనిపై తాము ఫిర్యాదు చేస్తామన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికలపై దృష్టిపెట్టామని, జీహెచ్ఎంసీ మేయర్ పదవి గెలుచుకోవడమే తమ లక్ష్యమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

42 శాతం బీసీ కోటాకు రాజ్యాంగ భద్రత

- ఆ తరువాతే 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి
- బీసీ జేఏసీ చైర్మన్, ఎంపీ ఆర్. కృష్ణయ్య డిమాండ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 14: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను రాజ్యాంగబద్ధంగా అమలు చేసిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ జేఏసీ చైర్మన్, ఎంపీ ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. పార్టీలపరంగా అవసరం లేదని, చట్టబద్ధంగానే అమలు చేయాలని కోరారు. రిజర్వేషన్లను అడ్డుకుంటే బీసీ వ్యతిరేకులకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ నీలా వెంకటేష్ ఆధ్వర్యంలో బర్కత్‌పుర అరుణా స్టూడియో నుంచి విద్యార్థులు భారీ ర్యాలీని నిర్వహించారు. బీసీ నేతలు సి.రాజేందర్, టి. రాజ్‌కుమార్, పగిళ్ల సతీష్, శివయాదవ్, వంశీకృష్ణ, బానాల అజయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 16న ఇందిరా పార్కు వద్ద న్యాయసాధన దీక్ష నిర్వహిస్తున్నట్లు ఆర్. కృష్ణయ్య చెప్పారు. ఈనెల 20న జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలు అన్ని పట్టణాలలో నిరాహార దీక్షలు, ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జనవరిలో పరేడ్‌గ్రౌండ్‌లో ఐదు లక్షల మందితో బీసీల భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభకు ప్రధాని మోడీని ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ నీలా వెంకటేష్, బీసీ యువజన సంఘంరాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

బిహార్ ఫలితాలు ఆశ్చర్యం కలిగించాయి

మొదటిపేజీ తరువాయి

విశ్వాసంతో ఓట్లు వేసిన లక్షలాది మంది బిహార్ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు రాహుల్ 'ఎక్స్'లో ఓ పోస్టును పెట్టారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే తమ పోరాటమని తెలిపారు. ఈ ఫలితాలను లోతుగా సమీక్షించి, ప్రజాస్వామ్య పరిరక్షణకు తమ ప్రయత్నాలను మరింత సమర్థంగా కొనసాగిస్తామన్నారు. బిహార్ ఎన్నికల ఫలితాలు ప్రధాని మోడీ, కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా, ఈసీ కలిపి చేసిన ఓట్ చోరీని ప్రతిబింబిస్తున్నాయని రాహుల్ విమర్శించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బిహార్ ప్రజల నిర్ణయాన్ని గౌరవిస్తామన్నారు. అయినప్పటికీ,రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే శక్తులకు వ్యతిరేకంగా పోరాడుతామని స్పష్టం చేశారు. బిహార్ ఎన్నికల ఫలితాలను నిశితంగా అధ్యయనం చేశాకనే వివరంగా మాట్లాడుతామన్నారు. మహా ఘట్‌బంధన్‌కు ఓటు వేసిన బిహార్ ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. నిరాశకు గురి కావద్దని కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు మన పోరాటం కొనసాగుతూనే ఉంటుందని చెప్పారు.

ప్రజల తీర్పును గౌరవిస్తున్నాం

మొదటిపేజీ తరువాయి

నేతల కృషిని ప్రశంసించారు. మాగంటి సునీతను అభినందించారు. ఈ ఎన్నికలో తమ పార్టీకి గణనీయ ఓటు శాతం వచ్చిన విషయం సంతృప్తిని కలిగించిందని, ప్రతి ఎన్నికను గెలవాలనే ధృఢ సంకల్పంతోనే పార్టీ ముందుకు సాగుతుందని చెప్పారు. గత రెండేండ్లుగా ప్రధాన ప్రతిపక్షంగానే ప్రజా సమస్యలను బలంగా ఎత్తి చూపుతున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. తమ ప్రభుత్వ కాలంలో జరిగిన అభివృద్ధిని, 5,300 కోట్ల రూపాయల ప్రాజెక్టుల రూపంలో ప్రజల ముందు ఉంచామని, మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయని వాగ్దానాలను 'బాకీ కార్డు' రూపంలో వెల్లడించామని చెప్పారు. ఎన్నికల ప్రక్రియలో చోటుచేసుకున్న అక్రమాలపై ఎన్నో ఫిర్యాదులు చేసినప్పటికీ చర్యలు లేవన్నారు. ఎన్నికల కమిషన్ పనితీరుపై చర్చ జరగాల్సిన అవసరముందన్నారు. దొంగ ఓటర్లు, నకిలీ ఓటర్ కార్డుల పంపిణీ వంటి అంశాలను ముందుగానే పార్టీ హెచ్చరించిందని తెలిపారు.

తమ పార్టీ ఒత్తిడి వల్లనే

ప్రస్తుత ప్రభుత్వంపై తమ పార్టీ ఒత్తిడి వల్లనే గ్యారంటీల అమలుపై ముఖ్యమంత్రి సమీక్షలు చేపట్టాల్సి వచ్చిందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. మైనారిటీలకు మంత్రివర్గంలో చోటు, ఆటో రంగ సమస్యలు వంటి అంశాలపై బీఆర్ఎస్ గళమెత్తిన తర్వాతే ప్రభుత్వం స్పందించారని అన్నారు. బీజేపీ డిపాజిట్ కోల్పోయిన ఈ ఎన్నికలో కాంగ్రెస్-బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల తరువాత బీఆర్ఎస్‌నే ప్రత్యామ్నాయం అని ప్రజలు నిరూపించారని పేర్కొన్నారు. ప్రచార సమయంలో తమ కుటుంబసభ్యులను కోల్పోయినా, ఎన్నికల పనిలో పాల్గొన్న హరీశ్ రావు, ఎమ్మెల్సీ రవీందర్ రావును ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

'జూబ్లీ' కొండలపై కాంగ్రెస్ జెండా

రెండు ఉప ఎన్నికలలోనూ కాంగ్రెస్ గెలిచింది. 2024 జూన్ లో జరిగిన కంటోన్మెంట్ ఉప ఎన్నికలోనూ కాంగ్రెస్ విజయం సాధించింది. ప్రస్తుతం జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీతో పాటు చిన్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల డిపాజిట్ గల్లంతైంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గ చరిత్రలో అత్యధిక మెజారిటీ కాంగ్రెస్ పార్టీ సాధించింది. తనని నమ్మి ఓటు వేసిన అందరికీ నవీన్ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డికి, తన గెలుపుకోసం విశేష కృషిచేసిన మంత్రులు, ఎంపీలు, కాంగ్రెస్ నేతలందరికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఎన్నో దుష్ప్రచారాలు చేశారని అన్నారు. ప్రజలు వారి ఓటుతో వాటిని తిప్పికొట్టారని అన్నారు. నియోజకవర్గ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని స్పష్టం చేశారు. పదేళ్లలో బీఆర్ఎస్ చేసిందేమీ లేకనే ప్రచారంలో చెప్పుకోలేదని అన్నారు. కేవలం తన గురించి దుష్ప్రచారం చేసి గెలవాలని బీఆర్ఎస్ చూసిందని ఆరోపించారు.

రౌండ్‌వారీగా ఫలితాలు

	నవీన్ యాదవ్	మాగంటి సునీత	దీపక్ రెడ్డి
మొదటి రౌండ్	8,911	8,864	2,167
రెండో రౌండ్	8,963	6,015	1,308
మూడో రౌండ్	11,082	8,083	1,866
నాలుగో రౌండ్	9,567	6,020	1,935
ఐదో రౌండ్	12,283	8,983	1,273
ఆరో రౌండ్	9,553	6,615	1,666
ఏడో రౌండ్	9,939	5,939	1,688
ఎనిమిదో రౌండ్	9,293	7,418	2,320
తొమ్మిదో రౌండ్	9,544	2,105	2,105
పదో రౌండ్	7,561	6,753	713
మొత్తం	98,988	74,259	17,061
నోటా	924		

58 మంది అభ్యర్థులు పోటీ

కౌంటింగ్ అంతా ఏకపక్షంగా సాగింది. ముందుగా ఉదయం గంటలకు పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ నిర్వహించారు. 101 ఓట్లుపోల్ కాగా,అందులో 96 ఓట్లు మాత్రమే చెల్లుబాటయ్యాయి. ఇందులో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కు 43, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు 25, బీజేపీ అభ్యర్థి దీపక్‌రెడ్డికి 20 ఓట్లు లభించాయి. 58 మంది అభ్యర్థులు పోటీ పడిన జూబ్లీహిల్స్ ఉప పోరులో పోలైన ఓట్లలో నోటా నాలుగో స్థానంలో నిలిచింది. తొలి రౌండ్ ఓట్ల లెక్కింపులో నవీన్ యాదవ్ 8,911 ఓట్లు సాధిస్తే, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు 8,864 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి 2,167 ఓట్లు వచ్చాయి. మొత్తంగా తొలి రౌండ్ ముగిసేసరికి కాంగ్రెస్ అభ్యర్థికి 47 ఓట్ల ఆధిక్యం లభించింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో గాంధీభవన్ లో కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. పెద్ద ఎత్తున నేతలు, కార్యకర్తలు అక్కడికి చేరుకుని బాణాసంచా కాల్చారు. బ్యాండ్ మేళాలలో డ్యాన్సులు చేశారు. పరస్పరం మిఠాయిలు పంచుకుంటూ సోనియా, రాహుల్ గాంధీ రేవంత్ రెడ్డికి అనుకూలంగా నినాదాలు చేశారు.

బిహార్‌లో ఎన్డీయే హవా

మొదటిపేజీ తరువాయి

తెరవలేకపోయింది. బిహార్ ప్రజలు మరోసారి అభివృద్ధి నినాదానికే మద్దతు పలికారు. వివిధ ఎగ్జిట్ పోల్స్ అంచనాలను మించి ఎన్డీయే కూటమికి అద్భుత విజయం కట్టబెట్టారు. బీజేపీ, జేడీయూ, ఎల్జేపీ రామ్‌విలాస్ పాసవాన్, హిందూస్తానీ ఆవామ్ మోర్చా, రాష్ట్రీయ లోక్‌మోర్చా పార్టీలు కూటమిగా ఏర్పడి పోటీ చేశాయి. బీజేపీ, జేడీయూ చెరో 101 స్థానాలలో పోటీ చేయగా, కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్ నేతృత్వంలోని ఎల్‌జేపీరామ్‌విలాస్ పార్టీ 29 చోట్ల పోటీ చేసింది. హిందూస్థానీ ఆవామ్ మోర్చా, రాష్ట్రీయ లోక్‌మోర్చాలు చెరో ఆరు స్థానాలకు పోటీ చేశాయి. కాగా, బీజేపీ 90, జేడీయూ 85, ఎల్జేపీ రామ్‌విలాస్ పార్టీ 19 స్థానాలలో గెలుపొందాయి. హిందూస్తానీ ఆవామ్ మోర్చా 5, రాష్ట్రీయ లోక్‌మోర్చా 4 చోట్ల విజయం సాధించాయి. ఉప ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత సామ్రాట్ చౌదరీ తారాపూర్‌లో 45,843 ఓట్ల మెజారిటీతో గెలుపొందగా, మరో డిప్యూటీ సీఎం విజయ్ కుమార్ సిన్హా లఖిసరాయ్‌లో గెలిచారు. దానాపూర్‌లో రామ్ కృపాల్ యాదవ్ 29,133 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. జానపద గాయని, బీజేపీ అభ్యర్థి మైథిలీ ఠాకూర్ అలీనగర్ నుంచి విజయం సాధించారు. హత్యకేసులో అరెస్ట్ అయి జైలులో ఉన్న జేడీయూ అభ్యర్థి అనంత్ కుమార్ సింగ్ మొకామా నుంచి 28 వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

143 స్థానాలకు 24 స్థానాలే!

మహా ఘట్‌బంధన్ 34 స్థానాలలో మాత్రమే గెలిచింది. ఆర్జేడీ 143 స్థానాలలో పోటీ చేసినప్పటికీ 24 స్థానాలు మాత్రమే గెలుచుకోగలిగింది. ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్ రాఘోపూర్‌లో 14 వేలకు పైగా మెజారిటీతో గెలుపొందారు. కాంగ్రెస్ 61 స్థానాలలో పోటీ చేయగా, 6 సీట్లు మాత్రమే సాధించుకుంది. వామపక్ష పార్టీలలో సీపీఎం ఒక స్థానంలో, సీపీఐ ఎంఎల్ రెండుస్థానాలలో, ఐఐపీ ఒక స్థానంతో సరిపెట్టుకున్నాయి. వికాసీల్ ఇన్సాన్ పార్టీ కనీసం ఖాతా కూడా తెరవలేకపోయింది. కాగా లాలూ ప్రసాద్ యాదవ్ మరో కుమారుడు, జేజేడీ అభ్యర్థి తేజ్ ప్రతాప్ యాదవ్ మహువాలో పోటీ చేసి ఘోరంగా ఓడిపోయారు. కాగా, ఏఐఎంఐఎం బిహార్‌లోని ముస్లిం మెజారిటీ స్థానాలలో తన ఉనికిని నిరూపించుని ఐదు స్థానాలలో గెలిచింది. బహుజన్ సమాజ్ పార్టీ ఒక స్థానంలో గెలుపొందింది.

'జూబ్లీ' గెలుపుతో 'పెరిగిన బాధ్యత'

మొదటిపేజీ తరువాయి

నిశితంగా పరిశీలించి ఈ తీర్పును ఇచ్చారని పేర్కొన్నారు. ఎన్నికలలో నెగ్గితే ఉప్పొంగడం, ఓడితే కుంగిపోవడం కాంగ్రెస్ కు తెలియదన్నారు. ప్రతిపక్షంలో ఉంటే ప్రజా సమస్యలపై పోరాడటం, అధికారంలో ఉంటే సమస్యలను పరిష్కరించడమే కాంగ్రెస్ పార్టీకి తెలుసన్నారు. అందుకే ప్రజలలో కాంగ్రెస్ పార్టీపై ఇప్పటికీ ఆదరణ తగ్గలేదన్నారు. పోలైన ఓట్లల్లో 51 శాతం ఓట్లు కాంగ్రెస్ కు, 38 శాతం బీఆరెస్ కు , 8 శాతం బీజేపీ ఓటు వేశారని సీఎం వివరించారు. నగరాన్ని అభివృద్ధి చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

ప్రజలు అందరినీ గమనిస్తారు

'మన పాత్రలను, వ్యవహార శైలిని ప్రజలు గమనిస్తున్నారని, అందుకే ఈ ఎన్నికలో ప్రజలు విస్పష్టంగా తీర్పు ఇచ్చారని' సీఎం తెలిపారు. ఇది బాధ్యతగా భావించి నగరాన్ని విశ్వనగరంగా అభివృద్ధి చేయాలని సంకల్పించామన్నారు. మెట్రో విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్లు, మూసీ పునరుజ్జీవం, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, గోదావరి జలాల తరలింపు లాంటి కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారాలతో ప్రభుత్వంపై బీఆర్ఎస్ విషం చిమ్మిందని మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్షం అభివృద్ధికి సహకరించకపోగా ప్రతీ సందర్భంలో అవహేళన చేసే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. హైడ్రా, మూసీ విషయంలో ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులను రాబట్టుకోకుండా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సహాయ నిరాకరణ చేస్తున్నారని మరోమారు ధ్వజమెత్తారు. వీలైనంత మేరకు కేంద్రంలో అడ్డు తగులుతున్నారని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలలో కిషన్ రెడ్డే అభ్యర్థిగా మారి పనిచేస్తే 17 వేల ఓట్లు వచ్చాయన్నారు. ఈ ఫలితాల తరువాతైనా కిషన్ రెడ్డి తన వ్యవహార శైలి మార్చుకోవాలని సూచించారు. ఇది భూకంపం వచ్చే ముందు వచ్చే అలర్ట్ లాంటిదన్నారు. వ్యవహారశైలి మార్చుకోకపోతే భూకంపం వచ్చి కాలగర్భంలో కలిసిపోతారంటూ హెచ్చరించారు. రాష్ట్ర ప్రాజెక్టులకు అనుమతులు తెచ్చే బాధ్యత కేంద్రమంత్రులు, బీజేపీ ఎంపీలపై ఉందన్నారు.

కేటీఆర్ ది అహంకారం, హరీశ్ ది అసూయ

హరీశ్ రావు, కేటీఆర్ అసూయ తగ్గించుకోవాలని కోరారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదన్నారు. ప్రజలు వారి అసూయను, అహంకారాన్ని గమనిస్తున్నారని, ఆ ఇద్దరి నాయకత్వాన్ని ఎలా ఆమోదిస్తారని భావిస్తున్నారని ప్రశ్నించారు. సాధారణ ఎన్నికలకు ఇంకా మూడేండ్లు ఉందని, అభివృద్ధికి సహకరించాలని కోరారు. తప్పుడు ప్రచారం చేసి ప్రతిష్ట కోల్పోవద్దని కొన్ని మీడియా సంస్థలకు హితవు పలికారు. జూబ్లీహిల్స్‌లో తమకు మద్దతు ఇచ్చిన ఎంఐఎంకు ధన్యవాదాలు సీఎం తెలిపారు. అసదుద్దీన్ ఒవైసీకి కాంగ్రెస్ కార్యకర్తల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. బిహార్ ఫలితాలను ఇంకా తాను ఇంకా సమీక్షించలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై ఈనెల 17న జరిగే కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. కేసీఆర్ ప్రస్తుతం క్రియాశీల రాజకీయాలలో లేరని, ఆయన ఆరోగ్యం కూడా అంతగా సహకరించడం లేదని రేవంత్ అన్నారు. కేసీఆర్ గురించి ఇప్పుడు స్పందించాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు.

సీఎంను కలిసిన మంత్రులు, పార్టీ నేతలు

జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ అభ్యర్థి ఘన విజయం కాంగ్రెస్ పార్టీలో జోష్ ను నింపింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు, పార్టీ నాయకులు ఆయన నివాసంలో కలిసి అభినందనలు తెలియజేసారు. ఆయన కూడా వారికి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. మునుముందు కూడా ఇదే స్ఫూర్తితో పని చేయాలని అకాంక్షించారు. జూబ్లీహిల్స్ విజయానికి కృషిచేసినవారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

–ప్రతిపక్షం, హైదరాబాద్

బిహార్ అసెంబ్లీ ఫలితాలు ఆశ్చర్యపరిచాయి. ఈ ఎన్నికల ప్రక్రియలో మొదటి నుంచీ అన్యాయం జరిగింది. అందుకే తాము విజయం సాధించలేకపోయాం. రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే పోరాటం చేస్తున్నాం. ఓటమిపై కాంగ్రెస్, ఇండియా కూటమి లోతుగా సమీక్షించుకుని, మరింత బలంగా తిరిగివస్తాం.

- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

కాళేశ్వరం నిర్వాసితులకు న్యాయం చేయాలి

- ఏడుపాయల అభివృద్ధి పనులను పూర్తి చేయాలి
- గురుకుల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి
- మెదక్ జిల్లాలో కవిత 'జనం బాట'

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 14: కాళేశ్వరం నిర్వాసితులకు న్యాయం చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కోరారు. మెదక్ జిల్లాలో జాగృతి జనంబాట కార్యక్రమం సందర్భంగా కవిత శుక్రవారం విస్తృత పర్యటన నిర్వహించారు. రోజంతా వివిధ ప్రాంతాలలో ప్రజలను కలుసుకుని, సమస్యలు తెలుసుకుని, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్యాకేజీ 18కి చెందిన ట్రిపుల్ ఆర్ నిర్వాసితులతో సమావేశమయ్యారు. ఆర్ఆర్ఆర్ నిర్వహణలో జరిగిన లోపాలను రైతులు వివరించారు. సర్వే మార్పులు, హైటెన్షన్ వైర్లు, రైల్వే లైన్ల విషయంలో తీవ్ర అన్యాయం జరిగిందని ఫిర్యాదు చేశారు. రైతులకు భూములు, ఇళ్లకు సరైన ధరలు ఇవ్వడం లేదని కవిత అన్నారు. రైతులు చెప్పేవన్నీ న్యాయమేనని, సరైన ధర వచ్చినప్పుడే సంతకం చేస్తామనడం రైతుల హక్కు అని చెప్పారు. మల్లన్న సాగర్ నిర్వాసితులు కొనుగోలు చేసుకున్న భూములు ప్రాజెక్ట్ కిందకు రావడం అన్యాయమన్నారు. రెండు సార్లు భూములు కోల్పోయే కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. అవసరమైతే హైదరాబాద్‌లో పోరాటం చేస్తామని కవిత స్పష్టం చేశారు.

ఏడుపాయల అమ్మవారి దర్శనం

తరువాత ఆమె మెదక్‌లోని వనదుర్గ ఏడుపాయల అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. ప్రతి సంవత్సరం ఈ ప్రాంతం 60-70 రోజులు ముంపునకు గురవుతుందని పేర్కొంటూ, అమ్మవారి ఆలయం ముంపునకు గురికాకుండా ఘనపూర్ ఆనకట్ట ఎత్తు పెంచాలని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. దానికి సంబంధించిన నిధులు ఇప్పటికే మంజూరు అయినప్పటికీ పనులు ఆగిపోయాయని, వాటిని త్వరగా ప్రారంభించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు అవసరమైన పరిహారం, భూములు త్వరితగతిన ఇవ్వాలని కూడా ఆమె సూచించారు. కొల్చారం ఎస్టీ బాలుర గురుకుల పాఠశాలను సందర్శించిన కవిత, అక్కడ ఉన్న పరిస్థితులను చూసి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కొల్చారంలో పుట్టిన మలినాద సూరి మహాకవి కాళిదాసును ప్రపంచానికి పరిచయం చేశారని గుర్తుచేసారు. ఈ ప్రాంతాన్ని సంస్కృత వర్సిటీ కేంద్రంగా అభివృద్ధి చేయాలని సంస్కృత పండితుల కోరిక అని చెప్పారు.

మెదక్ చర్చిని సందర్శించిన కవిత

మెదక్ జిల్లాకు మెతుకు లేనప్పుడు అన్నం పెట్టిన స్థలంగా మెదక్ చర్చి గుర్తింపు పొందిందని కవిత అన్నారు. మెదక్ చర్చిని సందర్శించిన సందర్భంగా కవిత మాట్లాడారు. ఆసియాలోనే అతిపెద్ద చర్చిలలో ఒకటైన మెదక్ చర్చికి విశేష ప్రాముఖ్యత ఉందని పేర్కొన్నారు. చర్చి శతవత్సరోత్సవాలకు తాను కూడా హాజరైనట్లు గుర్తుచేసుకున్న ఆమె, ఆ సందర్భంగా చర్చి అభివృద్ధికి ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదని అన్నారు. ఉద్యమాల ఖిల్లాగా పేరుగాంచిన ఈ ప్రాంతంలో ప్రజల పరిస్థితి మాత్రం ఇప్పటికీ అభివృద్ధి చెందలేదని ఆమె పేర్కొన్నారు. జిల్లాలోని సమస్యలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు.

ఘనంగా బాలల దినోత్సవం

చిన్నారులకు బాలమిత్ర అవార్డులు ప్రదానం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 14: బాలల దినోత్సవ సందర్భంగా శుక్రవారం రవీంద్ర భారతిలో రాష్ట్రస్థాయి బాలమిత్ర అవార్డులు ప్రదానోత్సవం జరిగింది. బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ తండ్రి వలస శంకరయ్య జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ సంఘ సేవకులు ముదిగంటి విష్ణువర్ధన్ రెడ్డి హాజరై కేక్ కట్ చేసారు. అందెశ్రీ మృతికి సంతాపసూచికగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఢిల్లీ బాంబు బ్లాస్టింగ్ మృతులకు సంతాపాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయిలో బాలమిత్ర అవార్డులు తీసుకున్న విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. విద్యార్థులు భారతీయ కలలు సంస్కృతి సాంప్రదాయాలను పాటించాలని పేర్కొన్నారు. చిన్నతనం నుండే క్రీడల పట్ల కలల పట్ల శ్రద్ధ పెట్టాలన్నారు విద్యలో మంచి మార్కులు సాధించి సమాజంలో గొప్ప వ్యక్తులుగా తయారు కావాలని, తల్లిదండ్రుల కలలు నిజం చేసేందుకు నిరంతరంగా శ్రమించాలని అన్నారు. వలస సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా తమ ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలకాలని పేర్కొన్నారు. విజ్ఞానం, వికాసం, క్రీడలు, సంస్కృతి, సాంప్రదాయం, కట్టుబొట్టు, మన భారతీయ నాగరికత పెంపొందించేందుకు కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంగీత విద్వాంసులు గిటార్ రావు, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సిబ్బంది హేమావతి, తెలంగాణ జానపద సకల వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు తాళ్ల పెల్లి సంధ్య గౌడ్, మోహన్ గాంధీ పాల్గొన్నారు.

నేడు బిహార్, రేపు బెంగాల్

- రాహుల్ గాంధీ పని అయిపోయింది
- కేంద్ర మంత్రి బండి సంజయ్‌వ్యాఖ్యలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 14 : నేడు బిహార్‌లో విజయం సాధించామని, రేపు పశ్చిమ బెంగాల్‌లో విజయం సాధిస్తామని కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ఫలితాలపై శుక్రవారం నాడు ఆయన నాంపల్లి రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. బిహార్‌లో బీజేపీ 92 స్థానాలలో గెలిచిందన్నారు. కాంగ్రెస్ ఉప ప్రాంతీయ పార్టీగా మారిందన్నారు. రాహుల్ గాంధీ పని అయిపోయిందని, ఇక ఆయన పబ్జి ఆడుకోవాలంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపుపై మాట్లాడుతూ, ఎంఐఎం అభ్యర్థి అని చెప్పారు. తెలంగాణలో హిందూ సమాజం ఒక్కటి కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో ప్రతిపక్ష నేత ఎవరంటూ సందేహం వ్యక్తం చేశారు. అసెంబ్లీకి రాకుండా ప్రధాన ప్రతిపక్ష నేత ఎలా అవుతారంటూ కేసీఆర్‌ను పరోక్షంగా విమర్శించారు. జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ రాకపోయినా, వచ్చే ఎన్నికలలో బీజేపీ అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ఖచ్చితంగా గెలుస్తుందని తెలిపారు. గ్రామాల అభివృద్ధి జరగాలంటే బీజేపీని గెలిపించాలని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన సూచించారు.

గ్రామగ్రామాన సంబరాలు చేయండి

- 'జూబ్లీ' గెలుపు ప్రజాపాలన విజయం
- బీఆర్ఎస్, బీజేపీ కుట్రలు చెల్లలేదు
- పార్టీ శ్రేణులకు మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 14: జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీతో గెలవడంపై గ్రామగ్రామాన సంబరాలు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రజాపాలన ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఫలితమే ఈ విజయమని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి ప్రభుత్వాన్ని బద్నాం చేసే ప్రయత్నం చేసాయన్నారు. గ్రామీణ ప్రాంతాలలో రైతులకు అండగా, పేద ప్రజలకు ఉచిత విద్యుత్, సన్న బియ్యం, రేషన్ కార్డులు, సున్నా వడ్డీ రుణాలు, ఉద్యోగాలు, రుణమాఫీ, రైతుభరోసాలాంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. జూబ్లీహిల్స్ గెలుపును ప్రతి కార్యకర్త తమ గెలుపుగా భావించి అంతటా సంబరాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

'నీల్ బత్తె సన్నాట' సినిమా చిన్నారులకు ఆదర్శం

- కలలు కనండి, కష్టపడండి, సాకారం చేసుకోండి
- చిల్డ్రన్స్ ఫిలిం ఫెస్టివల్ లో కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

ప్రతిపక్షం కరీంనగర్ బ్యూరో, నవంబర్ 14: 'నీల్ బత్తె సన్నాట' హిందీ సినిమాను చిన్నారులు ఆదర్శంగా తీసుకొని లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ పమేలా సత్పతి పిలుపు నిచ్చారు. ఈ సినిమాలో ముఖ్య ఉద్దేశం ఏంటంటే అందులో తల్లి పాత్రలో ఒక పనిమనిషి ఉంటుందని ఆమె కష్టపడుతూ తన కూతుర్ని ఐఏఎస్ వరకు చదివిస్తుందన్నారు. సహజంగా డాక్టర్ కూతురు డాక్టరు ఇంజనీరు కూతురు ఇంజనీరుగా అవుతుంటారని పనిమనిషి కూతురు ఐఏఎస్ వరకు చదివించడం అద్భుతమనీ, లక్ష్య సాధనకు ఈ సినిమా ప్రేరణగా నిలుస్తుందన్నారు. ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో ఫిలిం భవన్ లో మూడు రోజులపాటు జరిగే చిల్డ్రన్స్ ఫిలిం ఫెస్టివల్ ను కలెక్టర్ శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'నీల్ బత్తె సన్నాట' అనే హిందీ సినిమాను కేజీబీవీ తో పాటు ప్రభుత్వ పాఠశాలలలో ప్రదర్శిస్తున్నామన్నారు. ఈ సినిమాను విద్యార్థులు, తల్లిదండ్రులందరూ చూడాలని కోరారు. ' మీరు కలలు కనండి, కష్టపడండి, వాటిని సాకారం చేసుకోండి, జీవితంలో ఉన్నత భవిష్యత్తును నిర్మించుకోండి' అని సూచించారు. అనంతరం కలెక్టర్ ఆలపించిన 'చిన్నారి పిచ్చుక' వీడియోతో పాటు పంచతంత్ర బాలల చిత్రాన్ని ప్రదర్శించారు. భగవతి స్కూల్ విద్యార్థులు వీటిని వీక్షించారు. కార్యక్రమంలో కరీంనగర్ ఫిలిం సొసైటీ అధ్యక్షుడు పొన్నం రవిచంద్ర, అడ్వైజర్ వరాల మహేశ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీగౌతమ్ ఉపాధ్యక్షుడు సయ్యద్ ముజఫర్ భగవతి విద్యాసంస్థల చైర్మన్ రమణారావు, అన్నవరం దేవేందర్, కందుకూరి అంజయ్య, వెంకటేశం, దశరథం, సురేష్, చెన్న అనిల్ కుమార్, పీఎస్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక తెలంగాణ నిర్మాణమే ధ్యేయం

- మొదటి ప్రధానిగా నెహ్రూ సేవలు అమోఘం
- విజ్ఞానదర్శిని సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 14: వైజ్ఞానిక తెలంగాణ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. విజ్ఞానదర్శిని ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో శుక్రవారం ఏర్పాటుచేసిన దివంగత ప్రధాని నెహ్రూ '80వ సైంటిఫిక్ టెంపర్ మెంట్ సెలబ్రేషన్స్ లో ఆయన ప్రసంగించారు. వైజ్ఞానిక అభివృద్ధికి ప్రయోగశాలగా తెలంగాణ రాష్ట్రాన్ని మార్చడానికి ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. క్యాబినెట్ సభ్యులంతా విద్యావంతులని, తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో ప్రపంచంతో పోటీ పడేలా యావత్ క్యాబినెట్ కృషి చేస్తుందని చెప్పారు. వైజ్ఞానికంగా ముందుచూపుతో సమాజాన్ని ముందుకు నడిపించిన పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఈ దేశానికి తొలి ప్రధానిగా పదవి బాధ్యతలు చేపట్టకపోయి ఉండి ఉంటే భారత దేశంలో నేటి పరిస్థితిని ఊహించుకోలేకపోయే వారమని అన్నారు. నెహ్రూ దేశానికి తొలి ప్రధాని కావడంతో కేవలం సైన్స్ మాత్రమే కాదు ప్రజాస్వామ్యంలోనూ ప్రపంచంతో పోటీ పడేందుకు కారణమైందన్నారు. 1947 అర్ధరాత్రి ఈ దేశానికి స్వాతంత్రం లభించిందని, రాష్ట్రానికి ఒక సంవత్సరం తర్వాత స్వాతంత్రం లభించిందని వివరించారు. నెహ్రూ వైజ్ఞానిక ఆలోచనతో సైంటిఫిక్ టెంపర్మెంటుతో పునాదులు వేయకపోతే ఈరోజు దేశ ప్రజలు ఇబ్బంది పడేవారన్నారు. నెహ్రూ పంచవర్ష ప్రణాళికలు రూపొందించి అందులో ఏ అంశంపై దృష్టి పెట్టాలనేది మేధావులతో చర్చించి ఖరారు చేశారని తెలిపారు. వ్యవసాయం, పరిశ్రమల రంగాలపై దృష్టి పెట్టి ఆ రెండిటినీ కలుపుతూ మిశ్రమ ఆర్థిక విధానాలు రూపొందించారు, ఈ దేశంలో సోషలిజం అనే ఆలోచనను విస్తృతం చేశారని డిప్యూటీ సీఎం వివరించారు.

పుస్తకాలు చదివితేనే విజ్ఞానం

- కవి, రచయిత యాడవరం చంద్రకాంత్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 14: పుస్తకాలు మంచి నేస్తాలని వాటిని చదవటం వల్ల విద్యార్థులకు మేలు జరుగుతుందని భవిష్యత్తులో గొప్ప వారిగా తయారవుతారని రాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మారెడ్డి అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా కవి, రచయిత, తెలుగు ఉపాధ్యాయులు యాడవరం చంద్రకాంత్ విద్యార్థులకు బాల సాహిత్య పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులందరికీ మంచి పుస్తకాలను అందించడం గొప్ప విషయమన్నారు. ప్రపంచ విజ్ఞానమంత పుస్తకాల్లో ఉంటుందని , పిల్లలు చదవటం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈశ్వరయ్య ,అర్జున్, గణేశ్, కుమారస్వామి పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు విడుదల చేయాలి

- రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్ బాబు

ప్రతిపక్షం ప్రతినిధి, ఖమ్మం, నవంబర్ 14: రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఖమ్మం జిల్లా కౌన్సిల్ సమావేశం కె. కృష్ణయ్య అధ్యక్షతన జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగింది. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు విడుదల చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. వారి బలవన్మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఈ నెలాఖరులోగా రిటైర్డ్ ఉద్యోగులందరికీ ఆరోగ్య కార్డులు మంజూరు చేస్తామని, బకాయిలు 700 కోట్లు విడుదల చేస్తామని సీఎం హామీ ఇవ్వడంతో 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. పెండింగులో ఉన్న జీపీఎఫ్. గ్రాట్యుటీ. సరెండర్ లీవ్. కమ్యూటేషన్, తదితర ఆర్థిక ప్రయోజనాలను వెంటనే విడుదల చేయకపోతే ప్రత్యక్ష కార్యచరణకు పూనుకుంటామని హెచ్చరించారు. మహబూబాద్ జిల్లా అధ్యక్షులు మైసా నాగయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం పెన్షనర్ల పట్ల ఏ విధంగా వ్యవహరించిందో, అదే విధంగా ప్రస్తుత ప్రభుత్వం కూడా సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తూ ఆవేదనకు గురి చేస్తున్నదని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సుబ్బయ్య నివేదికను ప్రవేశపెట్టారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు పి. సాంబశివరావు రఘుపతి రెడ్డి, ఖాజా మొయినుద్దీన్ పాల్గొన్నారు.

పరదేశి నాయుడును స్మరించిన పోలీసులు

- సోమశిల దుర్ఘటనకు 32 యేండ్లు

ప్రతిపక్షం ప్రతినిధి, మహబూబ్ నగర్, నవంబర్ 14: సోమశిల ఘటనలో వీరమరణం పొందిన అప్పటి ఎస్పీ పరదేశి నాయుడుకు శుక్రవారం నాడు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం, వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో పోలీసులు నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి, విగ్రహానికి అడిషనల్ ఎస్పీ ఎన్బీ రత్నం పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ 1993 నవంబర్ 14న సోమశిల వద్ద ఎస్పీ, సిబ్బంది ప్రయాణిస్తున్న బస్సును నక్సల్స్ మందుపాతరతో పేల్చేశారన్నారు. ఈ ఘటనకు 32 యేండ్లు పూర్తైనా ఆ విపరీత దుఃఖం ఇప్పటికీ మరువలేనిదని పేర్కొన్నారు. ఆ సంఘటన పోలీస్ వ్యవస్థలో కలిగించిన బాధాకర జ్ఞాపకాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీసీఆర్బీ డీఎస్పీ రమణా రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్ స్పెక్టర్ బాలరాజు , వన్ టౌన్ ఇన్ స్పెక్టర్ అప్పయ్య, వుమెన్స్ పీఎస్ సీఐ శ్రీనివాస్, ఆర్ఐ కృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయే అభివృద్ధి ఇంజనీర్లతో సాధ్యం

- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్
- ఘనంగా 'తెలంగాణ ఇరిగేషన్ డే' ఉత్సవాలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 14 : చరిత్రలో నిలిచిపోయే అభివృద్ధిని సాధించడం ఇంజనీర్లతోనే సాధ్యమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ఇందుకు ఆదర్శం మనకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని పేర్కొన్నారు. సమస్య తెలుసుకోవడంతో పాటు పరిష్కారం చూపడం కూడా ముఖ్యమని అన్నారు. మూసీ నదికి వరదలు నివారణతో పాటు నగరానికి తాగునీటి సమస్య పరిష్కారానికి జంటజలశయాలను నిర్మించి చరిత్రలో మోక్షగుండం నిలిచిపోయారన్నారు. 'ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ తెలంగాణ స్టేట్ సెంటర్' ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్ లో 'తెలంగాణ ఇరిగేషన్ డే' సందర్భంగా ఇంజనీర్స్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ డ్రెయినేజీ, ట్రాఫిక్, వాతావరణ మార్పులపై ఇంజనీర్లు ఖచ్చిత పరిష్కార మార్గాలను చూపే విధంగా కృషిచేయాలన్నారు. 2025లో కూడా పాత పద్ధతులలోనే సీవరేజ్, ట్రాఫిక్ వంటి సమస్యలను పరిష్కరించడం సరికాదన్నారు. మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకొని శాశ్వత పరిష్కార మార్గాలను చూపించాలని అన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నూతన ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. తెలంగాణ రాష్ట్రానికి నీటి వనరుల కోసం ఎంతగానో కృషిచేసిన ఇంజనీర్ విద్యాసాగర్ రావు జయంతి సందర్భంగా జరుపుకునే ఇరిగేషన్ డే సందర్భంగా ఇంజనీర్లను అవార్డులతో సత్కరించుకోవడం సంతోషంగా ఉందని ఐఈఐ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ రమణ నాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఐఈఐ కౌన్సిల్ మెంబర్ ఎస్.సత్యనారాయణ, డాక్టర్ రంగారెడ్డి, చీఫ్ సైన్స్ హెచ్.వి.ఎస్. సత్యనారాయణ, ఐఈఐ సెక్రటరి మర్రి రమేష్, ఈ వెంట్ కన్వీనర్ టి.వెంకట రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఇప్పడున్న కాంగ్రెస్ ఎంఎంసీగా మారింది. ఎంఎంసీ అంటే ముస్లింలీగ్ మావోవాది కాంగ్రెస్. ఇతర పార్టీల ఓట్లతో బతకాలని కాంగ్రెస్ చూస్తోంది. ఎన్నికలు వస్తే వేరే పార్టీలనూ ముంచేస్తోంది. ప్రజలకు ఆ పార్టీపై క్రమంగా విశ్వాసం పోతోంది. ఇక బిహార్‌లో ఆర్జేడీ ఎంవై (ముస్లిం, యాదవ్) ఫార్ములాను నమ్మితే తాము మహిళా, యూత్ ను నమ్మాం.

-ప్రధాని నరేంద్ర మోడీ

ఓపెన్ వాయిస్

విపక్షాలకు పాఠం నేర్పిన బిహార్ ఎన్నికలు

బిహార్ ఎన్నికలలో బీజేపీ కూటమి తిరిగి అధికారం సాధించింది. బిహార్ విజయం బీజేపీ కూటమికి మంచి బలమే. త్వరలోనే ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాలలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ మూడు రాష్ట్రాలలోనూ సానుకూలంగా ఉండాలంటే, బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ అలయన్స్ గెలవడం ముఖ్యం. ఇప్పుడు అది నెరవేరింది. బిహార్ ఓటర్లు బీజేపీ కూటమికి ఏకపక్షంగా పట్టం కట్టారు. 243 అసెంబ్లీ నియోజకవర్గాలున్న బిహార్ అసెంబ్లీలో దాదాపు రెండు వందల అసెంబ్లీ స్థానాలకు దగ్గరగా బీజేపీ కూటమి వెళ్లడం అంటే మామూలు విషయం కాదు. అందుకే ఇది వన్ సైడ్ వార్ అని స్పష్టంగా చెప్పాలి. నిజానికి బిహార్ లో మోడీ, నితీశ్ కుమార్ అంటే నమో కాంబినేషన్ గా బాగా వర్కవుట్ అయింది. ఎన్డీయే కూటమి ఇచ్చిన హామీలు కూడా బాగా పనిచేశాయి. నితీశ్ కుమార్ కు మహిళల ఓట్లు ఏకపక్షంగా పడినట్లు కనిపిస్తోంది. నితీశ్ కుమార్ ప్రభుత్వం మద్యపాన నిషేధం అమలు చేయడంతో అనేక కుటుంబాలు ఆనందంగా ఉన్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ కు ముందు నితీశ్ పది వేల రూపాయలు మహిళల ఖాతాలలో జమ చేయడం కూడా కూటమికి కలిసి వచ్చింది. సీమాంచల్ లో ఆర్జేడీకి పట్టుంది. అలాంటి ప్రాంతంలోనూ బీజేపీ, జేడీయూ గెలవడమంటే ప్రజలు ఇక ఎన్డీయే కూటమికి తిరుగులేని విజయాన్ని అందించాలనుకున్నారని తేలిపోయింది. ఎన్డీయే కూటమి తొలి నుంచి ఒక పద్ధతి ప్రకారం నడిచింది. సీట్ల సర్దుబాటులో ఎలాంటి అలకలు, ఇబ్బందులు లేకుండా చూసుకోగలిగింది. ముఖ్యమంత్రి అభ్యర్థిగా నితీశ్ కుమార్ ను ప్రకటించింది. అదే సమయంలో అన్ని సామాజికవర్గాల నేతలను దగ్గరకు తీసుకుని ఓటర్లకు దగ్గరయ్యే ప్రయత్నం చేసింది. పోల్ మేనేజ్ మెంట్ విషయంలో కానీ, ప్రచారంలో కానీ బీజేపీ కూటమి మహాఘట్ బంధన్ కంటే ముందంజలో ఉంది. ఆర్జేడీ వస్తే అవినీతి హెచ్చుమీరిపోతుందన్న బీజేపీ, అందులోనూ మోడీ పదే పదే చేసిన ప్రచారం ప్రజలకు చొచ్చుకు వెళ్లింది. అన్నీ కలిసి బీజేపీ కూటమిని కలసి వచ్చినట్లే కనిపించింది. బీజేపీ వరుసగా ఒక్కొక్క రాష్ట్రంలో కాంగ్రెస్ ను దానికి మద్దతిచ్చే పార్టీలను ఖతం చేస్తూ పోతోంది. మహాకూటమికి ఈ ఎన్నికలలో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు జాతీయ పార్టీలకు, ముఖ్యంగా ప్రాంతీయ పార్టీలకు కొన్ని ముఖ్య పాఠాలు నేర్పించాయి. భవిష్యత్తులో వీటిని విస్మరిస్తే ఏ పార్టీకైనా నష్టం వాటిల్లే అవకాశం ఉందని, ఇప్పుడు బిహార్‌లో మహాకూటమికి ఎదురైన పరిస్థితే వారికి రానుంది. ఓటర్లు ఇకపై పెద్ద, ఆకర్షణీయమైన నినాదాలకు ఓటు వేయరని రాజకీయ పార్టీలు అర్థం చేసుకోవాలి. వారికి వాస్తవికమైన, అమలు చేయగలిగే వాగ్దానాలు కావాలి. నేతల నుంచి విశ్వసనీయత కోరుకుంటున్నారు. మహాకూటమి నాయకుడు తేజస్వి యాదవ్ 'ప్రతి ఇంటికి ప్రభుత్వ ఉద్యోగం' 'మహిళలకు సంవత్సరానికి 30 వేల రూపాయలు' ఇస్తానని చేసిన వాగ్దానం అమలు కాదని ఓటర్లు గుర్తించారు. ఈ వాగ్దానాలు అమలు సాధ్యం కానివి. ఈ వాగ్దానాలకు అయ్యే ఖర్చు బిహార్ బడ్జెట్ తో సమానమని ప్రజలు గుర్తించారు. రాజకీయ పార్టీలు రాజ్యాంగబద్ధమైన, ఎన్నికలు నిర్వహించే సంస్థ అయిన ఈసీపై పదేపదే ప్రశ్నలు సంధించకూడదు. ఎన్నికల ప్రక్రియపై ఆరోపణలు చేయడం ప్రజలలో నమ్మకాన్ని పెంచ దానికి బదులుగా ప్రతికూలతను కలిగిస్తుంది. మహాకూటమి నేతలు ఎన్నికల సమయంలో ప్రజల సమస్యలపై దృష్టిపెట్టడానికి బదులుగా ఈసీపై ఆరోపణలు చేశారు. కనుక విద్య, ఆరోగ్యం, ఉపాధి, మౌలిక సదుపాయాలు వంటి ప్రజా ప్రయోజన సమస్యలపై దృష్టిసారించే పార్టీలకు ప్రాధాన్యత ఇస్తామని బిహార్ ప్రజలు స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందు ప్రజలను ఆకట్టుకునే పెద్ద ప్రకటనలు లేదా ఎన్నికల బహుమతులు (ఉచిత సౌకర్యాలు) ప్రకటించడం ఓట్లు రాబట్టేందుకు దోహదం చేస్తాయని నిరూపించాయి. ఈ ప్రకటనలు తరచుగా మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రజలకు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి ఉపశమనం కలిగిస్తాయి.

ప్రతిపక్షం
హైదరాబాద్
శనివారం
15.11.2025

బీసీ కోటా కోసం ఆక్రోశ యుద్ధం

వాస్తవాన్ని బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు అర్థం చేసుకొని విశారదన్ మహరాజ్ తో కలిసిరావాలి. అప్పడే పీడిత వర్గాలకు సామాజిక న్యాయం, రాజ్యాధికారం దక్కుతుంది. ఇటీవల బీసీ రిజర్వేషన్ ఉద్యమంలో దళిత నాయకుడు ఏమిటని కొంత దుష్ప్రచారం జరుగుతోంది. దీంతో బీసీ రిజర్వేషన్ కు మరింత నష్టం జరిగే అవకాశం ఉంది. నాడు భాస్కర్ జాదవ్ వంటి బీసీ నాయకులు రౌండ్ టేబుల్ సమావేశాలలో అంబేద్కర్ ను విమర్శిస్తూ గాంధీతో వెళ్లారు. దీంతో బీసీల రిజర్వేషన్స్ సంపూర్ణంగా రాజ్యాంగబద్ధం చేయలేకపోయాడు. ఇప్పుడు మరోసారి ఆ చారిత్రక తప్పిదం జరగవద్దు.

సంపతి రమేశ్ మహారాజ్
7989579428

భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 వసంతాలు పూర్తయినప్పటికీ సామాజిక న్యాయం అందని ద్రాక్షగానే మిగిలింది. అటు దేశంలో ఇటు రాష్ట్రంలో ఇతర వెనకబడిన కులాలకు సమాన అవకాశాలు కల్పినలో పార్టీలకు చిత్తశుద్ధి లేదు. ఇప్పటికీ జనాభా ప్రకారం వారికి విద్యా, ఉద్యోగ, రాజకీయాలలో ప్రాతినిధ్యం లేదు. అగ్రకులాల అదనపు హక్కుల పొందగా ఓబీసీలు తీవ్రంగా నష్టపోతున్నారు. కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం బీసీలను వినియోగించుకుంటున్నారు. జనాభా ప్రకారం విద్యా, ఉద్యోగ, రాజకీయాలలో ప్రాతినిధ్యం ఇవ్వకుండా నట్టింట ముంచుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచుతూ బిల్లు రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదించి గవర్నర్ కు పంపారు. ఇప్పుడది రాష్ట్రపతి వద్ద పెండింగ్ లో ఉండడంతో చట్ట రూపం దాల్చలేకపోయింది. తక్షణం బీసీ రిజర్వేషన్ల అమలతో స్థానిక సంస్థల ఎలక్షన్ నిర్వహించడానికి జీఓ 9 తీసుకొచ్చారు. ఇదీ న్యాయ వివాదాలకు కేరాఫ్ అడ్రస్ గా మారింది. అటు చట్టం, ఇటు జీఓ న్యాయ స్థానాలలో నిలవడం కష్టంగా మారింది. ఆ చట్టాన్ని తొమ్మిదో షెడ్యూలులో చేర్చడమే పరిష్కారమని రాజ్యాంగ నిపుణులు అంటున్నారు. బీసీ సంఘాల సైతం ఇదే డిమాండ్ చేస్తున్నాయి. రాజకీయ మైలేజీకి నష్టం జరగకుండా ప్రభుత్వం, ప్రతిపక్షం, విపక్షాలు సైతం మద్దతీస్తున్నాయి. కానీ, నిబద్ధత కనబడటం లేదు. ఈ బీసీ రిజర్వేషన్లు న్యాయస్థానాలలో నిలవాలంటే తొమ్మిదో షెడ్యూలులో చేర్చడమే మార్గం. ఇందుకు బీసీ రిజర్వేషన్ సాధన సమితి వైవిధ్యమైన పోరాటం తెలంగాణ రాష్ట్ర రాజకీయాలలో చర్చగా మారింది.

బీసీ రిజర్వేషన్ల సాధన సమితి యుద్ధం

చారిత్రకంగా బీసీల రిజర్వేషన్ల కోసం అంబేద్కర్, కాన్షీరాం ఉద్యమాలు చేశారు. అంబేద్కర్, మహాత్మా ఫూలే, సాహూ మహారాజ్ వంటి ఉద్యమ నేతల ఆలోచనలు స్వీకరించి, వాటిని భారత రాజ్యాంగంలో ప్రతిబింబింపజేశారు. ఆనాడు ఓబీసీలు తమతో కలిసి రానప్పటికీ, అంబేద్కర్ వారికి సమాన న్యాయం, విద్యావకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం రావాలని పట్టుదలగా ప్రయత్నించారు. రౌండ్ టేబుల్ సమావేశాలలో బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఒప్పించారు. రాజ్యాంగంలో 340వ అధికరణాన్ని చేర్పించారు. ఇది 'వెనుకబడిన తరగతుల కమిషన్' ఏర్పాటుకు మార్గం సుగమం చేసింది. ఈ అధికరణం ఆధారంగా ఓబీసీల జాబితా రూపొందించి, వారికి రిజర్వేషన్ కల్పించటానికి రాజ్యాంగ బాధ్యత ఏర్పడింది. ఈ క్రమంలో కాకా కలేల్కర్, బీపీ మండల్ కమిషన్ ఏర్పాటు చేశారు. ఆయన కారణంగానే బీసీల రిజర్వేషన్ల కొంతమేర చట్టబద్ధం కాబడ్డాయి. సంపూర్ణం కాలేదు. అంబేద్కర్ తర్వాత ఆయన ఉద్యమ రథాన్ని ముందుకు నడిపించిన కాన్షీరాం సైతం వెనుకబడిన వర్గాల హక్కులకోసం పోరాడారు. 1980లో మండల్ కమిషన్ ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ కల్పించాలని సిఫార్సు చేసింది. వీటి అమలుకు కాన్షీరాం డిల్లీ బోట్స్ క్లబ్ ముందు 48 రోజుల ధర్నా చేశారు. అప్పుడు వీపీ ప్రభుత్వం ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం తెచ్చింది.

మరో స్వాభిమాన బీసీ ఉద్యమం

ఇప్పుడు బీసీ విముక్తికి మరో స్వాభిమాన బీసీ ఉద్యమం

బయలుదేరింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహారాజ్, ఉమ్మడి ఏపీ హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, బాలగోని బాలరాజు గౌడ్ నేతృత్వంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఏర్పాటైంది. ఈ సమితి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని, తమిళనాడు తరహాలో వాటిని రాజ్యాంగంలోని 9వ షెడ్యూలులో చేర్చాలని డిమాండ్ చేస్తోంది. గత నెలలో ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్లకు, కలెక్టర్లకు వినతి పత్రాలు ఇచ్చారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో నేడు శనివారం (15న) బీసీల ఆక్రోశ సభను కామారెడ్డిలో నిర్వహిస్తున్నారు. ఎందుకంటే, కామారెడ్డి వేదికగానే చారిత్రక బీసీ డిక్లరేషన్ జరిగింది. ఇప్పుడు అదే వేదికగానే బీసీల యుద్ధం ప్రారంభం కాబోతోంది. ఇది బీసీల సంపూర్ణ స్వతంత్రానికి మరో పోరాటం. బీసీ సంఘాలన్నీ ఈ సమితి చేసే మహాపోరాటంలో భాగం కావాలి. ఇది దేశవ్యాప్త ఉద్యమంగా మారాలి. అప్పుడే బీసీలకు సామాజిక న్యాయం దక్కే అవకాశం ఉంది. అంతిమంగా ఇది బీసీలకు విముక్తి లభించనుంది.

మరో చారిత్రక తప్పిదం జరగవద్దు

తెలంగాణ రాష్ట్రంలో బహుజనవర్గాలంతా తరతరాలుగా అగ్రకుల పాలకుల దోపిడికి గురయ్యారు. ఈ క్రమంలో 90 శాతం బీసీ ఎస్సీ ఎస్టీ బలగాన్ని బానిస సంకెళ్ల నుంచి విముక్తి కలిగించాలి. ఇందుకోసం వారిని డాక్టర్ విశారదన్ మహరాజ్ ఆలోచన నుంచి 31 మార్చి 2025న బీసీ,ఎస్సీ ,ఎస్టీల ఐక్య కార్యాచరణ సమితి (జాక్) ఆవిర్భవించింది. బీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షులు టి.చిరంజీవులు బీసీల చైతన్యానికి కృషి చేస్తున్నారు. జస్టిస్ ఈశ్వరయ్య బీసీల న్యాయపోరాటాలకు ప్రేరణ ఇచ్చారు. బీసీ పొలిటికల్ ఫ్రింట్ చైర్మన్ బాలగోని బాలరాజు గౌడ్ పలు సామాజిక ఉద్యమాలలో క్రియాశీల పాత్ర పోషిస్తున్నారు. ఇప్పుడు వీరంతా బీసీ రిజర్వేషన్ల సాధన సమితిలో కూడా భాగమై నికార్సైన ఉద్యమాన్ని ముందుకు తీసుకు వెళ్తున్నారు. వీరి నాయకత్వంలోనే బీసీ రిజర్వేషన్ ఉద్యమం విజయవంతం కానుంది. వీరికి తోడుగా పలువురు మేధావులు, కుల సంఘాలు కలిసి వస్తున్నారు. బీసీ ఉద్యమానికి కేంద్రం ఢిల్లీ కాదు, తెలంగాణ అనీ గీత గీసి శాంతియుత, ప్రజాస్వామ్య మార్గంలో నడిపిస్తున్నారు. ఈ వాస్తవాన్ని బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు అర్థం చేసుకొని విశారదన్ మహరాజ్ తో కలిసిరావాలి. అప్పుడే పీడిత వర్గాలకు సామాజిక న్యాయం, రాజ్యాధికారం దక్కుతుంది. ఇటీవల బీసీ రిజర్వేషన్ ఉద్యమంలో దళిత నాయకుడు ఏమిటని కొంత దుష్ప్రచారం జరుగుతోంది. దీంతో బీసీ రిజర్వేషన్ కు మరింత నష్టం జరిగే అవకాశం ఉంది. నాడు భాస్కర్ జాదవ్ వంటి బీసీ నాయకులు రౌండ్ టేబుల్ సమావేశాలలో అంబేద్కర్ ను విమర్శిస్తూ గాంధీతో వెళ్లారు. దీంతో బీసీల రిజర్వేషన్స్ సంపూర్ణంగా రాజ్యాంగబద్ధం చేయలేకపోయాడు. ఇప్పుడు మరోసారి ఆ చారిత్రక తప్పిదం జరగవద్దు.

(నేడు కామారెడ్డిలో బీసీ ఆక్రోశ సభ-జరుగనున్న సందర్భంగా)

(వ్యాస రచయిత సామాజిక విశ్లేషకులు)

డా. బాలకిష్టయ్య సేవలు చిరస్మరణీయం

డా. పోలం సైదులు
9441930361

ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా, ప్రత్యేకంగా ప్రస్తుత వనపర్తి జిల్లావాసులలో చెరగని ముద్ర వేసుకుని, ప్రజలలో అత్యంత ఆదరణ పొందిన వ్యక్తిగా పేరుగాంచినవారే మాజీ శాసనసభ్యులు స్వర్గీయ డా. బాలకిష్టయ్య. ఆయన గురించి తెలిసినవారిని సంప్రదిస్తే ఎన్నో, ఎన్నెన్నో ఆసక్తికర విషయాలు, మరెన్నో ఆశ్చర్యకర సంఘటనలు మనకు దర్శనమిస్తాయనడంలో అతిశయోక్తి లేదు. దాదాపు ఏడెనిమిది దశాబ్దాల క్రితమే సమాజాభివృద్ధిలో విద్య పాత్రను గుర్తించి తన కుటుంబమే గాకుండా, ప్రతి ఒక్కరిని చైతన్య పరుస్తూ, ప్రతి ఒక్కరు విద్యను అభ్యసించాలని ఆచరణలో సైతం సుసాధ్యం చేసి నిరూపించారు. 15 నవంబర్ 1924న వనపర్తిలోనే మహదేవయ్య, సంజమ్మ దంపతులకు బాలకిష్టయ్య జన్మించారు. తండ్రి వనపర్తి సంస్థానంలో అకౌంటెంట్ గా పని చేసేవారు. వనపర్తిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసి, హైదరాబాద్ లోని సిటీ కాలేజీలో ఇంటర్ చదివారు. 1955లో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎంబీబీఎస్ పట్టా పొందారు. తాను విద్యాభ్యాసం కొనసాగిస్తూనే ఎన్నో సామాజిక ఉద్యమాలలో పాల్గొంటూ వచ్చారు. 1947-49 నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొని జైలుకువెళ్లారు. వైద్య వృత్తిని ఆరంభించి, ఎంతోడబ్బు సంపాదించుకునే అవకాశం ఉన్నప్పటికీ, అలా చేయకుండా సేవాభావంతో తన చదువు తన ప్రాంతవాసులకు ఉపయోడపడాలని తలచి, బడుగు, బలహీన వర్గాలకు ఉచిత వైద్యం అందించారు. రాత్రి బడులను ఆరంభించి వయోజన విద్యకు అత్యంత ప్రాధాన్యమిచ్చారు. ఆపదలో ఉన్నవారు ఏ సమయంలోనైనా తన ఇంటి తలుపు తట్టితే చాలు తానున్నాననే భరోసానిచ్చారు.

వనపర్తి మున్సిపల్ చైర్మన్ గా

1962 లో 'పట్టణాభివృద్ధి సమితి'ని ప్రారంభించి, అదే సంవత్సరం జరిగిన ఎన్నికలలో పోటీ చేసి వనపర్తి మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికయ్యారు. దాదాపు రెండు దశాబ్దాలు అనగా నాలుగుసార్లు అదే పదవిలో కొనసాగి, వనపర్తి పట్టణాభివృద్ధిలో చెరగని ముద్ర వేశారు. వనపర్తికి విద్యుత్ తెచ్చిన ఘనత ఆయనకే దక్కింది. ప్రభుత్వ పాఠశాల, డిగ్రీ, పీజీ కళాశాలలు, ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీలను రప్పించి, ఆ ప్రాంతం విద్యార్థులకు మాత్రమే కాకుండా, ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన విద్యార్థులకు సైతం ఎంతో మేలు చేశారు. ఎంతలా అంటే, అక్షరాస్యత ఎక్కువ నమోదయ్యే ప్రాంతంగా, ఉన్నత ఉద్యోగాలు పొందిన ప్రాంతంగా కేవలం వనపర్తిపేరు వచ్చిందంటే దానికిగల కారణం స్వర్గీయ డా. బాలకిష్టయ్య అని చెప్పడంలో సందేహం అక్కర లేదు. తాగునీరు,సాగునీరు



అందించడంలో, రోడ్లు, భవనాలను నిర్మించడంలో తనకు తానే సాటి అనేలా చేసి నిరూపించారు. 1974లో వనపర్తిలో మహాకవి శ్రీశ్రీ, వరవరరావు, జ్వాలాముఖి, చెరబండరాజు తదితరులతో కవి సమ్మేళనం నిర్వహించి, సాహిత్యంపై తనకున్న మక్కువను చాటుకున్నారు. శ్రీశ్రీ తన ఇంటిని వేలం వేస్తున్నారని తెలుసుకుని చందాలు సేకరించి 1982 మార్చి 14న శ్రీశ్రీకి భారీ సన్మాన కార్యక్రమం చేపట్టి 25 వేల రూపాయల నగదు బహూకరించారు. 1975లో భారత్-చైనా మిత్రమండలిలో చేరి, అనతికాలంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా 1978 నుండి 1981 వరకు సేవలు అందించారు. 1982 సెప్టెంబర్ 9 నుండి 23 వరకు చైనాలో పర్యటించారు.

వనపర్తి శాసనసభ్యులుగా

డా. బాలకిష్టయ్య సేవలను గుర్తించిన ఎన్టీఆర్ 1982లో తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. 1983లో తొలిసారి వనపర్తి నియోజకవర్గానికి శాసనసభ్యులుగా, 1985లో మరల రెండోసారి ఎన్నికయ్యారు. ఎన్టీఆర్ వద్ద మేధావిగా, బలమైన నాయకుడిగా, పట్టువీడని విక్రమార్కుడిలా పేరు తెచ్చుకున్నారు. యేటా తన కుటుంబసభ్యులతో కలిసి మున్ననూర్ సమీపంలోగల కౄరమృగాలు సంచరించే దట్టమైన నల్లమల అడవులకు వెళ్లేవారు. కొన్ని మైళ్లదూరం నడిచి చెంచు గూడాలను సందర్శించి, వారికి కావలసిన దుస్తులు, దుప్పట్లు, ఆహారంతో పాటు వైద్య సేవలందించి, మెడిసిన్ ఇచ్చి, ఒకటి రెండు రోజులు వారితో గడిపి వారి యోగక్షేమాలను తెలుసుకుని సలహాలు, సూచనలు ఇచ్చి వచ్చేవారు. ఆయన 1950లో అంజనీ దేవి, 1957లో శంకరమ్మను వివాహం చేసుకున్నారు. వారికి ఆరుగురు కుమారులు, పది మంది కుమార్తెలు. వృత్తిపరంగానూ, రాజకీయంగానూ ఎన్ని పనులున్నా కూడా పిల్లలకు ఇవ్వాల్సిన ప్రాముఖ్యత ఇచ్చేవారు. బీసీ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ గా, ఆర్టీసీ గోల్కొండ రీజియన్ చైర్మన్ గా, 1986లో శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డుమెంబర్ గా పదవులను అధిరోహించి, 16 డిసెంబర్ 1997 న పరమపదించారు. ఇంతటి చరిత్ర కలిగిన మహానుభావుడి చరిత్రను వెలుగులోకి తెచ్చి, జయంతి, వర్ధంతి ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలి. ట్యాంక్ బండ్ వద్ద, నగరంలోని ప్రధానకూడలిలో ఆయన విగ్రహాలను ప్రతిష్టించి, రాష్ట్రంలో ఏదైనా ఒకపార్క్ కు ఆయన పేరుపెట్టాలి. ఆయన జీవితచరిత్రను పాఠ్యాంశంగా పొందుపర్చాలి.

(నేడు డా. బాలకిష్టయ్య శత జయంతి)

(వ్యాస రచయిత సామాజిక విశ్లేషకులు)

'జూబ్లీ' ఫలితం భావి రాజకీయాలకు దిక్సూచి?!

రామకిష్టయ్య సంగనభట్ల
9440595494

జూబ్లీ హిల్స్ ఉపఎన్నిక రాష్ట్ర రాజకీయాలలో ఒక ముఖ్యమైన మలుపుగా నిలిచింది. దశాబ్ద కాలంగా నగర ప్రాంతాలలో తన ముద్రను స్పష్టంగా నిలిపిన బీఆర్ఎస్ ఈసారి చతికిలబడింది. తారుమారైన కేడర్, నాయకత్వ మౌనం, అంతర్గత అసమ్మతి, ప్రత్యర్థి పార్టీల వ్యూహాలు, మైనారిటీ ఓటు, ప్రభుత్వ పథకాల అమలు విషయంలో పెరిగిన ప్రజా విశ్వాసంతో పరాభవాన్ని ఎదుర్కొంది. మూడు సార్లు వరుసగా ఈ నియోజకవర్గాన్ని గెలుచుకున్న మాగంటి గోపీనాథ్ మరణంతో చోటు చేసుకున్న భావోద్వేగ తరంగం ఎన్నికకు ప్రత్యేక పునర్భూమికగా మారింది. ఆయన తల్లి బహిరంగంగా చేసిన వ్యాఖ్యలు, పార్టీ నాయకత్వం తన కుమారుడిని నిర్లక్ష్యం చేసిందనే ఆరోపణలు, గతంలో ఎంఐ ఎంతో చెట్టాపట్టాలు వేసుకుని తిరిగాడని వచ్చిన విమర్శలు, ఆ పార్టీ ఆధిపత్యం ఉన్న బస్తీలలో బీఆర్ఎస్ కేడర్ పటిష్టతకు ఆయన చేసిన కృషిపై పార్టీ చూపిన నిర్లక్ష్యం స్థానిక కేడర్‌లో చీలికలు తెచ్చాయి. ఈ వ్యాఖ్యలు ప్రచారంలో ప్రత్యర్థులకు ఆయుధాలుగా మారాయి. ఇంతకాలం తమకు ఓటు వేస్తున్న వర్గంలో కూడా సందిగ్ధతను రేకెత్తించాయి. ఉప ఎన్నికలో ఏకపక్షంగా ఫలితాలు కనిపించాయి. కాంగ్రెస్ 98,988 ఓట్లు (50.83 శాతం), బీఆర్ఎస్ 74,259 ఓట్లు (38.13 శాతం), బీజేపీ 17,061 ఓట్లు (8.76 శాతం) ఫలితాలు నమోదు అయ్యాయి. ఓటు హాజరు సుమారు 48.49 శాతంగా నమోదైంది.

అతిపెద్ద లోపం కేసీఆర్ సంపూర్ణ మౌనం

బీఆర్ఎస్ కు ఈ ఉపఎన్నికలో ఏర్పడిన అతిపెద్ద లోపం కేసీఆర్ సంపూర్ణ మౌనం. పార్టీ స్థాపకుడు ప్రచారానికి దూరంగా ఉండటం కేడర్‌లో ఉత్సాహాన్ని బలహీనపరిచింది. హరీశ్ రావు కుటుంబ దుఃఖ కారణంగా కీలక సమయాలలో రాలేక పోవడం, ఇతర అగ్రనేతలు చురుగ్గా వ్యవహరించక పోవడం పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది. నిధుల వినియోగం, అభివృద్ధి పథకాల అమలులో జాప్యం, మున్సిపల్ సేవల పట్ల అసంతృప్తి, ఇవన్నీ కలసి ప్రజలలో 'బీఆర్ఎస్ ఇక పాత ఉత్సాహంతో లేదనే' భావనను పెంచాయి. అంతేకాదు, పలువురు ఎమ్మెల్యేలు అధికార కాంగ్రెస్ వైపు చేరిపోవడం, కొందరు నేతలపై ఉన్న విచారణలు, క్రమశిక్షణా లోపాలు ఇవన్నీ ఓటర్లకు పార్టీ స్థిరత్వంపై తీవ్రమైన సందేహాన్ని కలిగించాయి. ఈ సంక్షోభంలో పార్టీ అభ్యర్థి కేడర్‌కు కావాల్సిన దిశానిర్దేశం, ఓటర్లకు కావాల్సిన నమ్మకం అందించలేక పోయారు.

కాంగ్రెస్ విజయానికి కీలక బలం

దీనికి విరుద్ధంగా కాంగ్రెస్ ఈ ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా స్వీకరించింది. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, కేంద్ర నాయకత్వం వరకు ప్రచారంలో నేరుగా పాల్గొనడం, ఎంఐఎం పూర్తి మద్దతుతో మైనారిటీ ఓట్లు ఒకే దిశగా సమీకరించడం కాంగ్రెస్ విజయానికి కీలక బలంగా మారింది. స్థానికంగా ప్రభావం కలిగిన నాయకుడికి టికెట్ ఇవ్వడం, అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా ముస్లింల ఓటింగ్ మూడ్‌ను కచ్చితంగా ఆకర్షించడం, ఇంటింటా ప్రచారం, డిజిటల్ ప్రచారం, బూత్ మైక్రో మేనేజ్‌మెంట్ అన్నీ కలిపి ఓటర్లలో కాంగ్రెస్ పట్ల ఒక కొత్త విశ్వాసాన్ని నెలకొల్పాయి. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, రైతు రుణమాఫీ, మహిళలకు ఆర్థిక సహాయం, వైద్య సేవల మెరుగు, విద్యుత్ పరిస్థితుల పునరుద్ధరణ, పాఠశాలల శ్రేయస్సుకు చేపట్టిన పథకాలు ఈ ఎన్నికలో ఎక్కువ ప్రాధాన్యం పొందాయి. నగర ప్రాంతాలలో సేవల మెరుగుదల, రోడ్ల పునరుద్ధరణ, డ్రైనేజ్ అభివృద్ధి వంటి అంశాల్లో ప్రభుత్వం చేపట్టిన చర్యలు కూడా మధ్యం వర్గ ఓటర్లను కాంగ్రెస్ వైపుకు మళ్లించాయి. ప్రభుత్వంపై ఏర్పడిన ఓటర్ల విశ్వాసం నేరుగా కాంగ్రెస్ ఓట్లలో ప్రతిబింబించింది.

చతికిలబడిన బీజేపీ

భారతీయ జనతా పార్టీ మాత్రం ఈ ఉపఎన్నికలో అంచనాలకు తగిన విధంగా ప్రాభవం చూపలేక పోయింది. నగరంలో బలమైన ఓటు బ్యాంక్ ఉన్నప్పటికీ, అభ్యర్థి ఎంపిక, ప్రచార దిశ, స్థానిక సమస్యలపై స్పష్టమైన ప్రత్యామ్నాయ దృక్కోణం లేకపోవడం కారణంగా ఓట్లు స్థిరంగా పెరగలేదు. కేడర్ చైతన్యం ఉన్నప్పటికీ, ఓట్ల మార్పుకు దోహదం చేసేలా బలమైన రాజకీయ తరంగం సృష్టించలేక పోయింది. నగర ఓటరు వాగ్దానాల కన్నా సేవల నాణ్యతను, నేతృత్వ సంకల్పాన్ని, పరిపాలనా క్రమశిక్షణను ప్రాధాన్యంగా చూస్తాడు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలలో కొన్ని అమలైన తీరు, అభివృద్ధి పనులకు తీసుకున్న వేగవంత చర్యలు ఓటర్లలో 'కాంగ్రెస్ పాలనలో మార్పు కనిపిస్తోంది' అనే భావనను పెంచాయి. ఇక బీఆర్ఎస్ పాలన చివరి దశలో కనిపించిన అచేతనత, మౌలిక సమస్యల పట్ల నిర్లక్ష్యం, నాయకత్వ అస్పష్టత ఓటరులను దూరం చేసింది.

(వ్యాస రచయిత సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com



మేడ్చల్‌లో...

ఖమ్మం జిల్లా వైరాలో...

సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలపై ఏసీబీ దాడులు

- మంచిర్యాల, మేడ్చల్, వైరాలో ఆకస్మిక తనిఖీలు

ప్రతిపక్షం ప్రతినిధులు, మంచిర్యాల, మేడ్చల్, వైరా, నవంబర్ 14: రాష్ట్రంలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో శుక్రవారం నాడు ఏసీబీ అధికారులు మెరుపు దాడులు చేశారు. మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ ఏసీబీ డీఎస్పీ గొర్రె మధు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. రికార్డులు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశామని తెలిపారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ తనిఖీ చేశామన్నారు. డీటీసీపీ లేఔట్ లేని ప్లాంట్ రిజిస్ట్రేషన్ పై వివరాలు సేకరించామన్నారు. ఈ సందర్భంగా దస్తావేజుదారులు తమ దుకాణాలను మూసి వేసారు.

మేడ్చల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో

మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు నిర్వహించారు. అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో ఏసీబీ అధికారులు మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకొని ప్రతి ఒక్కరినీ తనిఖీలు చేశారు. అయితే ఈ సమయంలో పదిమంది ఏజెంట్లు, డాక్యుమెంట్ రైటర్లు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఉండడానికి గమనించిన ఏసీబీ అధికారులు వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేసుకునే వారు మాత్రమే కార్యాలయంలో ఉండాల్సి ఉండగా కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్లు, ఏజెంట్లు

మంచిర్యాలలో మాట్లాడతున్న డీఎస్పీ

ఉండదాన్ని ఏసీబీ అధికారులు గమనించారు. డాక్యుమెంట్ రైటర్లు ఏజెంట్ల వద్ద రిజిస్ట్రేషన్ చేసే డాక్యుమెంట్లు మాత్రమే ఉన్నాయని, వారి వద్ద నుండి ఎలాంటి డబ్బులు లభించలేదని ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. ఆ డాక్యుమెంట్ సంబంధించిన వారిని పిలిపించి వారి స్టేట్మెంటు రికార్డ్ చేస్తామని, ఏసీబీ అధికారుల సమక్షంలో ఉన్న పదిమంది డాక్యుమెంట్ రైటర్లు, ఏజెంట్లను విచారణ చెప్తామని డీఎస్పీ శ్రీధర్ తెలిపారు.

వైరా సబ్ రిజిస్టర్ కార్యాలయంలో

ఖమ్మం జిల్లా వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఏసీబీ డీజీ ఆదేశాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏసీబీ డీఎస్పీ రమేశ్ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేశారు. ముందుగా డాక్యుమెంట్ రైటర్లలను ఆరా తీశారు. వారి సెల్ ఫోన్లను, సబ్ రిజిస్టార్ కార్యాలయ సిబ్బంది, అధికారులు సిబ్బంది ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఓ సీనియర్ డాక్యుమెంట్ రైటర్ వద్ద సుమారు రూ. 2.90 లక్షల రూపాయల నగదు ఏసీబీ అధికారులకు లభించినట్లు తెలిసింది. ఓ డాక్యుమెంట్ రైటర్ తనకు అప్పు ఇచ్చిన వ్యక్తికి తిరిగి ఆ నగదును ఇచ్చేందుకు తీసుకువచ్చాడని సమాచారం. ఈ సందర్భంగా ఏసీబీ ఏసీపీ రమేశ్ మాట్లాడుతూ వైరా సబ్ రిజిస్టర్ కార్యాలయం పై పలు ఫిర్యాదులు అందుతుండటంతో దాడులు చేశామని చెప్పారు. డాక్యుమెంట్లను తాము క్షుణ్ణంగా తనిఖీ చేశామని చెప్పారు. డాక్యుమెంట్ రైటర్లతోపాటు, కార్యాలయ అధికారులు, సిబ్బంది ఫోన్లలో నగదు బదిలీ యాప్ లను క్షుణ్ణంగా పరిశీలించామని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు లంచాన్ని డబ్బు, వస్తు, సేవా రూపంలో అడిగితే ప్రజలు వెంటనే 1064 నెంబర్ కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ ఫోన్ నెంబర్ ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటుందని చెప్పారు. పూర్తి స్థాయిలో తనిఖీలు నిర్వహించిన తర్వాత వివరాలను వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు. అయితే ఏసీబీ దాడులతో డాక్యుమెంట్ రైటర్లలో అలజడి నెలకొంది.

ఎంఆర్ఈఎం కళాశాలలో అంతర్ జిల్లా వాలీబాల్ టోర్నీ ప్రారంభం

- క్రీడలు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చేస్తాయి

ప్రతిపక్షం. ప్రతినిధి. మేడ్చల్, నవంబర్ 14: క్రీడలతో ఆరోగ్యం మెరుగు పడుతుందని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటి కార్పొరేషన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడారంగ ఛైర్మెన్ శివసేన రెడ్డి అన్నారు. క్రీడా అభివృద్ధికి దాదాపు 800 కోట్ల బడ్జెట్ ను కేటాయించారని అన్నారు. మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కిష్టాపూర్ లో గల మల్లా రెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్ అండ్ మేనేజ్మెంట్ సైన్సెస్ కళాశాలలో ప్రారంభమైనటువంటి అంతర్ జిల్లా 8వ సిరీస్ మహిళలు, పురుషులు 2025 వాలీబాల్ పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి అన్ని జిల్లాలలో క్రీడా మైదానాలను కేటాయించిన బడ్జెట్ తో పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. గ్రామస్థాయిలో ఒకటి నుండి రెండు ఎకరాల స్థలంలో క్రీడ మైదానాలను ఏర్పాటు చేస్తామని. దీని ద్వారా యువకులు చెడు వ్యసనాలకు బానిసలుగా మారకుండా క్రీడలపై దృష్టి పెట్టి మంచి మార్గంలో వెళ్లే అవకాశాలు ఉంటాయని అన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు మానసిక, శారీరకంగా దృఢంగా ఉండేందుకు ఉపయోగపడతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ వేముల మల్లారెడ్డి, కార్యదర్శి వేముల కృష్ణారెడ్డి, మేడ్చల్ జోన్ ఎసిపి శంకర్ రెడ్డి, తెలంగాణ ఒలంపిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.మల్లారెడ్డి, తెలంగాణ వాలీబాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రమేష్, ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

నవీన్ యాదవ్ కి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ అభిమానులు

ప్రతిపక్షం, చేవేళ్ల, నవంబర్14: చేవెళ్ల మండల పరిధిలోని శుక్రవారం గొల్లపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు, షాకీర్ తన అభిమన్యుని చట్టుకో ఉన్నాడు.జూబ్లీహిల్స్ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కి ఘనంగా కేక్ కట్ చేసి బానసంచ కాల్చి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ...వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయం అని చెప్పారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గ్రామ యువత ప్రజలు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది

- యువ నాయకులు షాపురం రాజు
- సొంత నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం

ప్రతిపక్షం,మొయినాబాద్, నవంబర్ 14 : గ్రామాభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని యువ నాయకులు షాపురం రాజు (మాణిక్యం) అన్నారు. మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలోని రెండు కాలనీలలో సొంత నిధులు వెచ్చించి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రెడ్డిపల్లి గ్రామాభివృద్ధియే తన లక్ష్యమన్నారు. గ్రామంలో మౌలికసదుపాయాల కల్పనకు తనవంతు కృషి ఎల్లవేళల ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. గ్రామంలో ఏ సమస్య తలెత్తిన తన దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కార దిశగా ముందుకు వెళ్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి గ్రామస్తులు, యువకులు తదితరులున్నారు.

ఘనంగా నెహ్రు జయంతి

ప్రతిపక్షం. ప్రతినిధి. మేడ్చల్, నవంబర్ 14. విద్యా రంగంపై జవహర్ లాల్ నెహ్రు చూపిన ప్రాధాన్యతతో భరతదేశంలో ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థాయిలకు ఎదిగారని జిల్లా రీజినల్ ట్రాన్స్పోర్ట్ ఆథారిటి సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి అన్నారు. తుంకుంట మున్సిపాలిటీ పరిధిలోని యాంజాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జవహర్ లాల్ నెహ్రు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెహ్రు సేవలు, విద్యా రంగంపై చూపిన ప్రాధాన్యత ను ప్రతి భారతీయ పౌరులు స్మరించుకోవాలని కోరారు. అనంతరం బాలల దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు పంపిణి చేసి భోజనం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శశిరేఖ, రమేష్, చందర్, హేమలత, ప్రశాంత్ నాయక్, మంజులత, నిర్మల, నాగలక్ష్మి, జ్యోతి, శ్రీనివాస్ రావుతో పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

- చేవెళ్ల, ఎమ్మెల్యే కాలె యాదయ్య.

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 14: పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మున్సిపల్ పరిధిలోని సురంగల్ వార్డులో నూతనగా నిర్మాణం చేయబోయే ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన చేసి లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులకు విడుతలవారీగా రూ .5లక్షలు అందజేయడం జరుగుతుందని అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంచనాలకు మించి ఎన్డీఏ విజయం

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 14: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో బీహార్ ఎన్ డీ ఏ కూటమి విజయం సాధంచిన సందర్భంగా పట్టణ అధ్యక్షులు కావేరి శ్రీధర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బాణాసంచాలు కాల్చి, మిటాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ నేతృత్వంలో ఎన్ డీ ఏ కూటమికి బీహార్ ప్రజానీకం బ్రాహ్మరథం పట్టరాని, కాంగ్రెస్ పాలనలో చేసిన అవినీతి పాపంలా వెంటాడుతుందని అన్నారు. కాంగ్రెస్ మాత్రం ప్రతి ఎన్నికలో ఓటమికి ఎన్నికల కమిషన్ ను దోషిగా చిత్రికరించే పనిలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఉషిగారి శ్రీనివాస్ ముదిరాజ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ జైతువాలా కిషన్, బిజెపి నాయకులు మండల రవీందర్ గౌడ్, ముక్కిడిగల్ల మహేష్ ప్రధాన కార్యదర్శులు జైతువాలా కృష్ణ, చింతలపూడి రామారావు, బిజెపి నాయకులు చెంచాల సురేష్, సుంకు నవీన్, బట్టికడి విక్రమ్, ప్రవీణ్ గౌడ్, బండారి సూరి, వినోద్, ఉద్దమర్రి అరుణ్, సుంకు నవీన్, అశోక్, మధు, వినయ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య.

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 14 : లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి, షాధీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ .... కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని, రాష్ట్రంలోని పేద వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయినుద్దీన్, తహసిల్దార్ గౌతం కుమార్, టీపీసీసి సభ్యులు షాబాద్ దర్శన్, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నవీన్ యాదవ్ గెలుపుతో ఓయూ కాలనీలో సంబరాలు

ప్రతిపక్షం, జూబ్లీహిల్స్, నవంబర్14: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలిచిన సందర్భంగా షేక్పేట ఓయూ కాలనీలో కాంగ్రెస్‌శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి 24 వేల ఎక్కువ మెజార్టీతో గెలుపొందడంతో కాంగ్రెస్ కార్యకర్తల సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ సందర్భంగా బాణసంచా పేల్చి, కేక్ కట్ చేసి సంబరాలు ఘనంగా చేసుకున్నారు. ఈ గెలుపు మన అందరి కృషి వల్ల జరిగిందని, మంత్రి వివేక్, మాజీ ఎమ్మెల్యే రవీందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ గెలుపు కోసం శ్రమించి కష్టపడి పని చేసిన కాంగ్రెస్ కార్యకర్తలకు, ఓయూ కాలనీ ప్రజలకు వారు శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఓయూ కాలనీ ప్రెసిడెంట్ రవి కుమార్, వెంకటేశ్వర్‌రెడ్డి, దర్గా రవి, కబీర్, మీర్ వలి, ఈశ్వర్ రెడ్డి, ఎంఆర్కె ప్రసాద్, రాఘవరెడ్డి, మహమ్మద్ షఫీ, రమణా రెడ్డి, మస్జిద్ కమిటీ సభ్యులు బషీర్ ఖాన్, వహీద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు. కాగా, షేక్ పేట కార్పొరేటర్ ఫరాజ్‌ఖాన్‌ఆధ్వర్యంలో నవీన్‌యాదవ్‌విజయం పట్ల సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు కాలనీలో స్వీట్లు పంచారు.

లిటిల్ మిలీనియం స్కూల్లో చిల్డ్రన్స్ డే సెలబ్రేషన్స్

ప్రతిపక్షం, జూబ్లీహిల్స్, నవంబర్14: షేక్ పేట ఓయు కాలనీ లిటిల్ మిలీనియం స్కూల్లో చిల్డ్రన్స్ డే సెలబ్రేషన్స్ ఘనంగా జరిగాయి. చిల్డ్రన్స్ డే పిల్లల మానసిక వికాసానికి ఎంతో తోడ్పడతాయని, చిన్నపిల్లల మనుషులలో ఇలాంటి సెలబ్రేషన్స్ ఎంతో లోతుగా దూసుకుపోతాయని ఓయూ కాలని కమిటీ ట్రెజరర్ ఎంఆర్కె ప్రసాద్ అన్నారు. అలాగే పిల్లలకు పెన్ డిస్ట్రిబ్యూషన్ చేశారు. ఈ చిల్డ్రన్స్ డే సెలబ్రేషన్స్ లో లిటిల్ మిలీనియం స్కూల్ ప్రిన్సిపాల్ శృతి, వారి ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



సంస్కరణలతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం. ఇందుకు హైదరాబాద్ అభివృద్ధే ఉదాహరణ. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పాలసీలు రూపొందించాలి. తాను చేసిన మంచిని చెప్పకోవడంలో కొంచెం వెనుకబడడంతో గతంలో ఇబ్బందులు వచ్చాయి. గత ఐదేళ్ల పాలనలో ఆర్థిక వ్యవస్థ, ఏపీ ఇమేజ్ అంతర్జాతీయంగా దెబ్బతింది. పరిశ్రమలకు ప్రోత్సాహకాల కోసం ఎస్క్రో ఖాతా తెరుస్తున్నాం.

- ఏపీ సీఎం చంద్రబాబు

ప్రాంతీయం

నేషనల్ హైవే పనుల్ని స్పీడ్ అప్ చేయాలి

- సర్వీస్ రోడ్డు మధ్యలో హై టెన్షన్ స్తంభాలు, అక్రమ నిర్మాణాలను తొలగించండి
- ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 14 : ముంబై నేషనల్ హైవే 65 రోడ్డు పనుల్ని త్వరగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. ఇవాళ సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం లోని ఆయన స్వగృహంలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు, జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ, ట్రాఫిక్, ట్రాన్స్కో, జిహెచ్ఎంసి ఇంజనీరింగ్, టీజీఐఐసీ, టీజీఎస్పీడీసీఎల్ , తదితర విభాగాల అధికారులతో పలు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.. అనంతరం అధికారులతో కలిసి రోడ్డు పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ మేరకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. హైవేకు రెండు వైపులా సర్వీస్ రోడ్డు మార్కింగ్ ఏరియాలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను తొలగించాలన్నారు. పనుల్లో స్పీడ్ అప్ పెంచాలన్నారు. అవసరమైన చోట్ల ఫ్లైఓవర్ అండర్ పాస్, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలన్నారు. హెచ్ఎండిఏ విభాగాల అధికారులు సర్వీస్ రోడ్డు పనులు జరగక ముందే వాటర్ వర్క్స్ పూర్తి చేయాలన్నారు.

రోడ్డు మధ్యలో హై టెన్షన్ పోల్స్ వేస్తారా?

నేషనల్ హైవే రోడ్డు పక్కన నిర్మించే సర్వీస్ రోడ్లలో అధికారులు కొత్తగా హై టెన్షన్ స్తంభాలను ఏర్పాటు చేయడం పై ఎమ్మెల్సీ అసహనం వ్యక్తం చేశారు. అధికారులు సర్వీస్ రోడ్డు మధ్యలో కొత్తగా హై టెన్షన్ స్తంభాలు ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్తులో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. వెంటనే సర్వీస్ రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన హై టెన్షన్ స్తంభాలను తొలగించాలని అధికారులకు సూచించారు. అంతేకాకుండా సర్వీస్ రోడ్డు మార్కింగ్ లోపల ఉన్న హోర్డింగ్స్, అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన చోట మరిన్ని ఫుట్ ఓవర్ బ్రిడ్జి , అండర్ పాస్ నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పోటీలు విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసాన్ని పెంచుతాయి

- కలెక్టర్ పి.ప్రావీణ్య

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 14 : జిల్లాలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచేందుకు నిర్వహించిన క్విజ్ పోటీలు విజయవంతంగా పూర్తయ్యాయి అని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. నారాయణఖేడ్ డివిజన్‌లో సబ్ కలెక్టర్ ఉమా హారతి, ఎస్‌డీఎమ్ ఆధ్వర్యంలో, విరూపాక్ష ఆర్గనైజేషన్ సంస్థ సి ఎస్ ఆర్ నిధులు, హైదరాబాద్ ఆధారిత టోకెన్ ఆర్గనైజేషన్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని మొత్తం 49 ప్రభుత్వ పాఠశాలల్లో మొదట స్కూల్ స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబరిచిన 8వ, 9వ, 10వ తరగతి విద్యార్థులను ఒక్కో స్కూల్ టీమ్‌గా ఎంపిక చేశారు. అనంతరం మండలస్థాయి పోటీలు జరగగా, విజేతలైన ఏడు మండలాల టీములు, జుకల్‌లోని సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాలలో జరిగిన డివిజనల్ లెవెల్ క్విజ్ ఫైనల్స్‌లో పాల్గొన్నారు. మొత్తం 7 టీములు పాల్గొన్న, ఈ తుదిపోరు నాలుగు మెయిన్స్ రౌండ్లు, ఒక బజర్ రౌండ్‌తో ఉత్కంఠభరితంగా సాగింది. విద్యార్థులు చురుకుతనం, తెలివి తేటలను ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు

ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య,విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించడంతో పాటు, విజ్ఞానం-వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయి అన్నారు. నారాయణఖేడ్ డివిజన్ ఈ కార్యక్రమంతో రాష్ట్రంలో విద్యా రంగానికి ఆదర్శంగా నిలిచిందని అని పేర్కొన్నారు. డివిజన్‌లో ఇంత పెద్ద స్థాయిలో నిర్వహించిన ఈ విద్యా కార్యక్రమం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపింది అన్నారు. విద్యార్థులు ప్రతిరోజు చదివే అంశాలను క్విజ్ రూపంలో ప్రశ్నించడం ద్వారా విద్యార్థులకు విషయ సంగ్రహణ శక్తి, మేధాశక్తి పెరుగుతుందన్నారు. దీంతో విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణిస్తారు అన్నారు. ప్రతిరోజు విద్యార్థులు తప్పనిసరిగా 15 నిమిషాల నుండి అరగంట సేపు దినపత్రికలు చదవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని కొన్ని పాఠశాలల్లో ఉదయం ప్రార్థన సమయం లో దినపత్రికలలోని ముఖ్యాంశాలు చదివి వినిపిస్తున్నారని ఈ పద్ధతి వల్ల విద్యార్థులకు జర్నల్ నాలెడ్జ్ పెరుగుతుందన్నారు. ఈ పద్ధతిని జిల్లాలోని అన్ని పాఠశాలల్లో చేపట్టాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.

ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డు ఏర్పాటు

- అతివేగం వల్లనే ప్రమాదాలు
- ఎస్పీ శరత్ చంద్ర పవర్

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 14: హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై ప్రమాదాలు నివారణకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. చిట్యాల మండలం వెలిమినేడు వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు ను ఎస్పీ శరత్ చంద్ర పవర్ గురువారం ప్రారంభించారు. "నీ వాహనం వేగంగా వెళ్తుంది. కానీ నీ జీవితం ఆగిపోతుంది" అనే నినాదంతో ప్రత్యేక హోర్డింగ్ ఏర్పాటు చేశారు. యాక్సిడెంట్ కి గురైన వాహనాల ఫోటోలో తో వాహనదారులకు రోడ్డు భద్రతపై సందేశం అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... అతివేగం, అజాగ్రత్త, నిర్లక్ష్యం, సెల్ ఫోన్ మాట్లాడడం, సీట్ బెల్ట్ ధరించకపోవడం, మద్యం తాగి డ్రైవింగ్ చేయడం, రాంగ్ రూట్ లో ప్రయాణించడం వల్లనే అనేక ప్రమాదాలు జరుగుచున్నయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు. వాహన చోదకులు అవగాహన కల్పించేందుకు తమ ప్రయత్నంలో భాగంగా హోర్డింగ్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయనతో డీఎస్పీ కొలను శివరాం రెడ్డి, సీఐ నాగరాజు, ఎస్ఐ రవి కుమార్ ఉన్నారు.

విజయ డెయిరీని సందర్శించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 14: హనుమకొండ అలంకార్ జంక్షన్ సమీపంలోని విజయ పాల డెయిరీని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా డెయిరీ లో ఉన్న మిషనరీ, కోల్డ్ స్టోరేజ్ రూమ్ ను కలెక్టర్ పరిశీలించారు. డెయిరీలో ప్రస్తుతం ఉన్న మిషనరీ పనితీరు, పాలు, పాల ఉత్పత్తుల గురించి విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రవణ్ కుమార్ జిల్లా కలెక్టర్ కు వివరించారు. ప్రస్తుతం 15 వేల లీటర్ల కెపాసిటీతో డెయిరీ నడుస్తుందని, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పాల సేకరణ చేపడుతున్నామని, పదివేల లీటర్ల విజయ డెయిరీ పాలను మార్కెట్లో విక్రయిస్తున్నామని, 7500 లీటర్ల పాలను ప్రభుత్వ హాస్టళ్లకు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. పెరుగు, పాల నాణ్యతకు సంబంధించిన తనిఖీల ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. డెయిరీ ప్లాంట్ లో ఆధునిక టెక్నాలజీ తో నడిచే మిషనరీ కోసం నిధులు కేటాయించాలని డిడి శ్రవణ్ కుమార్ కలెక్టర్ ను కోరారు. డెయిరీ అభివృద్ధికి, నూతన మిషనరీ ఏర్పాటుకు విడతల వారీగా నిధులను కేటాయించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా డెయిరీ అధికారులు పాల్గొన్నారు.

బీహార్ ఎన్నికల గెలుపుపై హర్షం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 14 : బీహార్ ఎన్నికల్లో ఎన్‌డీయే కూటమి గెలుపు పై హర్షం వ్యక్తం చేస్తూ సంగారెడ్డి బీజేపీ జిల్లా కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టపాసులు పేల్చి, మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీహార్ ఎన్నికల తీర్పు తో మరోసారి ప్రధాని మోదీ నాయకత్వం మీద దేశ ప్రజలకు ఉన్న విశ్వాసం, నమ్మకం మరోసారి నిరూపితమైందన్నారు. దేశ అభివృద్ధి, సుస్థిర పాలన బిజెపితోనే సాధ్యమన్నారు. దేశ ప్రజలు బీజేపీ, మోదీ వైపు ఉన్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో దేశంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్ రెడ్డి ,మాణిక్ రావు,ఉపాధ్యక్షులు పోచారం రాములు, సీనియర్ నాయకులు రాజేశ్వర్ రావు దేశ్ పాండే, అధికార ప్రతినిధి రాజు గౌడ్ ఉన్నారు.

బాలలే దేశ భవిష్యత్

- బాలల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ లో శాంతి కపోతం ఎగురవేత
- బాలల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేయాలని పిలుపు
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

ప్రతిపక్షం, హన్మకొండ, నవంబర్ 14: నేటి బాలలే దేశ భవిష్యత్ అని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు, 14 నవంబర్ బాలల దినోత్సవం సందర్భంగా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్ , యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ పోలీస్, మరియు ఎఫ్ఎంఎంఎస్ఎస్ఎస్, డాన్ బాస్కో నవజీవన్ సమన్వయంతో కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా సంక్షేమ అధికారి జె జయంతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ బాల్యం అందమైనదని ఆ అనుభూతిని ప్రతి బాలుడికి బాలికకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికిపై ఉన్నదని, బాల్యదశ నుండే సత్ ప్రవర్తన, మానవతా విలువలు పెంపొందించి సన్మార్గంలో నడిపిస్తే బాలల దేశ భవిష్యత్ కు పునాది పడుతుందని అన్నారు. బాలల హక్కులకు భంగం కలుగకుండా, లింగ వివక్షత లేకుండా చూడాల్సిన అవసరం ప్రతి వ్యక్తిపై , కుటుంబం వ్యవస్థపై ఆధారపడి ఉందని, ఆ దిశగా కృషి చేస్తే నేటి బాలలను రేపటి ఆదర్శ సమాజ నిర్మాతలుగ తీర్చి దిద్దాలని అన్నారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ హనుమకొండ ప్రాజెక్ట్ పరిధి అంగన్వాడీ ప్రీ స్కూల్ చిన్నారులు ప్రదర్శించిన నృత్యాన్ని చూసి పిల్లలను అభినందించి వారికి బహుమతులు ప్రదానోత్సవం చేసి, శాంతి కపోతం,బెలూన్లు ఎగురవేసారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు కజాంపురం దామోదర్ సందసాని రాజేంద్ర ప్రసాద్, మాజీ ఛైర్పర్సన్ అనితా రెడ్డి, సిడిపివో ఎం విశ్వజ, బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ సీహెచ్ అవంతి, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్స్పెక్టర్ శ్యామ్ సుందర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అదనపు అధికారి డాక్టర్ టి మదన్ మోహన్ రావు, డాక్టర్ ఇక్తెదార్ అహ్మద్, డెమో అశోక్ రెడ్డి,జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఇన్చార్జి అధికారి ఎస్ ప్రవీణ్ కుమార్, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ ఎస్ భాస్కర్, ఎఫ్ఎంఎం ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎర్ర శ్రీకాంత్ ప్రోగ్రాం మేనేజర్ బత్తుల కరుణ, డాన్ బాస్కో నవజీవన్ అసిస్టెంట్ డైరెక్టర్ పి సంతోష్‌కుమార్,జిల్లా బాలల పరిరక్షణ విభాగం మౌనిక, శ్రీనివాసులు, సునిత, చైతన్య, సుజాత, విజయ్ కుమార్, సీత, శివ ప్రసాద్,చైల్డ్ లైన్ రజిత, హరీష్, రమేష్, సఖి వన్ స్టాప్ సెంటర్, జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది, మహిళా సాధికారత కేంద్రం అధికారులు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఐసిడిఎస్ సూపర్వైజర్లు అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు ట్రైనీ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రజలు పట్టం కట్టారు

- బీఆర్ఎస్ అసత్యప్రచారాలను ప్రజలు నమ్మలేదు
- బీఆర్ఎస్ భూస్థాపితం కావడం ఖాయం
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఘన విజయం పట్ల వనపర్తి కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు

ప్రతిపక్షం, వనపర్తి ప్రతినిధి, నవంబర్ 14: సీఎం.రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారనడానికి ఈ ఎన్నికల నిదర్శనమని వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్,నియోజకవర్గ సమన్వయ కర్త లక్కాకుల సతీష్, కాంగ్రెస్ పార్టీ వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ చందర్ లు అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా నవీన్ యాదవ్ ఘన విజయం సాధించడం పట్ల వనపర్తి పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బాణాసంచా కాల్చి ఒకరికొకరు మిఠాయి తినిపించుకొని, సంబరాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి మద్దతుగా నిలిచి ప్రజలు మరింత ప్రోత్సాహం ఇచ్చారని తెలిపారు.మొన్నటి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలైన ఇవాల్టి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికైనా రేపటి స్థానిక సంస్థల ఎన్నికలైనా కాంగ్రెస్ దే గెలుపని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఫలితాల సరళితో బీఆర్ఎస్,బీజేపీలను ప్రజలు నమ్మలేదని తేటతెల్లమైందని చెప్పారు. అధికారం కోసం అడ్డగోలు కూతలు కూసే ఆ పార్టీలకు జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు కర్రు కాల్చి వాతపెట్టారని అన్నారు. వాపును చూసి బలుపని విర్రవీగిన బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు సరైన గుణపాఠం చెప్పారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజి మున్సిపల్ వైస్ చైర్మెన్. కృష్ణ,విభూది నారాయణ, పరుశురాం, గోపాల్, జిజే. శ్రీను, చుక్క రాజు, దేవన్న నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జవహర్ లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలు ఎనలేనివి

- చిన్నారులు అంటే నెహ్రూకు అమితమైన ప్రేమ
- ఘనంగా జవహర్లాల్ నెహ్రూ జయంతి వేడుకలు

ప్రతిపక్షం, వనపర్తి ప్రతినిధి, నవంబర్ 14: భారత స్వాతంత్ర్య సమరయోధులు, దేశ ప్రథమ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలు ఎనలేనివని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కొనియాడారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల సమీపంలో ఉన్న బాలసదనంలో భారత ప్రథమ ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా జిల్లా మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకలకు జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ నెహ్రూ చిత్రపటానికి పూలు వేసి నివాళి అర్పించారు. అనంతరం అక్కడే ఉన్న చిన్నారులతో కేకు కట్ చేయించి, బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సమరయోధులు, దేశ ప్రథమ ప్రధాని జవహర్లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు.నెహ్రూకి చిన్నారులు అంటే అమితమైన ప్రేమ ఉండేదని గుర్తు చేశారు. బాలసదనంలో ఉండే విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని బాగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.విద్యార్థులను, చిన్నారులను వారు కోరినట్లుగా హైదరాబాద్ పర్యటనకు తీసుకువెళ్లాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ బాలల దినోత్సవం సందర్భంగా బాలసదనంలోని చిన్నారులకు విద్యార్థులకు కలెక్టర్ స్వెటర్లు పంపిణీ చేశారు. అదేవిధంగా వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ప్రశంసా పత్రాలు మెమెంటోలు అందజేశారు.క్విజ్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి ప్రత్యేక ప్రశంసలు తెలిపారు.బాలసదనానికి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి సహకరించిన జిల్లా కలెక్టర్కు సంక్షేమ శాఖ అధికారులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.జిల్లా సంక్షేమ శాఖ అధికారిని సుధారాణి, బాలల సంరక్షణ కమిటీ సభ్యులు, తహసిల్దార్ రమేష్ రెడ్డి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బిహార్ ఎన్నికల తరువాత కాంగ్రెస్ పని ఖతమైంది. రాహుల్ గాంధీ ఇక పబ్జీ గేమ్‌కే పరిమితమవుతారు. కేటీఆర్‌వర్కింగ్ ప్రెసిడెంట్ అయినప్పటి నుంచి బీఆర్‌ఎస్‌పతనం కొనసాగుతూనే ఉంది. దేశంలో రాహుల్, తెలంగాణలో కేటీఆర్ ఐరన్ లెగ్స్. దేశం మొత్తం పోటీ చేస్తామని కేసీఆర్ పత్తా లేకుండా పోయారు. చివరకు ఆ పార్టీ ఉప ప్రాంతీయ పార్టీగా మారింది.

- కేంద్ర మంత్రి బండి సంజయ్

ప్రాంతీయం

అవగాహనతోనే వరదలు, నీటి ముంపు నుంచి రక్షణ

- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్
- ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ మాక్ డ్రిల్
- సిరిసిల్ల మానేరు తీరంలో అవగాహన సదస్సు

ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల, నవంబర్ 14: అవగాహనతోనే వరదలు, నీటి ముంపు నుంచి రక్షణ పొందవచ్చని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పేర్కొన్నారు. కమ్యూనిటీ అవేర్ నెస్ లో భాగంగా భారత ప్రభుత్వం, హోమ్ శాఖ ఆదేశాల మేరకు ఎన్డీఆర్ఎఫ్ బెటాలియన్, సిరిసిల్ల అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణం లోని మానేరు తీరంలో మాక్ డ్రిల్ నిర్వహించగా, ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విహారయాత్ర లకు వెళ్లే పర్యాటకులు, సరదాగా నదీ తీరాల్లో విహరించే వారు, ఈత రాని వారు నీళ్ళల్లో మునిగి పోయినప్పుడు డ్రిల్ చూపించిన విధంగా చేస్తే ప్రాణాలు ఎలా కాపాడుకోవచ్చో వివరించారు. వరదలు సంభవించినప్పుడు, ఆకస్మాతుగా నీరు పట్టణాలు, గ్రామాల్లోకి వచ్చినప్పుడు అందుబాటులో ఉన్న ఖాళీ బాటిల్స్, క్యాన్స్, థెర్మాకోల్ షీట్స్, ప్లాస్టిక్ బిందెలు ఎండిన కొబ్బరి బొండాలు మొదలగునవి ఉపయోగించి నీటిలో తెలియాడే పద్దతులు తెలియజేశారు. నీటిలో మునిగి పోతున్న వ్యక్తి ని ఎలా లాక్కు రావాలి అని వివిధ పద్దతులలో చూపించారు. బయటకు తీసుకు వచ్చిన వ్యక్తికి సీ పీ ఆర్, కృత్రిమ శ్వాస ఎలా కల్పించాలి, నీరు ఎలా బయటికి రప్పించాలో ప్రాక్టికల్ గా చూపించారు. అనంతరం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఆపద సమయంలో ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. అవగాహన పొందిన వారు తమ కుటుంబ సభ్యులు, సమీప ప్రజలకు వివరించాలని పిలుపుఇచ్చారు. చాలా చక్కగా మాక్ డ్రిల్ చేసిన ఎన్డీఆర్ఎఫ్ బెటాలియన్, సిరిసిల్ల అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్ గౌతం, జిల్లా అగ్ని మాపకశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, డీఏఓ అఫ్జల్ బేగం, సీపీఓ శ్రీనివాసాచారి, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య, అధికారులు, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ స్టూడెంట్స్, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 14: చేగుంట మండలం కర్నాల్పల్లి వీర హనుమాన్ సాయిబాబా ఆలయంలో శుక్రవారం పార్వతి పరమేశ్వరుల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామీజీ పాల్గొని భక్తులకు సందేశం ఇచ్చారు. కార్తీక మాసంలో పార్వతీ పరమేశ్వర కళ్యాణోత్సవ కార్యక్రమం చేపట్టడం శుభ సూచకమన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాకులు కాడిగిద్ద దయాదిరెడ్డి, అంబటి ఆంజనేయులు, రమేష్, రామిరెడ్డి, తుమ్మ యాదగిరి, తుమ్మ శ్రీనివాస్, కొండల్ రెడ్డి, నాగలింగం, ప్రభాకర్ రెడ్డి, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే మైనపల్లి రోహిత్ రావు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 14: మత్స్యకారుల సంక్షేమంలో భాగంగా వారికి ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. శుక్రవారం శంకరంపేట ఆర్ మండలంలోని మిర్జాపల్లి గ్రామ చెరువులో మరియు గజగట్లపల్లిలో ఉచిత చేప పిల్లల పంపిణీ చేశారు. ఏ సందర్భంగా ఎమ్మెల్యే మైనపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ.. మత్స్యకారుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం చేపట్టినటువంటి 100% రాయితీ తో చేపపిల్లల పంపిణీ చేస్తుందన్నారు. మత్స్య కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. రాష్ట్రంలో మత్స్య సంపద పెంచాలని, తద్వారా మత్స్య కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో జలాశయాలలో నీరు సమృద్ధిగా ఉండడం వల్ల చేప పిల్లల పెంపకానికి అనువైన వాతావరణం ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం చేపలను దిగుమతి స్థాయి నుండి ఇప్పుడు ఎగుమతి చేసే స్థాయికి ఎదగడం శుభపరిణామం అని పేర్కొన్నారు. చెరువును కాపాడుకోవాల్సిన బాధ్యత, చేప పిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత, ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బోయిని అరుణ ప్రభాకర్, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక కుంకుమార్చన

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 14: కార్తీక మాసం పురస్కరించుకొని శుక్రవారం శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి దేవాలయంలో భక్తిశ్రద్ధలతో శ్రీ గౌరీ మాత దేవి సామూహిక సహస్రనామ కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 150 మంది మహిళలు పాల్గొన్నారు. పూజా కార్యక్రమానికి అవసరమైన పూజా సామగ్రిని దేవాలయము తరపున సమకూర్చారు. కార్యక్రమానికి విచ్చేసిన భక్తులందరికీ అన్నప్రసాదం (భోజనం) ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమ నిర్వహణలో నీలకంఠ సమాజ అధ్యక్షులు గుండ్ల యోగేశ్వర్, గౌరవ సలహాదారు లోక లక్ష్మీరాజం, ప్రధాన కార్యదర్శి అబ్బతిని సురేష్, కోశాధికారి కాల్వ శ్రీకాంత్, కాల్వ శంకర్, ప్రచార కార్యదర్శి కడవేర్గు రాజు, నారాయణ, అప్పయ్యగారి సుధాకర్ తదితరులు కీలక బాధ్యతలు నిర్వర్తించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

బీహార్‌లో బీజేపీ ఘన విజయం

- సిద్దిపేటలో బీజేపీ శ్రేణుల సంబరాలు

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 14: బీహార్ రాష్ట్రంలో బీజేపీ ఘన విజయం సాధించడంతో సిద్దిపేట బీజేపీ నాయకులు పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బీజేపీ అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ మాట్లాడుతూ, దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా బీజేపీ విజయ పరంపర ఆగకుండా కొనసాగుతోందని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రజలకు ఉన్నగట్టి విశ్వాసమే అన్ని రాష్ట్రాల్లో పార్టీకి స్పష్టమైన ఆధిక్యాన్ని తీసుకువస్తోందని చెప్పారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలతో ప్రచారం చేసినప్పటికీ ప్రజలు నమ్మకాన్ని చూపలేదని, పలుచోట్ల డిపాజిట్లు కూడా రాలేని స్థితికి చేరిందని ఆయన విమర్శించారు. రాబోయే 2029 ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.బీజేపీని విశ్వసించి భారీ మెజార్టీతో గెలిపించిన బీహార్ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్,కసనగొట్టు సంతోష్,గుండ్ల జనార్ధన్,కెమ్మసరం సంతోష్,పవన్,గందె సంతోష్,బంధారం కనకరాజ్,గడిచర్లపల్లి శ్రీనివాస్,చంది సత్యనారాయణ,ఎర్వ గణేష్,సురేష్,సాయిబాబా,మహేందర్,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

గంగా జమునా తహజీబ్ గెలిచింది

- సిద్దిపేట కాంగ్రెస్ నాయకుడు, కౌన్సిలర్ రియాజుద్దీన్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 14: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మతోన్మాదాన్ని కాలితో తన్నేసి గంగా జమునా తహజీబ్ గెలిచిందని సిద్దిపేట కాంగ్రెస్ నాయకుడు, 20వ వార్డు కౌన్సిలర్ రియాజుద్దీన్ అన్నారు. శుక్రవారం అయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ నోటికొచ్చినట్టు మాట్లాడడని 80 శాతం, 20 శాతం శాతం అంటూ రెచ్చగొట్టాడని మండిపడ్డారు. టోపీ పెట్టుకున్నోళ్లకు మొలదారం కట్టుకున్నాల్లాకు పోటీ అని ప్రజలను మతం పేరుతో డివైడ్ చేసి ఎన్నికల్లో లబ్ది పొందే ప్రయత్నం చేశారని అన్నారు. కానీ జూబ్లీహిల్స్ ప్రజలు మతోన్మాదాన్ని కాలితో తన్నేసి గంగా జమునా తహజీబ్ కు ఓటు వేశారని అన్నారు. ఇక్కడ మతోన్మాదులకు తావు లేదని, అందరూ కలసి అభివృద్ధికి పట్టం కట్టారని అన్నారు. చేసిన అభివృద్ధి చెప్పి ఓట్లు అడగాలి కాని, ఎక్కడికి వెళ్లినా మతం, కులం అంటూ నోరు జారితే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హితవు పలికారు. జూబ్లీహిల్స్ విజయం ప్రజల విజయమని ఇది బీఆర్ఎస్, బీజేపీకి చెంప పెట్టులాంటిదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా మైనారిటీ చైర్మన్ మజ్హర్ మాలిక్, కాంగ్రెస్ నాయకులు ఎర్ర మహేందర్, గుండు రవితేజ (లడ్డు), జావిద్, రహీం తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఎన్నికల విజయం పట్ల

కాంగ్రెస్ సంబరాలు

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 15: జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు పట్ల మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. బీఆర్ఎస్ ప్రత్యర్థిపై 25 వేల మెజార్టీతో నవీన్ యాదవ్ గెలుపొందడం హర్షించదగిన విషయమని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నవీన్, మాజీ ఎంపీపీ మసూల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు సంద్రుగు శ్రీకాంత్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అయిత పరంజ్యోతి, పురె ఆగమయ్య, సిరిగోజి స్టాలిన్, నర్సింహులు, అన్నం ఆంజనేయులు, కె. మహేష్ చౌదరి, శ్రీనివాస్, నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా ధాన్యం కొనుగోలు

- ఇప్పటివరకు జిల్లాలో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 14: మెదక్ జిల్లా రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గ్రామంలోని పాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. జిల్లాలో దాదాపు 500 ధాన్యం కొనుగోలు కేంద్రాలు జిల్లాలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సన్న రకం, దొడ్డు రకం ధాన్యాన్ని పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నామన్నారు. ధాన్యం తరలింపు కోసం 67 రైస్ మిల్లులు ట్యాగింగ్ చేయడం జరిగిందని, ఇంకా 20 మిల్లులను ట్యాగింగ్ కొరకు సిద్ధం చేస్తున్నామన్నారు. శుక్రవారం వరకు లక్ష మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని, రూ. 84.19 కోట్ల చెల్లింపులు జరిగాయన్నారు. ఈ సారి అంచనాలకు మించి సుమారు మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసే దిశగా ముందుకు పోతున్నామన్నారు. డిసెంబర్ కల్లా కొనుగోలు పూర్తిచేసి రైతుల ఖాతాలలో డబ్బులు జమ చేసే విధంగా పటిష్ట కార్యచరణ ద్వారా ముందుకు పోతున్నామన్నారు. సన్న వడ్లకు బోనస్ చెల్లించే విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఈ సీజన్ కు సంబంధించిన డబ్బులు ఆకౌంట్లో జమవుతుందని తెలిపారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు,కొనుగోలు కేంద్రం నిర్వాహకులు,తదితరులు ఉన్నారు.

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే గెలుపు ఇది వికసిత్ బిహార్‌పై నమ్మకం పెట్టుకున్న ప్రతి ఒక్కరి విజయం. జంగిల్ రాజ్, బుజ్జగింపు రాజకీయాలు చేసే వారు ఏ వేషంలో వచ్చినా దోచుకునేందుకు అవకాశం లభించదు. పని తీరు ఆధారంగా ప్రజలు తీర్పు చెప్పారు. బిహార్ ప్రజల ప్రతి ఓటు మోదీ ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకానికి చిహ్నం.
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా

కూర నాణ్యత మెరుగుపరచి రుచికరంగా వండాలి

- గుర్రాలగొంది ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్
- జిల్లా కలెక్టర్ హైమవతి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 14: విద్యార్థులు శారీరకంగా దృఢంగా ఉంటేనే మానసిక ఆరోగ్యంగా ఉండి చదువుకోడానికి వీలుగా ఉంటుందని జిల్లా కలెక్టర్ హైమవతి పేర్కొన్నారు. శుక్రవారం నారాయణరావ పేట మండలంలో జిల్లా కలెక్టర్ కె హైమావతి పర్యటించారు. మండలంలోని గుర్రాలగొంది గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మెనూ ప్రకారం అన్నం, టమాటా పప్పు, సాంబారు, గుడ్డు వండినట్లుగా వంట సిబ్బంది తెలపగా ఆహార పదార్థాలను తనికి చేశారు. కూర నాణ్యత మెరుగుపరచాలని రుచికరంగా వండాలని సిబ్బందిని ఆదేశించారు. వడ్డించే ప్రక్రియను పరిశీలిస్తూ విద్యార్థుల హాజరు ప్రకారం ఆహార పదార్థాలు తయారుచేయాలని మొత్తం ప్రక్రియను ప్రిన్సిపల్ పర్యవేక్షణ చెయ్యాలని ఏ ఒక్క విద్యార్థికి ఎలాంటి కొరత లేకుండా చూసుకోవాలని ప్రిన్సిపల్ ను ఆదేశించారు. మండలంలోని జక్కాపూర్ గ్రామంలో గల ఐకేపి సెంటర్ లో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తేమశాతం తనిఖీ చేశారు. తేమశాతం రాగానే వెంటనే గన్నీలలో నింపి లారీలలో లోడ్ చేయించాలని సెంటర్ సిబ్బందిని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సెంటర్ లో అన్ని వసతులు కల్పించాలని కొనుగోలులో జాప్యం కాకుండా చూసుకోవాలి సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలోనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. అటెండెన్స్ రిజిస్టర్ వెరిఫై చేస్తూ మెడికల్ ఆఫీసర్ బాపురెడ్డి డ్రై డే కి వెళ్ళారని ఇతర సిబ్బంది సునీత, సుధారాణి ఫీల్డ్ కి వెళ్లినట్లుగా సిబ్బంది తెలపగా ఆరా తీయాలని తహసిల్దార్ ను ఆదేశించారు. ఏదో మొక్కుబడిగా ఓపి రిజిస్టర్ రాస్తూ, ఫీల్డ్, మీటింగ్స్ పేరుతో విధులు నిర్వహించని యెడల కఠిన చర్యలు తీసుకోవాలని డీఎంఅండ్ హెచ్ఓ ని ఫోన్ ద్వారా హెచ్చరించారు.

అభివృద్ధి, సంక్షేమాలకు ప్రజలు జై కొట్టారు

- కాంగ్రెస్ మండల అధ్యక్షులు మహదేవుని శ్రీనివాస్

ప్రతిపక్షం, కొమురవెల్లి, నవంబర్ 14: జూబ్లీహిల్స్ ఉపఎన్నికలలో అభివృద్ధి, సంక్షేమాలకు ప్రజలు జై కొట్టి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా నవీన్ యాదవ్ ను ఎన్నుక్కున్నారని కాంగ్రెస్ కొమురవెల్లి మండల అధ్యక్షులు మహదేవుని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కొమురవెల్లిలో టపాసులు కాల్చి స్వీట్లు పంచి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ గెలుపుతో భారత రాష్ట్ర సమితి ఖేల్ ఖతం.. దుకాణం బంద్ అని అన్నారు. రేవంత్ రెడ్డి వ్యూహం, హైదరాబాద్ ఇన్చార్జి మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, వివేక్ వెంటట్ స్వామి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జనగామ డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాపరెడ్డి కృషి, కార్యకర్తల పట్టుదల కలిసి జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ విజయం సాధించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

మంత్రి అజారుద్దీన్ కలిసిన మైనార్టీ కాంగ్రెస్ నేతలు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 14: హైదరాబాద్ సెక్రటేరియట్ లో నూతనంగా మైనారిటీ వెల్ఫేర్, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అజహరుద్దీన్‌ను టీపీసీసీ కాంగ్రెస్ నాయకులు ఎం ఏ. సుభాన్, రాష్ట్ర కాంగ్రెస్ మైనారిటీల నాయకులు వహీద్ ఖాన్ కలిసి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మైనారిటీల ఎదుర్కొంటున్న సమస్యలను నేతలు మంత్రికి వివరించారు. ముఖ్యంగా మైనారిటీ నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం, పాస్‌పోర్ట్ దరఖాస్తులు, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, అలాగే బీసీ ఈ సర్టిఫికెట్ల కోసం ప్రతిరోజూ అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోందని విన్నవించారు. అర్హులైన ప్రతి మైనారిటీ విద్యార్థి, నిరుద్యోగ యువకులకు వెంటనే బీసీ ఈ సర్టిఫికెట్లు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వారి అభ్యర్థనపై మంత్రి అజహరుద్దీన్ వెంటనే స్పందించి, తెలంగాణలో సర్టిఫికెట్ సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు వహీద్ ఖాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అలయన్స్ క్లబ్ వారి చేయూత

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 14: కొండపాక మండలం జప్తి నాచారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అలయన్స్ క్లబ్ మహిళా విభాగం పీఆర్వో జిల్లా రేణుక, మద్ది అనిత ఆధ్వర్యంలో నవంబర్ 14 బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని చలికాలం కావడంతో బ్లాంకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల సంఖ్యను 14 నుంచి 50కి పైగా పెంచిన హెచ్ ఎం కొడాలి నరసయ్యను అలయన్స్ క్లబ్ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొడారీ నరసయ్య, స్త్రీ జాగరణ సమితి అధ్యక్షురాలు లక్కిరెడ్డి విజయ శుభార్ రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ ముస్త్యాల కనకయ్య, మహిళా మోర్చా అధ్యక్షురాలు ఇర్రి ఉమా సురేష్ రెడ్డి, నర్రా భాస్కర్ రెడ్డి, పీఆర్టీయూ నాయకులు, అలయన్స్ క్లబ్ సభ్యురాలు లక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయిని రమాదేవి లావణ్య, అమ్మ కమిటీ చైర్మన్, సభ్యులు, గ్రామ పెద్దలు తల్లిదండ్రులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మహోన్నతుడు జవహర్ లాల్ నెహ్రూ

- సిద్దిపేట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్
- జయంతి సందర్భంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నివాళులు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 14: దేశ అభివృద్ధే లక్ష్యంగా కృషిచేసిన మహోన్నతుడు మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ అని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్దిపేటలో మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు పట్టణంలోని నెహ్రూ పార్కు వద్ద ఉన్న నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అత్తు ఇమామ్ మాట్లాడుతూ భారత దేశ తొలి ప్రధానిగా సంక్షోభ సమయంలో దేశాన్ని కలిసికట్టుగా ఉంచి సమర్థంగా నడిపించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన తిరుగులేని నాయకుడు నెహ్రూ అని అన్నారు. నవనిర్మాణ జాతికి మార్గదర్శిగా భారత ప్రజలందరికీ ఓటు హక్కు కల్పించి, వ్యవసాయ రంగాన్ని భారతదేశ అభివృద్ధి కేరాఫ్ గా మార్చి, దివాలా తీసిన ఆర్థిక వ్యవస్థను చక్కబెట్టారని అన్నారు. నెహ్రూ సూచించిన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన భాద్యత అందరిపై ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ముద్దం లక్ష్మి, మార్గ సతీష్ గౌడ్, సఖి, ఆనంద్, గయాజుద్దీన్, కవిత, స్రవంతి, రజిని, సన తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనకు పట్టం కట్టిన ప్రజలు

- నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్

ప్రతిపక్షం, చిన్నకోడూర్, నవంబర్14: రాహుల్ గాంధీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీసీ లకు 42% రిజర్వేషన్ అమలు చేసిన మొదటి రాష్ట్రం తెలంగాణ అని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు అరుకాల శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి బీసీ బిడ్డ నవీన్ యాదవ్ కు టికెట్ ఇచ్చినందుకు బీసీలు సత్తా చాటి, గెలుపునకు కృషి చేసిన జూబ్లీహిల్స్ ప్రజలందరికీ, కాంగ్రెస్ శ్రేణులకు, బీసీ బిడ్డలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు సంక్షేమ పథకాలే కాంగ్రెస్ పార్టీని గెలిపించాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కనకరాజు, వర్కర్స్ కాంగ్రెస్ కమిటీ తెలంగాణ రాష్ట్ర యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ అంకర్ మధు, సేవాదళ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కోనేటి కరుణాకర్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు చిరంజీవి, మండల మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తిని గణేష్, జిల్లా సీనియర్ నాయకులు పల్లె రాజు, చిన్నకోదూరు మండల్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు గుంజే రాజేందర్, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కొండం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ సేవాదళ్ ఉపాధ్యక్షులు జేరిపోతుల బాబు, జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ప్రశాంత్ రెడ్డి, సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ సెక్రెటరీ గంటా శ్రీను, మండల నాయకులు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు లింగంపల్లి నాగరాజు, పండుగ శంకర్, గొల్లపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

- మెదక్ గ్రంథాలయాన్ని రాష్ట్రంలోనే మోడల్ గ్రంథాలయంగా తీర్చిదిద్దాలి
- మెదక్ ఎంపీ రఘునందన్ రావు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 14: గ్రంథాలయాల విజ్ఞాన భాండాగారాలని, గ్రంథాలయాలు ఉపయోగించుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. శుక్రవారం మెదక్ గ్రంథాలయంలో 58 వ గ్రంథాలయాల వారోత్సవాల్లో ముఖ్యఅతిథిగా మెదక్ ఎంపీ రఘునాథరావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ తను 5 లక్షల విలువగల పుస్తకాలు అందించడానికి సిద్ధంగా ఉన్నానని, దీనికి ప్రణాళిక చేయాలని గ్రంథాలయ కార్యదర్శికి సూచించారు. మెదక్ గ్రంథాలయాన్ని రాష్ట్రంలో ఆదర్శ గ్రంథాలయంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ గ్రంథాలయంలో చాలామంది విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజేతలుగా నిలిచినందుకు వారికి అభినందనలు తెలుపుతున్న అన్నారు. విద్యార్థులు తమ చదువుల్లో, పోటీ పరీక్షల్లో మాత్రమేకాదు, వ్యక్తిత్వ వికాసంలో కూడా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా గ్రంథాలయాల చైర్మన్ సుహాసిని రెడ్డి మాట్లాడుతూ పుస్తకాలు, నూతన విషయాలు, వివిధ సమాచార వనరులు, ప్రయోగాలపై అవగాహన పెంచడానికి గ్రంథాలయాలు కీలక మాధ్యమంగా నిలుస్తున్నాయన్నారు. కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ గ్రంథాలయాలు నాలెడ్జ్ హబ్‌గా పని చేస్తాయని, అన్ని వయస్సుల వారికి పుస్తకాలు, పత్రికలు, నిఘంటువులు, ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి వంశీకృష్ణ, పాఠకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 14: శంకరంపేట (ఆర్) మండలం మిర్జాపల్లి తాండ గ్రామంలో ఇందిరమ్మ పథకం కింద నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఇళ్లను ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు. ప్రభుత్వ తోడ్పాటుతో ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులను అభినందిస్తూ, వారిచే గృహ ప్రవేశాలు చేయించారు. తమ సొంతింటి కలను సాకారం చేసిన ప్రభుత్వానికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని మిగతా లబ్దీదారులు కూడా త్వరితగతిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని, అన్ని విధాలుగా సహకారం అందిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ దామోదర్, డీఈ యాదగిరి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పెందోట సాహిత్య పురస్కారాల

కరపత్రం ఆవిష్కరణ

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 14: పెందోట సాహిత్య పురస్కారాలు-2025, బాల కథల పోటీ-2025 బహుమతుల ప్రదాన సభకు సంబంధించిన కరపత్రాన్ని పెందోట వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ నెల 16 ఆదివారం ప్రెస్ క్లబ్‌లో పెందోట సాహిత్య పురస్కారాల సభ ఉంటుందని తెలిపారు. సభకు ముఖ్య అతిథిగా కవి నలవోలు నర్సింహారెడ్డి, పుస్తక ఆవిష్కరణకు డా. గోపాల సుదర్శన్ హాజరవుతారని అన్నారు. కార్యక్రమాన్ని శ్రీ వాణి సాహిత్య పరిషత్, పెందోట బాల సాహిత్య పీఠం సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ రాజలింగం, కవి నార్లపురం రాములు, ఆనందచారి, సిద్ది రాములు పాల్గొన్నారు.

ప్రజా పాలనకే పట్టం

- కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ బ్లాక్ బి కరుణాకర్ ఆధ్వర్యంలో సంబరాలు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్14 : కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో చిన్నకోడూరు మండల కాంగ్రెస్ లో ఉత్సాహం నిండింది. కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ బ్లాక్ బి అధ్యక్షుడు కోనేటి కరుణాకర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీగా గెలుపు సంబరాలు జరుపుకున్నారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకుని గెలుపు సంబరాలను నిర్వహించారు. జూబ్లీహిల్స్ ప్రజలు అందించిన మద్దతుకు కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి కొనసాగిస్తామని కర్ణాకర్ తెలిపారు.

బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం

- సీడీపీఓ వెంకటరమణమ్మ

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 14: బాల్య వివాహాలు చేయడం, ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని మెదక్ సీడీపీఓ వెంకటరమణమ్మ అన్నారు. శుక్రవారం మెదక్ మున్సిపాల్ కార్యాలయంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను నిరోధించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఆడపిల్ల వయస్సు 18 సంవత్సరాలు నిండక ముందే వివాహం జరిపిస్తే మానసిక, శారీరక అనర్థాలు సంభవిస్తాయని పేర్కొన్నారు. వారికి జన్మించే పిల్లలు కూడా ఆరోగ్యకరంగా ఉండరని వైకల్యం కలిగి ఉంటారనే విషయాన్ని తల్లి దండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆడపిల్లలకు బాల్య వివాహం చేయరాదని, దీనిని అందరూ ముక్తకంఠంతో ఖండించి వయస్సు నిండే వరదాకా వేచి చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు మాధవి, శ్రీదేవి, మున్సిపాల్ డీఈ మహేష్, టీపీవో భూపతి, భవాని, డీహెచ్‌ఈ డబ్ల్యూ నాగమణి, అంగన్వాడీ టీచర్లు, ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది, తదితరులున్నారు.

కాకతీయలో ఘనంగా జాతీయ బాలల దినోత్సవం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 14: సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కాకతీయ హైస్కూల్లో, భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని జాతీయ బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిస్మాట్ (బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ) స్టేట్ జనరల్ సెక్రటరీ జగ్గు మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం మల్లారెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ...చిన్ననాటి నుండి విద్యార్థులు మహనీయుల అడుగుజాడల్లో పయనించి, సమాజ దిశానిర్దేశకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. చిన్నారి విద్యార్థులు వేసిన వివిధ వేషాధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులను మల్లారెడ్డి అభినందించి, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కవిత, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

జీవితంలో ఒక లక్ష్యంతో కష్టపడితే విజయం

- జిల్లా బాలల దినోత్సవ వేడుకల్లో సీపీ విజయ్ కుమార్

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 14: పిల్లలు ఆరోగ్యంగా, భద్రంగా, లక్ష్యంతో ఎదగాలంటూ సీపీ ఎం. విజయ్ కుమార్ విలువైన సూచనలు చేశారు. జీవితంలో ఒక లక్ష్యంతో కష్టపడితే విజయం దక్కుతుందని అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీ విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలోని కృప భవనం, బాలసదనం, ఆశాజ్యోతి, శిశు గృహ, నిషన్ బాలసదనం పిల్లలు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. బాలసదనం చిన్నారులు నృత్య ప్రదర్శనతో ఆకట్టుకోగా, నిషన్ బాలసదనం పిల్లలు భగవద్గీత శ్లోకాలను ఆలపించారు. బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజయం సాధించిన పిల్లలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ విజయ్ కుమార్ మాట్లాడుతూ పాఠశాలలు, గురుకులాలు, సమాజంలో ఎక్కడైనా అసభ్య ప్రవర్తన కనిపించిన వెంటనే 100 నంబర్‌కు కాల్ చేయాలని, పిల్లల్లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించడం చాలా అవసరం అని తెలిపారు. చైల్డ్ కేర్ సెంటర్లలో ఉన్న పిల్లలు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వ వనరులు, సంస్థల సహకారంతో ఉన్నత స్థానాలకు చేరుకునే అవకాశాలు అమితమని సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అబ్దుల్ హమీద్ మాట్లాడుతూ "నేటి బాలలే రేపటి పౌరులు. పిల్లలు ఆటలు బాగా ఆడి, మంచి ఆహారం తీసుకుని, సమయాన్ని వృథా చేయకుండా చదువుతూ భవిష్యత్తును నిర్మించుకోవాలి" అని అన్నారు. ఈ సందర్భంగా బాలికల సంరక్షణపై రూపొందించిన పలు పోస్టర్‌లను అధికారులు కలసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యుఓ శారదా, డీఆర్ఓ నాగరాజమ్మ, డీఆర్డిఓ జయదేవ్ ఆర్య, డీఎంఅండ్ హెచ్ఓ ధనరాజ్, డీపీఓ వినోద్ కుమార్, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి సాయి తదితరులు పాల్గొన్నారు.

“

అధికారం పోయినా హరీశ్ రావుకు అసూయ, కేటీఆర్‌కు అహంకారం తగ్గలేదు. వారిద్దరు అసూయ, అహంకారం తగ్గించుకోవాలి. అసెంబ్లీలో రక్తమంతా మొహంలోకి తెచ్చుకుని హరీశ్ చూస్తుంటాడు. ఆ చూపులకు శక్తి ఉంటే మాడి మసైపోతాం. అధికారం శాశ్వతం కాదు. ప్రతిపక్షాలు ప్రభుత్వానికి సూచనలు చేయాలి. సమస్యలపై ధర్నాలు చేసినా తమకు అభ్యంతరం లేదు.

- సీఎం రేవంత్‌రెడ్డి

ప్రాంతీయం

పేదలకు అండగా ప్రజా ప్రభుత్వం పాలన

- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్ (ధర్మారం), నవంబర్ 14: రాష్ట్రంలో నిరుపేదలకు అండగా ప్రజా ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి ధర్మారం మండలం నంది మేడారంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ నంది మేడారం గ్రామ అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని అన్నారు. గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాల, లైన్ల షిఫ్టింగ్ కోసం 36 లక్షలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. గ్రామ సమాఖ్య మహిళా సంఘాల కోసం భవన నిర్మాణానికి 10 లక్షల రూపాయల మంజూరు చేశామని, అంగన్వాడి భవన నిర్మాణం కోసం 11 లక్షలు మంజూరు చేసామని, తన దగ్గర ఉన్న స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ నుంచి అదనంగా మరో 5 లక్షలు నుంచి 10 లక్షల వరకు మంజూరు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. నంది మేడారం గ్రామంలో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. 30 పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయిందని అందులో అవసరమైన సిబ్బంది, పరికరాలు త్వరగా ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు ప్రారంభిస్తామని అన్నారు. గత ప్రభుత్వం పేదలకు సొంతింటి కార్యక్రమం విస్మరిస్తే ప్రజా ప్రభుత్వంలో మొదటి సంవత్సరం 4.5 లక్షల ఇండ్లు మంజూరు చేశామని, అర్హులైన ప్రతి ఒక్కరికి రాబోయే రోజులలో 3 విడతల్లో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసే బాధ్యత తాను తీసుకుంటానని, ప్రతి సోమవారం లబ్దిదారులకు ఖాతాలలో ఇందిరమ్మ ఇండ్ల డబ్బులు జమ చేస్తున్నామని తెలిపారు.

ఘనంగా బాలల దినోత్సవం

ప్రతిపక్షం, సోన్, నవంబర్ 14: సోన్ మండలం పాక్ పట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధించారు. ఈ సందర్భంగా పోషకులు, విద్యార్థులు ఉపాధ్యాయులు కలిసి మొక్కలు నాటారు. తరగతి గదిలో విద్యార్థులు బోధించడంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయులుగా కె.మంగ, పిఈటిగా బి.నరేష్ అటెండర్ గా ఎస్.చరణ్ మరికొద్దిమంది విద్యార్థులు పాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఎన్ వెంకన్న మాట్లాడుతూ భారత దేశ తొలి ప్రధాని స్వాతంత్ర సమరయోధులు పండిత్ జవహర్లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని జాతీయ బాలల దినోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ,ప్రధానోపాధ్యాయు ఎన్. వెంకన్న ఉపాధ్యాయులు ఎం. చంద్రశేఖర రావు ,తోడిశెట్టి రవికాంత్, ఘటిక రవికాంత్, బలిరాం, అరుణ, రత్నాకరలు పాల్గొన్నారు.

వైస్ చైర్మన్ కుర్చీ ప్రశాంత్ కే?

- అర్బన్ బ్యాంక్ 'ప్యానల్'లో కొలిక్కి
- కేంద్ర మంత్రిని కలిసిన కర్ర ప్యానల్
- కేంద్ర మంత్రి, స్టేట్ మంత్రి పొన్నం ఆశీస్సులు 'బండి'కే..

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 14: అర్బన్ బ్యాంక్ పాలకవర్గం రాజకీయాలకు అతీతంగా బ్యాంక్ అభివృద్ధికి కృషి చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపునిచ్చారు. కరీంనగర్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ పాలక మండలి ఎన్నికల్లో కర్ర రాజశేఖర్ ప్యానెల్ ఘన విజయానికి దోహదం చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను...బ్యాంకు చైర్మన్ కర్ర రాజశేఖర్ పాలకమండలి సభ్యులతో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశలోనూ కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అందించిన మార్గదర్శకత, సహకారం తమ విజయానికి బలమైన ఆధారమైందని అన్నారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా అర్బన్ బ్యాంక్ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. నా రాజకీయ జీవితం అర్బన్ బ్యాంకు డైరెక్టర్ గా మొదలైందని గుర్తుచేశారు. బ్యాంక్ అభివృద్ధికి సహకరిస్తామన్నారు. నూతనంగా ఎన్నికైన అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్ర రాజశేఖర్ మరియు పాలకవర్గ సభ్యులను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ గిరి ఎవరికీ అనే అంశం పై అరా తీశారు. బండి ప్రశాంత్ కే మొగ్గు ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు ఇదే విషయం పై కర్ర రాజశేఖర్ ప్యానల్ సమావేశం లోనూ చర్చకు వచ్చినట్లు తెలిసింది. బండి ప్రశాంత్ కే వైస్ చైర్మన్ గిరి ఫైనల్ అయినా.. ఇక ప్రకటనే మిగిలి ఉంది అని ప్రచారం జరుగుతుంది.

ఘనంగా ఎన్టీపీసీ 48వ వ్యవస్థాపక దినోత్సవం

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 14: రామగుండం ఎన్టీపీసీ 48 వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం ఉత్సాహంగా ఐక్యతతో ఘనంగా వేడుకలు జరుపుకుంది. రామగుండంలోని అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ లాన్స్‌లో ఉత్సాహభరిత మైన వేడుకలతో ఎన్టీపీసీ తన 48 వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపుకుంది. ఉద్యోగులు, డీఎంఎస్ సభ్యులు, సీఐఎస్ఎఫ్, యూనియన్లు, వివిధ సంఘాల ప్రతినిధులను ఒకచోట చేర్చింది. ముఖ్య అతిథి చందన్ కుమార్ సమంత, ఈడి, ఆర్ అండ్ టి ఎన్టీపీసీ జెండాను ఎగురవేశారు, తరువాత ఎన్టీపీసీ గీత్ వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఈడి, జీఎం (ఓ అండ్ ఎం) రామగుండం, తెలంగాణ, హెచ్ ఓ హెచ్ ఆర్, యూనియన్ ప్రతినిధులు, ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్, సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ ఐక్యత, క్రమశిక్షణ, సంస్థాగత నైపుణ్యాన్ని హైలైట్ చేస్తూ ప్రసంగించారు. సైబర్ సెక్యూరిటీ క్విజ్ విజేతలకు అవార్డులు ప్రదానం చేశారు. సామర్థ్య నిర్మాణానికి వారి కృషికి రాష్ట్రీయ కర్మయోగి జనసేవా లార్జ్ స్కేల్ శిక్షణా కార్యక్రమం లీడ్ అండ్ మాస్టర్ ట్రైనర్లను సత్కరించారు. ఈడి తన ప్రసంగంలో రామగుండం ఎన్టీపీసీ ఉద్యోగుల నిరంతర ప్రయత్నాలను ప్రశంసించారు. సంస్థ సేవ, క్రమశిక్షణ, శ్రేష్ఠత విలువలను కొనసాగించాలని ప్రతి ఒక్కరిని ప్రోత్సహించారు. సంక్షేమ కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు. దాని శ్రామిక శక్తి సమాజాలను శక్తివంతం చేయడంలో ఎన్టీపీసీ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమం కృతజ్ఞతా ప్రకటనతో ముగిసింది.

నిర్మల్ రూరల్ మండలంలో మూటపూర్ మరియు వెంగ్వా పేట్ గ్రామాలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను గౌరవ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమా బీమ్ రెడ్డి ప్రారంభించినారు.ఈ కార్యక్రమంలో డీసీఎస్ఓ నర్సయ్య, ఆత్మ చైర్మన్ రాంరెడ్డి గారు,మూటపూర్ పాక్స్ చైర్మన్ బోండ్ల గంగాధర్ గారు,మంజులపూర్ పాక్స్ చైర్మన్ ప్రసాద్ రెడ్డి గారు,మాజీ ఎంపీపీ సాదా సుదర్శన్ గారు మాజీ సర్పంచ్ రమేష్ రెడ్డి, మండల తహసీల్దార్ రైతులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

19న నిర్మల్ లో ఉమ్మీద్ పోర్టల్ పై అవగాహన

- 15న నిర్మల్ లో అత్యవసర సమావేశం

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 14: ఈనెల 19న బుధవారం జమాతే ఉలుమాయే హింద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జాతీయ వక్ఫ్ బోర్డ్ ఉమ్మీద్ పోర్టల్ పై రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చే ప్రత్యేక బృందం ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందని జిల్లా అధ్యక్షులు ముఫ్తి ఇల్యాజ్ హామీద్ ఖాస్మి తెలిపారు. ముఖ్యంగా మస్జీద్,దర్గా, ఖబస్తాన్, ఇతర ప్రార్థన ఆలయాలు,వక్ఫ్ సంబంధిత ఆస్తుల, భూములు ఆన్ లైన్ నమోదు విషయమై పరిపూర్ణమైన పద్ధతులలో అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ విషయమై ప్రత్యేకంగా ఈనెల 15న శనివారం బుధవార్ పేటలోని మస్జీద్ బుధవార్ పేట్ నిర్మల్ లో రాత్రి 8 గంటలకు ప్రత్యేక అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో స్థానిక ముస్లిం మత పెద్దలు,గురువులు, ఆయా ప్రార్థన ఆలయాల కమిటీల పదాధికారులు,సభ్యులు రాజకీయ,నాయకులు ప్రజాప్రతినిధులు,స్వచ్ఛంద సంస్థల బాధ్యులు, పట్టణ,గ్రామీణ ప్రాంతాల ఆన్ లైన్ కేంద్రాల నిర్వహకులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఇది అందరి మన వ్యక్తిగత బాధ్యతగా గుర్తించాలని కోరారు.

బీఆర్ఎస్, బీజేపీలకు జూబ్లీహిల్స్ ఫలితాలు చెంపపెట్టు

- ప్రజాపాలనే కావాలని ప్రజలు కోరుకుంటున్నారు
- సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 14: బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు జూబ్లీహిల్స్ ఫలితాలు చెంపపెట్టు లాగా ప్రజలు తీర్పును ఇచ్చారని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, పయ్యావుల ఎల్లం, సఖి ఆనంద్, ముద్దం లక్ష్మి, మార్క సతీష్ అన్నారు. సిద్దిపేటలో పాత బస్టాండ్ వద్ద జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలిచినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ అత్తు ఇమామ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 2 సంవత్సరాలు అయ్యిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఒక్కటే అని ప్రజలు ఇప్పటికైనా గుర్తించారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్యాదారి మధు, గయాసుద్దీన్, సందీప్ యాదవ్, నజ్జు, ఫయాజ్, సనా, రజిని, సంతోషి, సాయి ప్రతాప్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కేరళ హైస్కూల్లో స్వయం పరిపాలన దినోత్సవం

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 14: స్థానిక కేరళ హైస్కూల్లో శుక్రవారం ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకున్నారు. పాఠశాల చైర్మన్, ప్రిన్సిపాల్ బుర్ర రాజేందర్ మాట్లాడుతూ ఈరోజు మా పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగిందని, ఈ రోజు పండిట్ జవహర్లాల్ నెహ్రూ జన్మదినం సందర్భంగా చిల్డ్రన్స్ డే జరుపుకుంటామని, నెహ్రూకు పిల్లలు అంటే చాలా ఇష్టమని తెలియజేశారు. అదే విధంగా ఈ రోజు విద్యార్థిని, విద్యార్థులు పాఠశాలలో ఒక్కరోజు ఉపాధ్యాయులుగా తన విధులు నిర్వహించారాని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ, కరస్పాండెంట్ అల్లి శైలేందర్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

మెదక్‌లో ఘనంగా సహకార వారోత్సవాలు

- రైతుల కోసం నిరంతరం కృషి చేస్తాం
- మెదక్ సొసైటీ చైర్మన్ చిలుముల హనుమంత్ రెడ్డి

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 14: రైతుల కోసం నిరంతరం కృషి చేస్తామని మెదక్ సొసైటీ చైర్మన్ చిలుముల హనుమంత్ రెడ్డి అన్నారు. మెదక్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ ఆవరణలో బుధవారం సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సొసైటీ చైర్మన్ చిలుముల హనుమంత్ రెడ్డి సహకార జెండాను ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ...రైతులకు పంటలకు సంబంధం లేకుండా పంట రుణాలు అందిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి మండలంలోని అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం సొసైటీల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు. సభ్యులు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలను తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు రాములు,శంకర్, రాంరెడ్డి నారాయణరెడ్డి,సిబ్బంది సంతోష్ పెంటయ్య, శ్రీనాథ్, సాయిచరణ్, మహేందర్,కిష్టయ్య, గోపాల్, నాగరాజ్, రైతులు, పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- జీజీహెచ్ సిరిసిల్లపై సమీక్ష సమావేశం

ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల, నవంబర్ -14: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్)పై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ రోజూ ఓపీ, అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వివిధ వార్డుల్లో రూఫ్ లీకేజీకి మరమ్మత్తు పనులు, పోస్ట్ ఆపరేటివ్ వార్డు ఆధునీకరణ, పెయింటింగ్, ఏసీ, మరుగుదొడ్ల మరమ్మత్తు, మెష్ డోర్స్ ఏర్పాటు, మెటర్నిటీ వార్డులోని ఓపీ వద్ద పెయింటింగ్, మెష్ డోర్స్ ఏర్పాటు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇంకా ఔట్ పేషెంట్ మేల్ వార్డు మందులు తీసుకునే వద్ద షెడ్ ఏర్పాటు, అదనంగా నల్లా కనెక్షన్లు, ఆక్సిజన్ స్టోరేజ్ గదిలో పలు అభివృద్ధి పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. టీజీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో ఆయా అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఖాళీగా ఉన్న గైనకాలజిస్ట్ పోస్టులను భర్తీ చేయాలని సూచించారు. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. సభ్యత్వ నమోదు పెంచాలని, వైద్యులు, సిబ్బంది, ఆయా శాఖల అధికారులతో నమోదు చేయాలని సూచించారు. ఈ సమీక్షలో జీజీహెచ్ సూపరిండెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ చికోటి సంతోష్ కుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ రజిత, డీసీ హెచ్ ఎస్ డాక్టర్ పెంచలయ్య, వైద్యులు ఆవాస్ గౌరీ, ఎం లక్ష్మీనారాయణ, సుగుణ ప్రసాద్, ఐఎంఏ ప్రెసిడెంట్ శోభారాణి, ఆర్ ఎం ఓ డాక్టర్ కపిల్ సాయి, లయన్స్ క్లబ్ బాధ్యులు నాగుల సంతోష్, రెడ్ క్రాస్ బాధ్యులు వేణు, టీజీఎంఎస్ఐడీసీ ఈఈ విశ్వ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 14: హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ఘన విజయం సాధించిన సందర్భంగా హుస్నాబాద్ స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు పట్ల ఆనందం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఈ ఉప ఎన్నికలు నిరూపించాయని నాయకులు పేర్కొన్నారు. ప్రజాపాలనకు ఆమోదం తెలిపారని వారన్నారు.ఈ కార్యక్రమానికి సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బంక చందు,సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిత్తారి రవీందర్, హుస్నాబాద్ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మ, మాజీ కౌన్సిలర్ వల్లపు రాజు, పున్న సది, నాయకులు వెంకటరమణ, వెన్న రాజు, నాయకులు హాజరయ్యారు.

“

రాష్ట్ర ప్రజలకు శుభవార్త అందించడంలో సీఎం చంద్రబాబు ముందుంటారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ రాష్ట్రంలో 1జీడబ్ల్యూ ఏఐ డేటా సెంటర్ నెలకొల్పబోతోందని చెప్పేందుకు ఆనందిస్తున్నా. ఇది ఫుల్లీ మాడ్యూలర్, వరల్డ్స్ మోస్ట్ అడ్వాన్స్‌డ జీపీయూ, టీపీయూ, ఏఐ ప్రాసెసర్స్‌ను హోస్ట్ చేసేలా ఫ్యూచర్ రెడీగా ఉంటుంది. అలాగే రిలయన్స్ 6జీడబ్ల్యూపీ సోలార్ ప్రాజెక్టునూ రాష్ట్రంలో అభివృద్ధి చేస్తుంది.

-ఏపీ మంత్రి నారా లోకేశ్

ప్రాంతీయం

గంజాయి ముఠా గుట్టు రట్టు

- ముగ్గురు వ్యక్తుల అరెస్ట్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 14: కరీంనగర్ రూరల్ పరిధిలో గుంటూరుపల్లి , బొమ్మకల్ వద్ద వెహికల్ చెకింగ్ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు దుర్శేడ్ గ్రామానికి చెందిన నేరెళ్ల చరణ్, గోపాల్ పూర్ గ్రామానికి చెందిన బెజ్జంకి లోకేష్ మరో మైనర్ బాలుడు కలిసి గంజాయితో తమ యమహా మోటార్ సైకిల్ పై వస్తూ పోలీస్ వారిని చూసి పారిపోయే ప్రయత్నం చేయగా వారిని పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న కవర్లో గంజాయి లభించింది. చదువులు మధ్యలోనే మానివేసి జల్సాలకు అలవాటుపడి, అదే క్రమములో వారి అవసరాలను తీర్చుకొనుటకు గంజాయి ని మరో వ్యక్తి నుండి కొనుకొని వచ్చి కరీంనగర్ లోని చుట్టూ ప్రక్కల ప్రాంతాలలో అమ్ముతూ గత కొంత లాభాలు పొందుతున్నారు. ఇదే క్రమములో ముగ్గురు వ్యక్తులు మరో వ్యక్తి వద్ద గంజాయిని కొనుగోలు చేసి కొంత అధిక లాభాలకు అమ్మినారు. మరికొంత అమ్మటకు వెళుతుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుండి గంజాయి, ఒక యమహా మోటార్ సైకిల్ , కొంత నగదు సెల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భముగా కరీంనగర్ రూరల్ ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్ ఏ. నిరంజన్ రెడ్డి, మాట్లాడుతూ యువత చెడు అలవాటులకు బానిసలూ కావద్దని , జీవితాలను నష్టపరుచుకోవద్దని తెలుపారు. ఎవరైనా గంజాయి అమ్ముతూ పట్టుబడితే వారిని జైలుకు పంపడం తో పాటు, వారిపై రౌడీ షీట్ ఓపెన్ చేసి, ఇంకా మారకపోతే వారిపై పిడి ఆక్ట్ కూడా పెట్టుతామని ఇన్స్పెక్టర్ హెచ్చరించారు. గంజాయి మూటను పట్టుకున్న ఎస్ఐ లక్ష్మారెడ్డి ని, కానిస్టేబుళ్లను, మహిళా సిబ్బందిని, కరీంనగర్ రూరల్ ఎసిపి విజయకుమార్ అభినందించారు.

జూబ్లీహిల్స్ గడ్డపై ఎగిరిన కాంగ్రెస్ జెండా

- కార్యకర్తల్లో జోష్, జిల్లా వ్యాప్తంగా సంబరాలు
- మంత్రి పొన్నం క్యాంప్ వద్ద నృత్యాలు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 14: జూబ్లీహిల్స్ బై పోల్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ నేడు కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు మిన్నంటినాయి. హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి, జిల్లాకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్ గారి నివాసం వద్ద డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున టపాసులు కాల్చి మిఠాయిలు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు, ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో..

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి, ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ వద్ద జూబ్లీహిల్స్ ఎన్నిక ఫలితాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించడం పట్ల డప్పు చప్పులతో నృత్యాలు చేస్తూ వ్యాపారులకు ప్రయాణికులకు మిఠాయిలు పంచుతూ వేడుకలు నిర్వహించారు. కాగా, యూత్ కాంగ్రెస్ నాయకులు కొండ్ర హరీష్ ఆధ్వర్యంలో కోర్ట్ చౌరస్తా వద్ద సంబరాలు నిర్వహించారు.

సోన్ మండలంలో ఘనంగా నెహ్రూ జయంతి వేడుకలు

ప్రతిపక్షం, సోన్, నవంబర్ 14: సోన్ మండలంలోని పాక్ పట్ల గ్రామంలో లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టి. పిసిసి కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్ ముఖ్య అతిధి గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్క జిల్లాలో ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి ఆయన చేసిన కృషి వెలకట్టలేనిదనీ , నవ భారత నిర్మాణానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో సోన్ మాజీ నీటి సంఘం అధ్యక్షుడు మొయినుద్దీన్, నాయకులు ఎల్చల్ గంగారెడ్డి, నర్సారెడ్డి ,పందరి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ కార్యాలయం వద్ద జోష్‌తో సంబురాలు

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 14 : జూబ్లీ హిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ఘన విజయం సాధించడంతో, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయం వద్ద నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమా భీమ్ రెడ్డి,పట్టణ అధ్యక్షుడు చిన్ను నాయకులు, కార్యకర్తలు భారీ సంబురాలు జరుపుకున్నారు. కార్యాలయం పరిసరాలు టపాసుల ధ్వనులతో, కాంగ్రెస్ పార్టీ నినాదాలతో సందడి చేశాయి. నాయకులు పరస్పరంమిఠాయి లు తినిపించుకుని శుభాకాంక్షలు తెలు పుకున్నారు. పటాకులు పేల్చి మిఠాయిలు పంచుకుని ఆనందాన్ని వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూఈ విజయంతో ప్రజలు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంపై నమ్మకం వ్యక్తం చేశారని, నగరంలో కూడా కాంగ్రెస్ పార్టీ మరింత బలపడిందని తెలిపారు.

ఘనంగా జవహర్ లాల్ నెహ్రూ జయంతి

భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ (చాచా నెహ్రూ) జయంతిని పురస్కరించుకుని, శుక్రవారం డీసీసీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమా భీమ్ రెడ్డి ,పట్టణ అధ్యక్షుడు చిన్ను,జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని నెహ్రూ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భీమ్ రెడ్డి మాట్లాడుతూ దేశ నిర్మాణం, ప్రజాస్వామ్యం బలపరిచే దిశగా, శాంతి-సౌభ్రాతృత్వాలపై నెహ్రూ చూపిన దారిని మనం ఎల్లప్పుడూ స్మరించుకోవాలని, ఆయన సిద్ధాంతాలు నేటికీ యువతకు ప్రేరణగా నిలుస్తున్నాయని ,నెహ్రూ గారి సేవలను స్మరించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల లక్ష్యం పూర్తి చేయాలి

- అధికారులకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి ఆదేశం

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్ నవంబర్ 14: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని మానకొండూర్ ఎమ్మెల్య డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఎల్ఎండీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై వివిధ శాఖల అధికారులపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మానకొండూర్ నియోజకవర్గం పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల ప్రగతిని మండలాల వారీగా సమీక్షించారు. పనుల్లో జరుగుతున్న జాప్యంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జరిగేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. గ్రేడింగ్ పూర్తయిన ఇళ్లను వెంటనే ప్రారంభించి లబ్ధిదారులకు అందించాలని అధికారులను ఆదేశించారు. పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, ఇళ్ల నిర్మాణాల దశల ప్రకారం లబ్ధిదారుల ఖాతాల్లో బిల్లులు జమ చేయాలన్నారు. సాంకేతిక సమస్యలేవైనా ఉంటే వెంటనే వాటిని పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు.

పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మి వరం

నిరుపేదలను ఆదుకునేందుకే కళ్యాణలక్ష్మి,షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తున్నదని మానకొండూర్ నే ఉద్దేశంతోనే కళ్యాణలక్ష్మి కింద ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పారు. శుక్రవారం మానకొండూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 70 మందికి కళ్యాణలక్ష్మి,షాదీముబారక్, 35 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు.

50 పడకల ఆస్పత్రి నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నూతనంగా నిర్మించనున్న 50 పడకల ఆస్పత్రి నిర్మాణం పనులకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం శంకుస్థాపన చేశారు. శిలాఫలకం ఆవిష్కరించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోగల ఆరు పడకల స్థాయిని 50 పడకలకు పెంచేందుకు చేసిన కృషి ఫలితంగానే 17.50 కోట్ల మంజూరైనట్టు చెప్పారు. నిర్దేశిత గడువులోగా ఆస్పత్రిని నిర్మించుకోగలిగితే ప్రజలు సత్వరమే మెరుగైన వైద్య సేవలు పొందగలుగుతారని చెప్పారు.

ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంపై పార్టీశ్రేణుల సంబురాలు

జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఘన విజయం సాధించడంపై మానకొండూర్ నియోజవకవర్గంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. ఎల్ఎండీ కాలనీలో ప్రజాభవన్ వద్ద ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి సంబురాలు జరుపురున్నారు. స్వీట్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కేరింతలు కొడుతూ నృత్యాలు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి కూడా స్టెప్పులు వేసి పార్టీ శ్రేణులను మరింత ఉత్సాహపర్చారు. అల్గునూర్ చౌరస్తాలో, మానకొండూర్లో మానకొండూరు మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి ఆధ్వర్యంలో కార్యకర్తలు సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు బాణసంచా పేల్చారు. ఈ కార్యక్రమంలో , వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ ఆర్.తిరుమల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, బండి మల్లేశం, ఆర్. తిరుపతి, తాళ్లపల్లి నరేశ్, మడుపు ప్రేమ్ కుమార్, వాల అంజిత్ రావు, బోళ్ల మురళీధర్, కనకం కుమార్, కొండ్ర సురేష్, ఇర్ఫాన్, రాకేష్, సహదేవ్, దూలం దేవేంద్ర, రొంటాల లక్ష్మారెడ్డి, గొల్లెన కొమురయ్య, సాయిరి దేవయ్య, శ్రీనివాస్ గౌడ్, చెలికాని సదయ్య, మీస సత్యనారాయణ, వరహాల చారి, బుర్ర శ్రీకాంత్, ఎన్.బాపురావు, గుజ్జె ప్రభాకర్, మహేందర్, బుర్ర చంద్రాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జవహర్ లాల్ నెహ్రూ జయంతి

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 14: కాంగ్రెస్ పార్టీ మక్తల్ టౌన్ అధ్యక్షులు బి.రవికుమార్ ఆధ్వర్యంలో నేడు భారతదేశ మొదటి ప్రధానమంత్రి స్వర్గీయ జవహర్ లాల్ నెహ్రూ జయంతి కార్యక్రమాన్ని మక్తల్ నెహ్రూ గంజ్ ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కట్ట సురేష్ కుమార్ గుప్తా, సాయి ఫైనాన్స్ శీను, గొల్లపల్లి నారాయణ, ఏ. రవికుమార్, జి.రవికుమార్, మందుల నరేందర్, బోయ వెంకటేష్, కట్ట వెంకటేష్ వాకిటి శ్యామ్, శాలం, ఫయాజ్, రంజిత్ రెడ్డి ,విష్ణువర్ధన్ రెడ్డి, అసముద్దీన్, శంషొద్దీన్ , ఓబులేష్, బ్యాగరి సురేష్, అఫ్రోజ్, వెంకటేష్, రావుఫ్, బోయ నరసింహ ,బాల్ రాజ్ , నర్సింలు, కృష్ణ , మొగులప్ప నాదేర్ తదితరులు పాల్గొన్నారు.

బాల సదనంలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

- హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి,
- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్,నవంబర్ 14 : నిర్మల్ గ్రామీణ మండలం కొండాపూర్ లోని బాల సదనంలో బాలల దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శ్రీవాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా ఉన్నతాధికారులు చిన్నారులతో ముఖాముఖి మాట్లాడుతూ, వారి అభిరుచులు, చదువు, అవసరాలు తెలుసుకున్నారు. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత నిర్మల్ బాల సదనమే పిల్లలకు ప్రత్యేకంగా ఆరోగ్య శ్రీ హెల్త్ కార్డులు అందించిన సంస్థగా నిలిచిందని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ఈ కార్డులతో పిల్లలు పూర్తిగా ఉచిత వైద్య సేవలను పొందగలరని చెప్పారు. అలాగే ప్రభుత్వం జారీ చేసే ఇతర గుర్తింపు పత్రాలను కూడా ప్రత్యేకంగా పిల్లల కోసం సిద్ధం చేసినట్లు వివరించారు. ఇటీవల విద్యార్థులను హైదరాబాద్ సాలార్జంగ్ మ్యూజియంకి వైజ్ఞానిక యాత్రగా తీసుకెళ్లిన విషయాన్ని గుర్తుచేసిన కలెక్టర్, పిల్లలంతా ప్రతిరోజూ పాఠశాలకు వెళుతూ చక్కగా చదువుకోవాలని సూచించారు. చిన్నారులకు అన్ని వేళలా అండగా ఉంటామని, ప్రతిరోజు ఆటలు ఆడి శారీరకంగా చురుకుగా ఉండాలని సూచించారు. బాల సదనం సిబ్బంది పిల్లలను తమ సొంత బిడ్డల్లా చూడాలని, చిన్న సమస్య వచ్చినా వెంటనే స్పందించాలని ఆదేశించారు.

పిల్లలు చదువుతోపాటు ఆటలు కూడా ఆడాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శ్రీవాణి

పిల్లలు క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్లి చదువుతోపాటు ప్రతిరోజు ఆటల్లో పాల్గొనాలని ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి సూచించారు. చిన్నారులతో మాట్లాడిన ఆమె, వారి ఇష్టాలు తెలుసుకుని, బాలల దినోత్సవం ప్రాధాన్యాన్ని వివరించారు. పిల్లలు నిరాశ చెందకుండా, అధికారులు ఎల్లప్పుడూ వారి కోసం ఉండాలని ప్రోత్సహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి, పిల్లలకు బట్టలు, దుప్పట్లు, ఫలాలు కలెక్టర్, జిల్లా జడ్జి, అదనపు కలెక్టర్లు అందజేశారు. అలాగే బాల సదనంలోని డార్మెటరీ, వంటగది, ఇతర పరిసరాలను పరిశీలించిన ఉన్నతాధికారులు, పిల్లలకు ప్రతిరోజూ మంచి, పోషకాహార కలిగిన భోజనం అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డిఎల్ఎసిఎస్ సెక్రటరీ రాధిక, డీఈవో భోజన్న, ఎంపీడీవో గజానన్, ఐసిడిఎస్ అధికారి మురళి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలి

- ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ
- పాలిటెక్నిక్ కళాశాలలో నూతన హాస్టల్ భవనాలకు ప్రారంభోత్సవాలు
- పాల్గొన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్



ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 14 : విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దేలా నాణ్యమైన విద్యను బోధించాలని రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎస్సీ ఎస్టీ మైనారిటీ సంక్షేమ శాఖల సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నూతనంగా నిర్మించిన హాస్టల్ భవనాలను శుక్రవారం ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు డాక్టర్ భూపతి రెడ్డి, ధన్పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డిలతో కలిసి ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ లాంఛనంగా ప్రారంభోత్సవాలు చేశారు. వసతి గృహ నిర్మాణాల కోసం పూర్వ విద్యార్థి ప్రతాప్ రెడ్డి రూ. 1.06 కోట్ల విరాళం అందించగా, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ రూ. 2.86 కోట్ల నిధులను విరాళంగా అందజేసింది. ఈ నిధుల తోడ్పాటుతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో బాల, బాలికలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం వేర్వేరుగా నిర్మించిన నూతన వసతి గృహాలను ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి సహచర ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా పి.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో గత పదేళ్లలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన సాంకేతిక విద్యను బలోపేతం చేయాలనే కృత నిశ్చయంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విస్తృత చర్యలు చేపడుతున్నారని అన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పాలిటెక్నిక్ కళాశాలల్లో మెరుగైన సాంకేతిక విద్యను బోధిస్తూ, విద్యార్థిని, విద్యార్థులకు ఉజ్వల భవితవ్యానికి బాటలు వేయాలని అధ్యాపకులకు సూచించారు. ఈ మేరకు అవసరమైన అన్ని మౌలిక, వసతి సదుపాయాలను కల్పించేందుకు తమవంతు కృషి చేస్తామని అన్నారు. దేశ భవిష్యత్తుకు పునాదిగా నిలువాల్సిన విద్యార్థులు సైతం క్రమశిక్షణతో మెలుగుతూ సాంకేతిక విద్యతో కూడిన అంశాలను చక్కగా ఆకళింపు చేసుకోవాలని, ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖల సలహాదారు మొహమ్మద్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ, నేటి సామాజిక అవసరాలకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక విద్యతో కూడిన కోర్సులను విద్యార్థులకు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశ్యంతో రాష్ట్రంలో నూతనంగా 66 అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసిందన్నారు. నిర్దేశిత కోర్సులలో శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు సత్వరమే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా చర్యలు తీసుకుందని, టాటా కంపెనీతో ఒప్పందం సైతం కుదుర్చుకుందని తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ భారత దేశ ప్రగతికి ప్రణాళికాబద్ధంగా కృషి చేసిన దార్శనికుడు, దేశ తొలి ప్రధాని పండిత్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి రోజున పాలిటెక్నిక్ కళాశాలలో హాస్టళ్ళను ప్రారంభించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కాగా, వసతి గృహాల నిర్మాణాల కోసం విరాళం అందించిన పూర్వ విద్యార్థి ప్రతాప్ రెడ్డిని, భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ సహాయ జనరల్ మేనేజర్ సెల్వంలను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ భారతి, రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి కార్యదర్శి ఏ పుల్లయ్య, మహిళా పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపల్ అనురాధ, పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు పి బాల నరసింహులు, ప్రధాన కార్యదర్శి తోట రాజశేఖర్, పూర్వ విద్యార్థులు ఎం విగ్నేష్, ఆర్ మోహన్ కుమార్, వినోద్, ఎం గణేష్, శంకర్, బాబా, శ్రీనివాస్, సత్యనారాయణ, ప్రభాకర్, ఆనంద్, కళాశాల లెక్చరర్స్ కే నాగరాజ్, టి రవీందర్, భానుచందర్, గోపాల్ నాయక్, ప్రవీణ్, ప్రదీప్ రెడ్డి, ఎన్సిసి ఆఫీసర్ ఆర్ నరేష్, ఎన్సిసి, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రజలు కాంగ్రెస్‌కు మంగళం పాడేశారని బిహార్ ఎన్నికల ఫలితాలు తేల్చాయి. ఓటరు జాబితా పరిశీలనను వ్యతిరేకిస్తున్న రాహుల్ వాదనను ప్రజలు తోసిపుచ్చారు. ఎన్నికల సంఘానికి ఆయన క్షమాపణలు చెప్పాలి. జూబ్లీహిల్స్‌లో తామెన్నడూ గెలవలేదు. ఉపఎన్నికలో కాంగ్రెస్ డబ్బులతో గెలిచింది. ఈవీఎంలపై ఆరోపణలు చేస్తున్న రాహుల్ 'జూబ్లీ' గెలుపుపై సమాధానం చెప్పాలి.

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

దేశంలో ఉనికిని కోల్పోతున్న కాంగ్రెస్

- ప్రాంతీయ పార్టీలపై ఆధారపడడమే కారణం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, పాట్నా, నవంబర్ 14 : దేశంలో కాంగ్రెస్ పార్టీ క్రమంగా కనుమరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాజధాని ఢిల్లీస్థాయిలోనూ, క్షేత్ర స్థాయిలోనూ ఆ పార్టీ క్రమంగా పట్టు కోల్పోతుంది. ప్రతి రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలపైన ఆధారపడి ఉండటంతో ఈ దుస్థితి పట్టింది. కర్ణాటక, తెలంగాణలో జాతీయ పార్టీగానే కాంగ్రెస్ పోటీ చేసి అధికారంలోకి వచ్చింది. కానీ, మిగిలిన చోట్ల ప్రాంతీయ పార్టీలు ఇచ్చే సీట్లపైనే ఆధారపడి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. 2004కు ముందు పరిస్థితులు ఏంటి? 2014 తర్వాత ఏంటి? అన్నది కాంగ్రెస్ పార్టీ పరిస్థితిని చూస్తేనే అర్థమవుతుంది. పదేండ్లు దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ దేశంలోని అన్ని రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ క్షేత్ర స్థాయిలో బలాన్ని పెంచుకోలేకపోయింది. నెహ్రూ కాలం నుంచి ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ హయాంలోనూ ఉత్తరప్రదేశ్ లో కాంగ్రెస్‌కు మంచి పట్టు ఉండేది. పటిష్టమైన ఓటు బ్యాంకు ఉండేది. కానీ, రాను రాను రాహుల్ గాంధీ జమానాకు వచ్చే సరికి ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బిహార్, ఢిల్లీ, మహారాష్ట్ర, ఒడిశా వంటి రాష్ట్రాలలో తమ పట్టు కోల్పోయింది. ఒకప్పుడు ఈ ఈ రాష్ట్రాలలో కాంగ్రెస్ పిడికిలి బిగించి గెలిచేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. బీజేపీని తట్టుకోవాలంటే ప్రాంతీయ పార్టీలతో కలసి వెళ్లాలనుకోవడమే ఆ పార్టీ తనకు తానే ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి వచ్చింది. రాజస్థాన్, మధ్య ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలోనే మాత్రమే ఒంటరిగా పోటీ చేస్తున్న కాంగ్రెస్ మిగిలిన రాష్ట్రాలలో మాత్రం ప్రాంతీయ పార్టీల మద్దతు కోసం అర్రులు చాస్తోంది. బిహార్ లోనూ కాంగ్రెస్ పార్టీ ఆర్జేడీ బలపడటానికి పరోక్షంగా కారణమైంది.

విశ్వ వీక్షణం

బిహార్ సీఎంగా నితీశ్ తప్పకోనున్నారా!

- కలకలం సృష్టించిన జేడీయూ ట్వీట్ డిలిట్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, పాట్నా, నవంబర్ 14 : దాదాపు రెండు దశాబ్దాలుగా బిహార్ సీఎం పీఠంపై కూర్చున్న నితీశ్ కుమార్ ఇక ఆ స్థానం నుంచి తప్పుకోనున్నారా! బీజేపీ, జేడీయూతో కూడిన ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించిన నేపథ్యంలో జేడీయూ పార్టీ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్, వెంటనే డిలీట్ చేయడం ఇప్పుడు బిహార్ రాజకీయాలలో తీవ్రమైన చర్చనీయాంశంగా మారింది. బిహార్‌లో ఎన్డీయే కూటమి ప్రభంజనం సృష్టించింది. 200 స్థానాలకు పైగా ఆధిక్యంలో దూసుకెళ్లింది. ఈ క్రమంలోనే ఇప్పుడు బిహార్ సీఎం ఎవరు అనే ప్రశ్న తలెత్తుతోంది. అయితే, అంతా మళ్లీ నితీశ్ కుమార్‌కే ముఖ్యమంత్రి పదవి అని పేర్కొంటున్నప్పటికీ, ఎన్డీయే కూటమి మాత్రం ఎన్నికల ప్రచారంలో ఎక్కడా తమ సీఎం అభ్యర్థి ఎవరు అనేది వెల్లడించలేదు. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు సీఎం కుర్చీ ఎవరికి ఇస్తారనేది తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మొత్తానికి ఎన్నికలలో చెరో 101 స్థానాలు తీసుకుని పోటీ చేసి ఘన విజయం సాధించిన ఎన్డీయే కూటమి, బిహార్ ముఖ్యమంత్రి కుర్చీపై ఎవరు కూర్చోబెడుతుందని ఆ రాష్ట్ర ప్రజలకే కాకుండా, మొత్తం దేశ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే 'నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి ఇప్పుడు ఎప్పుడూ' అంటూ జేడీయూ ఎక్స్‌లో ఒక పోస్ట్ పెట్టింది. దానికి నితీశ్ ఫొటో జత చేసింది. అయితే, కొన్ని నిమిషాల వ్యవధిలోనే ఆ ట్వీట్‌ను డిలీట్ చేసింది. ఇదే ఇప్పుడు సరికొత్తకు చర్చకు దారితీసింది.

చింతపండుతో రుచి.. ఆరోగ్యం

భారతీయ వంటకాలలో ప్రధానంగా ఉపయోగించేది చింతపండు.. రుచికరమైనది మాత్రమే కాదు, ఆరోగ్యానికి చాలా ప్రయోజనకారి. చింతపండులో అనేక పోషకాలు ఉన్నాయి. ఇవి మన శరీరాన్ని లోపలి నుండి ఆరోగ్యంగా, బలంగా చేస్తాయి. చింతపండు వల్ల మనకు కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం. చింతపండులో కూడా పోషకాలు పుష్కలంగా దాగి ఉన్నాయి. అవి మన ఆరోగ్య సమతుల్యతను కాపాడతాయి. పుల్లనితియ్యని రుచిని కలిగిన చింతపండుతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొంద వచ్చు. ఇందులో విటమిన్లు ఎ, సి, ఇ, కె, బి 6, మెగ్నీషియం, కాల్షియం మరియు ప్రోటీన్ వంటి అనేక ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి.

రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడం, జీర్ణక్రియను మెరుగుపరచడం, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడం... శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో ఈ పోషకాలు పెద్ద పాత్ర పోషిస్తాయనడంలో సందేహం లేదు. చింతపండు అనేక రకాల వంటలలో రుచిని పెంచడానికి ఉపయోగిస్తారు, అయితే ఇది ఉన్నప్పటికీ దాని ప్రయోజనాల గురించి తెలియని వారు చాలా మంది ఉన్నారు.



జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది

చింతపండులో ఉన్న టార్టెరిక్ ఆమ్లం జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఇది ఆహారాన్ని జీర్ణించుకోవడం మరియు మలబద్ధకం, ఆసిడిటీ వంటి సమస్యలను తగ్గిస్తుంది. అదనంగా, జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో చింతపండులో ఉన్న ఫైబర్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.

గుండె ఆరోగ్యానికి..

చింతపండు అధిక పొటాషియం కంటెంట్ కలిగి ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. అదనంగా, దానిలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. చింతపండులో ఉన్న ఫ్లేవనాయిడ్లు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి, ఇది గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది.



రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది

చింతపండు విటమిన్ సి అధికంగా ఉంటుంది, ఇది రోగ నిరోధక శక్తిని బలంగా చేస్తుంది. ఇది శరీర సంక్రమణతో పోరాడటానికి సహాయపడుతుంది మరియు వ్యాధుల నుండి కూడా రక్షిస్తుంది.

బరువు తగ్గడానికి సాయం చేస్తుంది

చింతపండు అధిక మొత్తంలో ఫైబర్ కలిగి ఉంటుంది, ఇది కడుపుని ఎక్కువసేపు పూర్తి చేస్తుంది మరియు ఆకలిని తగ్గిస్తుంది. అదనంగా, చింతపండు బరువు తగ్గడానికి సహాయపడే తక్కువ కేలరీల మొత్తాలను కలిగి ఉంటుంది.

చర్మానికి ప్రయోజనకరంగా ఉంటుంది

చింతపండులో యాంటీఆక్సిడెంట్లు మరియు విటమిన్ సి ఉనికి చర్మాన్ని ఆరోగ్యంగా మరియు మెరిసేలా చేయడానికి సహాయపడుతుంది. మొటిమలు, మరకలు మరియు ఇతర చర్మ సమస్యలను తొలగించడంలో ఇది ప్రభావవంతంగా ఉంటుంది.

చింతపండు అనేది ఒక పండు, ఇది రుచికరమైనది మాత్రమే కాదు, ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. మీ ఆహారంలో చేర్చడం ద్వారా, మీరు ఆరోగ్యానికి సంబంధించిన అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

జాగ్రత్తలు కూడా ముఖ్యం

- పెద్ద మొత్తంలో చింతకాయలు తినడం వల్ల దంతాల ఎనామెల్‌కు నష్టం జరుగుతుంది
- మీకు ఆసిడిటీ లాంటి సమస్యలు ఉంటే, చింతపండు పరిమిత పరిమాణంలో తీసుకోవాలి
- గర్భిణీ స్త్రీలు డాక్టర్ సలహా తర్వాత మాత్రమే చింతపండు తినాలి



'జైషే' ఉగ్ర కుట్రను భగ్నం చేసిన తెలుగు ఐపీఎస్

- ఎర్రకోట పేలుడుకు అక్కడి నుంచే ఆధారాలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, శ్రీనగర్, నవంబర్ 14: ఒక చిన్న పోస్టర్ మీద రాసిన హెచ్చరిక ఒక పెద్ద ఉగ్రవాద కుట్రని బహిర్గతం చేసింది. జమ్మూకశ్మీర్ పోలీసు విభాగంలో సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ గా పనిచేస్తున్న తెలుగు ఐపీఎస్ అధికారి డా. జీవీ సందీప్ చక్రవర్తి నాయకత్వంలో జైషే మహమ్మద్ ఉగ్రవాద మాడ్యూల్‌ను ధ్వంసం చేసిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కర్నూల్‌కు చెందిన ఈ తెలుగు ఐపీఎస్ అధికారి తొలుత వైద్యుడు. ఆ తర్వాత పోలీసు అధికారిగా మారిన ధీరుడు. ఆయన అప్రమత్తత, వేగంగా స్పందించే గుణం భారీ ఉగ్ర కుట్రను బయట పెట్టింది. అక్టోబర్ 19న శ్రీనగర్ నౌగామ్ బున్పోరా ప్రాంతంలో జైషే మహమ్మద్ పేరిట పోస్టర్లు వెలిసాయి. ఈ పోస్టర్లలో భద్రతా దళాలు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని రాసి ఉంది. 2019లో ఆర్టికల్ 370 రద్దు చేసినప్పటి నుంచి అలాంటి పోస్టర్లు చాలా అరుదుగా మాత్రమే కనిపించేవి. ఈ నేపథ్యంలో ఎస్పీ చక్రవర్తి దీన్ని తేలికగా తీసుకోలేదు. 'కమాండర్ హంజాలా భాయ్' అనే జైషే ఉగ్రవాది సంతకంతో ఉన్న ఈ పోస్టర్లు ఒక పెద్ద కుట్రకి సూచనగా ఆయన భావించారు. వెంటనే, కేసు నమోదు చేసి, ముగ్గురు అనుమానితులను అరెస్ట్ చేశారు. దీంతో మల్టీస్టేట్ నెట్‌వర్క్ బహిర్గతమైంది. దీని ఆధారంగా డాక్టర్ ముజమ్మిల్ అహ్మద్ గనై, డాక్టర్ ఆదీల్ అహ్మద్ రతర్, డాక్టర్ షాహీన్ సయీద్‌లను అరెస్ట్ చేశారు. మౌల్వీ ఇర్ఫాన్ ఇంటిపై జరిపిన దాడిలో టెలిగ్రాం ఛానల్ ద్వారా పాకిస్తాన్‌లోని జైష్ ఉగ్రవాది ఉమర్ బిన్ ఖత్తాబ్‌తో సంబంధాలను గుర్తించారు. తొమ్మిది మంది అరెస్టుతో పాటు, 2,900 కేజీలకు పైగా పేలుడు పదార్థాలు, బాంబ్ తయారీ సామగ్రి, రెండు ఏకే సిరీస్ రైఫిల్స్ పట్టుకున్నారు. ఇది ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడుకు, దీని వెనుక ఉన్న సీరియల్ బ్లాస్ట్ ప్లాన్‌కు కీలక ఆధారంగా మారింది.

భారత్ లో ఉగ్రదాడులకు పాక్ ఊతం

- అవాకులు చవాకులు పేలుతున్న పాక్ పాలకులు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, శ్రీనగర్, నవంబర్ 14: భారత్ అంటే చాలు కండ్లలో నిప్పులు పోసుకుంటుంది పాకిస్తాన్. మన దేశ ప్రగతిని, సాధిస్తున్న ఎదుగుదలను ఏమాత్రం ఓర్వదు. మనతో నిత్యం కవ్వింపులకు పాల్పడుతూనే ఉంటుంది. సరిహద్దులలో రక్తపుటేరులు పారిస్తూనే ఉంటుంది. అభివృద్ధిలో, అక్షరాస్యతలో, మిగతా విషయాలలో మన దేశంతో పోల్చి చూస్తే ఎక్కడో ఉండే పాకిస్తాన్ ఉగ్రవాదం విషయంలో మాత్రం మొదటి స్థానంలో ఉంటుంది.

ఉగ్రవాద సంస్థలను పెంచి పోషిస్తూ పాకిస్తాన్ ప్రజల టాక్స్‌లను సైతం ఉగ్రవాదుల పోషణ కోసం వెచ్చిస్తూ ఉంటుంది, మన దేశంలో గతంలో జరిగిన, ప్రస్తుతం చోటు చేసుకున్న బాంబు పేలుళ్ల వెనక కచ్చితంగా పాకిస్తాన్ హస్తం ఉంటుంది. మన దేశాన్ని నాశనం చేయడానికి, అన్నివిధాలుగా ఇబ్బంది పెట్టడానికి ఇతర శక్తులతో ఖచ్చితంగా చేయి కలుపుతుంది. తను బాగుపడకపోయినా పర్వాలేదు కానీ, భారత్ పెరుగుతుంటే మాత్రం తట్టుకోలేదు. పైగా అత్యంత క్రూర విధానాలకు పాల్పడుతూ ఉంటుంది. పాకిస్తాన్ మనతో విడిపోయిన నాటి నుంచి ఇప్పటివరకు ఒక ఉగ్రవాదం మినహా మిగతా ఏ విషయంలోనూ అంతగా అభివృద్ధి సాధించలేదు. ప్రజల బాగోగులు ఏమాత్రం పట్టించుకోని అక్కడి పాలకులు. ఉగ్రవాద కార్యకలాపాలలో మాత్రం ఉత్సాహంగా ఉంటారు. ఢిల్లీ పేలుడుకు సంబంధించి పాకిస్తాన్ మంత్రి ఖవాజా ఆసిఫ్ నెత్తి మాసిన వ్యాఖ్యలు చేశారు. 'నిన్నటి వరకు గ్యాస్ సిలిండర్ పేలుడు. ఇప్పుడేమో విదేశాల కుట్ర దాగి ఉందని భారత్ ఆరోపిస్తోందని' పేర్కొన్నారు. తమ వరకు వస్తే పరిణామాలు వేరే విధంగా ఉంటాయని హెచ్చరించారు.

బ్రిటన్‌లో వలస వ్యతిరేక ర్యాలీలు

- లండన్ ప్రధాన వీధులలో భారీ ప్రదర్శనలు

లండన్ (యూకే), నవంబర్ 14: 'మా దేశంలో మేమే ఉండాలి. మా దేశం మాకే సొంతం కావాలి' అన్న నినాదంతో నిన్నటి వరకు అమెరికాలో జరిగిన నిరసనలు ఇప్పుడు బ్రిటన్ లోనూ కొనసాగుతున్నాయి. రెండు నెలల నుంచి వలసవాదుల వ్యతిరేకంగా నిరసనలు హోరెత్తుతున్నాయి. దేశంలోకి కొందరు అక్రమంగా వలస వచ్చారని, వారిని వెంటనే వెనక్కి పంపాలని లండన్ ప్రధాన వీధులలో భారీ ప్రదర్శన చేపడుతున్నారు. యాంటీ ఇమిగ్రేషన్ కార్యకర్త, అతివాద నాయకుడు టామీ రాబిన్సన్ పిలుపు మేరకు 'యునైటెడ్ ద కింగ్డమ్ ర్యాలీ' పేరుతో చేపట్టిన ప్రదర్శన ఉద్రిక్తంగా మారిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కూడా ర్యాలీలు కొనసాగుతుండడం గమనార్హం. కొన్నేండ్లుగా ఇతర దేశాల నుంచి బ్రిటన్ లోకి వలసవాదులు వస్తున్నారని ఆరోపిస్తున్నారు. విదేశీయులు ఎక్కువ కావడంతో దేశంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ ఒత్తిడులు పెరుగుతున్నాయి. 2025 అక్టోబర్ 29న బ్రిటన్, వియత్నాం మధ్య ఒక ఒప్పందం జరిగింది. వియత్నాం నగరంలోని వలసకారులను బ్రిటన్ తీసుకోవడమే ఈ ఒప్పందం. ఇదే ఆగస్టులో ఫ్రాన్స్ తో మరో ఒప్పందం జరిగింది. దేశంలో వలసలు పెరిగిపోవడంతో ఇక్కడివారికి ఉద్యోగావకాశాలు, వ్యాపార లాభాలు కోల్పోతున్నామని కొందరు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై వ్యతిరేక ప్రదర్శనలు చేస్తున్నారు. యూకే ప్రధాని కీర్ స్టార్మర్ మాత్రం వలసకారుల వ్యతిరేక ప్రదర్శనలు సహించబోమని అని అంటున్నారు. దీంతో ఆందోళనకారులు ప్రధానిపై విమర్శలు చేస్తూ వలస కారులను తిరిగి పంపేయండి అంటూ నినాదాలు చేస్తున్నారు.



సౌతాఫ్రికాతో టెస్టులో బుమ్రా అరుదైన ఘనత

- ఎక్కువ సార్లు ప్రత్యర్థి బ్యాటర్ ను క్లీన్ బౌల్డ్ చేసిన భారత మూడో బౌలర్

సౌతాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులో భారత్ దూకుడు మీదుంది. టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న సౌతాఫ్రికాను టీమిండియా బౌలర్లు అద్భుతంగా కట్టడి చేశారు. జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్ కీలక వికెట్లను పడగొట్టారు. ఈ క్రమంలోనే బుమ్రా తన టెస్టు కెరీర్‌లో మరో అరుదైన ఘనతను పొందాడు. ఓపెనర్లు ఐడెన్ మార్క్రమ్ (31), ర్యాన్ రికెల్టన్ (23) జంటను బుమ్రా అద్భుతంగా విడదీశాడు. రికెల్టన్ 10.3 ఓవర్ లో క్లీన్ బౌల్డ్ చేశాడు. దీంతో అరుదైన రికార్డు కూడా సాధించాడు. టెస్టులలో బుమ్రాకు ఇది 97వ వికెట్. అంతర్జాతీయంగా అత్యధికసార్లు ప్రత్యర్థి బ్యాటర్లను క్లీన్ బౌల్డ్ చేసిన భారత మూడో బౌలర్‌గానూ బుమ్రా నిలిచాడు. ఈ క్రమంలోనే అతడు మాజీ స్పిన్ బౌలర్ రవిచంద్రన్ అశ్విన్ (151 బౌల్డ్)ను దాటేశాడు. ప్రత్యర్థులను ఇలా క్లీన్ బౌల్డ్ చేసి ఔట్ చేయడం బుమ్రాకు ఇది 152వ సారి. ఈ జాబితాలో మాజీ ప్లేయర్లు అనిల్ కుంబ్లే (186) అగ్రస్థానంలో ఉండగా, కపిల్ దేవ్ (167) రెండో స్థానంలో ఉన్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక క్లీన్ బౌలింగ్ చేసిన భారత బౌలర్లు: 186 అనిల్ కుంబ్లే, 167 కపిల్ దేవ్, 152 జస్ప్రీత్ బుమ్రా, 151 రవిచంద్రన్ అశ్విన్, 145 రవీంద్ర జడేజా ఉన్నారు.

తొలి రోజు టీమిండియాదే పైచేయి

- 159 పరుగులకే చేతులెత్తేసిన సౌతాఫ్రికా

సౌతాఫ్రికాతో కోల్ కతా ఈడెన్ గార్డెన్స్ లో జరుగుతున్న తొలి టెస్టులో టీమిండియా పట్టుబిగించింది. దిశగా సాగుతోంది. శుక్రవారం ప్రారంభమైన ఈ టెస్ట్‌లో భారత్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో ఒక వికెట్ నష్టానికి 37 పరుగులు చేసింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ 12 పరుగులే చేసినా, కేఎల్ రాహుల్ 13 పరుగులు వాషింగ్టన్ సుందర్ ఆరు పరుగులతో ఆడుతున్నారు. సౌతాఫ్రికా బౌలర్లలో మార్కో జాన్సెన్ వికెట్ తీసాడు. భారత్ ఇంకా 122 పరుగుల వెనుకబడి ఉంది. అంతకుముందు సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 159 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు ఎయిడెన్ మార్కరమ్ 31, వియాన్ మల్డర్ 24, ర్యాన్ రికెల్టన్ 23, టోనీ డీ జోర్జి 24 పరుగులు చేశారు. భారత బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా ఐదు వికెట్లు తీసి సఫారీల వెన్ను విరిచాడు. మహమ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్ రెండేసి వికెట్లు తీయగా, అక్షర్ పటేల్ కు ఒక వికెట్ దక్కింది. ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికాకు ఓపెనర్లు ఎయిడెన్ మార్కరమ్ (31), ర్యాన్ రికెల్టర్ (23) శుభారంభం అందించారు. దూకుడుగా ఆడిన ఈ జోడీ తొలి వికెట్‌కు 57 పరుగులు చేసింది. ఈ జోడీని బుమ్రా విడదీసాడు. ర్యాన్ రికెల్టన్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. మరుసటి ఓవర్‌లోనే మార్కరమ్‌ను పెవిలియన్ పంపించాడు. కెప్టెన్ టెంబా బవుమా(3)ను కుల్దీప్ యాదవ్ ఔట్ చేశాడు. కైల్ వెరైన్ (16), మార్కో జాన్సెన్(0)ను సిరాజ్ ఒకే ఓవర్‌లో ఔట్ చేయడంతో సౌతాఫ్రికాకు కోలుకోలేని దెబ్బ తగిలింది.

ముంబై జట్టులోకి కీలక క్రీడాకారులు

- తిరిగి రానున్న శార్దూల్ ఠాకూర్, రూథర్ ఫర్డ్

ఐపీఎల్ కోసం ఆటగాళ్లను రిటైన్ చేసుకునే గడువుకు ముందే ముంబై ఇండియన్స్ అద్భుతంగా ట్రేడ్ డీల్స్ చేసుకుంటోంది. ఈ క్రమంలోనే రెండు ఒప్పందాలను తాజాగా ఖరారు చేసుకుంది. ఇద్దరు మాజీ ఆటగాళ్లను తిరిగి తమ జట్టులోకి చేర్చకుంది. అభిమానులు ముద్దుగా లార్డ్‌గా పిలుచుకునే భారత ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్‌ను లక్నో సూపర్ జెయింట్స్ నుంచి కొనుగోలు చేసింది. 2025 వేలంలో అమ్ముడుపోని శార్దూల్‌ను, గాయపడిన మొహ్సిన్ ఖాన్ స్థానంలో రూ. రెండు కోట్లకు సొంతం చేసుకుంది. గత సీజన్‌లో పది మ్యాచులలో 13 వికెట్లు తీసిన శార్దూల్ ఎట్టకేలకు సొంత జట్టుకు తిరిగి వచ్చాడు. ఈ ట్రేడ్‌లో భాగంగా అర్జున్ టెండూల్కర్‌ను లక్నోకు ఇచ్చే అవకాశం ఉందని అంటున్నారు. శార్దూల్ రాకతో ముంబై ఇండియన్స్‌కు లోయర్ ఆర్డర్‌లో బలం పెరిగే అవకాశం ఉంది. వెస్టిండీస్ స్టార్ ఆల్‌రౌండర్ షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్‌ను గుజరాత్ టైటాన్స్ నుంచి ముంబై దక్కించుకుంది. రూథర్‌ఫోర్డ్ ను నిరుడు గుజరాత్ రూ.2.6 కోట్లకు కొనుగోలు చేసింది. ఇప్పుడు అదే ధరకు ముంబై ఇండియన్స్ తీసుకుంది. రూథర్‌ఫోర్డ్ 2020లో కూడా ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి ముంబైకి వచ్చాడు. ఇంతకు ముందు ఆశిష్ నెహ్రా పేరిట ఈ ఘనత ఉంది. ఈ రెండు డీల్స్‌తో ముంబై ఇండియన్స్ ఐపీఎల్ 2026 వేలానికి ముందే తమ జట్టును పటిష్టం చేసుకునే దిశగా అడుగులు వేసింది.

ఐపీఎల్ తుది జాబితా వెల్లడికి నేడే తుది గడువు

- మెజారిటీ జట్లలో భారీ మార్పులకు అవకాశం

ఐపీఎల్ మినీ వేలం నిర్వహణకు బీసీసీఐ తన ప్రయత్నాలను వేగవంతం చేసింది. డిసెంబర్ 14వ తేదీన అబుదాబి వేదికగా ఐపీఎల్ మినీ వేలం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ఐపీఎల్ ఫ్రాంచైజీలు తమ రిటెన్షన్ జాబితాను ప్రకటించేందుకు శనివారం తుది గడువుగా నిర్ణయించింది. మినీ వేలం కాబట్టి ఆటగాళ్ల రిటెన్షన్ విషయంలో ఎలాంటి నిబంధన, పరిమితులు విధించలేదు. నచ్చినవారిని ఉంచుకుని, నచ్చనివారిని వదిలేయవచ్చు. ఈ ప్రక్రియను ప్రకటించేలోపే ఆయా జట్లు తమ డీల్స్ పూర్తి చేసుకోవాలి. మినీ వేలం ముగిసేలోగా ట్రేడింగ్ విండో ముగిసిపోతుంది. ఆ తర్వాత మళ్లీ ట్రేడింగ్‌కు అవకాశం ఉంటుంది. ఈ క్రమంలోనే ఆయా ఫ్రాంచైజీలు తమ ట్రేడింగ్ డీల్‌స్‌ను ప్రకటిస్తున్నాయి. ఐపీఎల్ రిటెన్షన్ తుది జాబితాలను శనివారం సాయంత్రం ఐదు గంటలకు ప్రకటించనున్నారు. విడుదల చేసే ఆటగాళ్ల వివరాలను కూడా వెల్లడించనున్నారు. ఐపీఎల్ 2025 విన్నర్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) రన్నరప్ పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ మినహా ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే), రాజస్థాన్ రాయల్స్, కేకేఆర్, ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్‌స్‌లో భారీ మార్పులు జరిగే అవకాశం ఉందని అంటున్నారు.

'బైకర్' నుంచి ప్రెట్టీ బేబీ సాంగ్ రిలీజ్

చార్మింగ్ స్టార్ శర్వా తన అప్ కమింగ్ మూవీ 'బైకర్' లో మోటార్‌సైకిల్ రేసర్‌గా ప్రేక్షకులను థ్రిల్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో యువి క్రియేషన్స్ ఈ సినిమాని నిర్మించింది. ఫస్ట్ లుక్, ఫస్ట్ ల్యాప్ గ్లింప్స్ తో ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేసింది. 'ప్రెట్టీ బేబీ' వీడియో సాంగ్ ని రిలీజ్ చేసిన మేకర్స్ బైకర్ మ్యూజిక్ ప్రమోషన్స్ ని కిక్ స్టార్ట్ చేశారు. జిబ్రాన్ ఈ పాటని అదిరిపోయే బీట్స్ తో డ్యాన్సింగ్ నెంబర్ గా కంపోజ్ చేశారు. జిబ్రాన్, యాజిన్ నిజార్, సుబ్లాషిని ఎనర్జిటిక్ వోకల్స్ తో ఆకట్టుకున్నారు. కృష్ణకాంత్ లిరిక్స్ చాలా క్యాచీగా వున్నాయి. ఈ సాంగ్ లో శర్వా, మాళవిక నాయర్ కెమిస్ట్రీ అదిరిపోయింది. శర్వా డ్యాన్స్ మూమెంట్స్ మెస్మరైజింగ్ గా వున్నాయి. ఈ సాంగ్ ఇన్స్టంట్ చార్ట్ బస్టర్ గా నిలిచింది. 1990, 2000 బ్యాక్ డ్రాప్ లో సాగే "బైకర్" రేసింగ్ యాక్షన్ తో పాటు ఎమోషనల్, మల్టీ జనరేషనల్ ఫ్యామిలీ డ్రామా. స్పీడ్, అంబిషన్, హార్ట్‌ఫెల్ట్ రిలేషన్‌షిప్స్ తో మూడు జనరేషన్స్ ఒకే రేసింగ్ కలతో, కుటుంబ బంధాలతో సాగే అద్భుతమైన కథ. ఈ సినిమాకి సినిమాటోగ్రఫీ జె. యువరాజ్, , అనిల్ కుమార్ పి ఎడిటర్. రాజీవన్ ప్రొడక్షన్ డిజైనర్. ఎ పన్నీర్ సెల్వం ఆర్ట్ డైరెక్టర్ గా వ్యవహరిస్తున్నారు, ఎన్ సందీప్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. బైకర్ డిసెంబర్ 6న థియేటర్లలో రిలీజ్ కానుంది.

సనాతన హిందూ ధర్మం శక్తి పరాక్రమం

'అఖండ2' లో చూస్తారు

- సాంగ్ లాంచ్ ఈవెంట్ లో నందమూరి బాలకృష్ణ

గాడ్ ఆఫ్ ది మాసెస్ నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ దర్శకుడు బోయపాటి శ్రీను పవర్ ఫుల్ కొలాబరేషన్ లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ డివైన్ యాక్షన్ ఎక్స్‌ట్రావగాంజా 'అఖండ 2: తాండవం'. రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఎం తేజస్విని నందమూరి సగర్వంగా చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఎస్ థమన్ సంగీతం అందించారు. ఫస్ట్ సింగిల్‌ది తాండవం ప్రోమోకు అద్భుతమైన స్పందన వచ్చింది. ఈరోజు, ముంబైలోని జుహూలోని PVR మాల్‌లో జరిగిన ఈవెంట్ లో పూర్తి పాటను లాంచ్ చేశారు. బాలయ్యకు హైవోల్టేజ్ సౌండ్‌ట్రాక్‌ల అదించే ఎస్.థమన్ 'అఖండ 2' కోసం మరోసారి డివైన్ ఫుల్ సాంగ్ ఇచ్చారు. ఈ పాటలో బాలకృష్ణ అఘోర అవతారంలో, అఘోర మంత్రాలతో దద్దరిల్లుతున్న భారీ ఆలయ ప్రాంగణంలో శివ తాండవం చేయడం గూస్ బంప్స్ తెప్పించింది. ప్రతి ఫ్రేమ్‌లోని డివైన్ ఇంటెన్సిటీ థమన్ ట్రేడ్‌మార్క్ పెర్కషన్ స్కోర్‌తో అదిరిపోయింది. శంకర్ మహదేవన్, కైలాష్ ఖేర్ పవర్ ఫుల్ వోకల్స్ పాటకు డివైన్ వైబ్ ని యాడ్ చేశాయి. లిరిసిస్ట్ కళ్యాణ్ చక్రవర్తి శివుని మహోన్నత శక్తిని పదాల్లో అద్భుతంగా మలిచారు. వినగానే గూస్‌బంప్స్ తెప్పించేలా ఈ పాట ఈ ఏడాది అత్యంత ప్రభావవంతమైన డివోషనల్ సాంగ్ గా నిలిచింది. ఈ చిత్రంలో సంయుక్త ముఖ్యపాత్రలో నటిస్తున్నారు. ఆది పినిశెట్టి ఓ పవర్ ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. హర్షాలి మల్హోత్రా కీలక పాత్రలో కనిపించనున్నారు. అఖండ 2: తాండవం డిసెంబర్ 5, 2025న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

తల్లి చేతుల మీదుగా అవార్డులను అందుకున్న

మధుర క్షణాల్ని గుర్తు చేసుకున్న సుప్రీం హీరో సాయి దుర్గ తేజ్

సుప్రీం హీరో సాయి దుర్గ తేజ్ తాజాగా వేసిన పోస్ట్ గమనిస్తే తన తల్లిపై ఎంత ప్రేమ ఉందో మరోసారి చెప్పకనే చెప్పినట్టుగా కనిపిస్తుంది. రోడ్డు ప్రమాదం నుంచి బయటపడిన తరువాత సాయి దుర్గ తేజ్ మరో జన్మను ఎత్తినట్టుగా ఎంతో జాగ్రత్తగా జీవిస్తున్నారు. అందరికీ రోడ్డు ప్రమాదాల గురించి అవగాహన కల్పిస్తున్నారు. హెల్మెట్ ప్రాధాన్యాన్ని కూడా చెబుతుంటారు. తాజాగా సాయి దుర్గ తేజ్ తనకు వచ్చిన అవార్డు, ఆ అవార్డుని అమ్మ విజయ దుర్గ గారి చేతుల మీదుగా అందుకోవడం గురించి పోస్ట్ వేశారు. పిల్లా నువ్వులేని జీవితం సినిమాకి గాను డెబ్యూ హీరోగా సినీ మా అవార్డును సాధించారు. అయితే ఆ మొదటి అవార్డుని తల్లి చేతుల మీదుగా సాయి దుర్గ తేజ్ తీసుకున్నారు. ఇప్పుడు మళ్లీ ఈ పునర్జన్మలో మొదటి అవార్డుని కూడా తల్లి చేతుల మీదుగానే సాయి దుర్గ తేజ్ తీసుకున్నారు. యూజెనిక్స్ ఫిల్మ్‌ఫేర్ గ్లామర్ & స్టైల్ అవార్డ్స్ సౌత్ 2025లో మోస్ట్ డిజైరబుల్ స్టార్ (మేల్) అవార్డుని తీసుకున్న క్షణాల గురించి సాయి దుర్గ తేజ్ ఎమోషనల్‌గా స్పందించారు. 'నా మొదటి జీవితంలో మొదటి అవార్డుని అమ్మ చేతుల మీదుగా తీసుకున్నాను.. నా పునర్జన్మలో మళ్లీ నా మొదటి అవార్డుని అమ్మ చేతుల మీదుగానే తీసుకున్నాను.. ఏ జన్మలో ఏ పుణ్యం చేసుకున్నానో తెలీదు.. నీకు కొడుకుగా పుట్టాను అమ్మా' అంటూ సాయి దుర్గ తేజ్ తన మధుర క్షణాల్ని గుర్తు చేసుకున్నారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200